చేయదలచెను. అటు లగునా. అలక్ష్మణుడు శశిరేఖను పెండ్లాడినటుల్ల అగును. నా బిడ్డను పెండ్లాడునది అటుండ నిమ్ము. దుర్యోధనచక్రవర్తికి సంబంధి యునిన చాలదా. నీవు నిబిడ్డకు చేయగా చూచి అనుభవించుటకు లేదు. ఈ పెండ్లినైనను చూచి సంతోషింపుము. కృష్ణుడు పెండ్లియని వ్రాయడా యునిన వానిజాబులను పంపరాదని బలరాముడు ఆజ్ఞచేసెను. బలరాముడును నీకు వ్రాయడు. మీరువచ్చిన కృష్ణుడు పెండ్లిచేయుననిమీకు వ్రాయడు. కృష్ణుడు వ్రాసిన నీకు చేరదు. కావున నేను వ్రాసితిని. అని దుర్యోధనుడు వ్రాసి భృత్యునిచేత నిచ్చిపంపెను. వాడు సాయంత్రసమయమున విదురునింటికి వచ్చి తలుపు కొట్టెను. భగవద్గీత 6 అధ్యా 26 శ్లో విదురుడు బ్రహ్మనిష్ఠలో నుండెను. అభిమన్యుడు వేటకు పోయియుండెను. సుభద్ర తలుపు తెరచెను. సేవకుడు ఉత్తరము నిచ్చి దుర్యోధనుడు పంపెనని చెప్పెను. ఓరీ దుర్యోధనునికిని నాకును సంబంధమేమిరా యని సుభద్ర ఆశ్చర్యముగా అదయేమో అజ్ఞ యని వాడిచ్చిపోయెను. సుభద్ర చదివెను. స్వామి యేమిచెప్పెనో దానిని తలచి నేను ఈశ్వరుడను సత్యకాముడను సత్యసంకల్పుడను అనెనే అదియును మారిపోయెనే పాండవులు పరదేశులైరి. పుత్రునికి పెండ్లికావలదు. వీడు యిటుల వ్రాసినే అన్న చెప్పినది తప్పినదని చూపించుటకు యిటుల వ్రాసినే. కృష్ణునిమనసు మారెనే. అన్న దాక్షిణ్యమును చూచియుండును. వానిమనసు మారకున్న పెండ్లియగునా. అని సుభద్ర చింతించి కృష్ణా నీకు చెలియలినై మహా వీర ధీరశూరుడైన అర్జునుని భార్యనైయుండి పరునింట భుజించునటుల నిలుచుంటిని. పాండవులు వనమునకు పోయినను నేను యిటు లుండినను నీ ప్రోత్సాహమువలన సంతోషించుచుంటిమి. నీమనసును మారిపోయెనే. ఈ దుఃఖము నెటుల సహించుదును అని దుఃఖించెను. కృష్ణా యింత శిక్షించియును తృప్తికలుగలేదా. కృష్ణా నిన్ను దూషించుచున్నా ననుకొనకుము. నిన్నే నుతించెదను. నీవు ఆదినమేటుల చెప్పితివి. మేము ఆట్టి పాపము చేసితిమి. నీవేమి చేయుదువు మాయొక్క కర్మము. నీవు సంచితలంపులతోనే చెప్పితివి. నీవామాట చెప్పకుండిన నాకు అంతదుఃఖము రాకుండును కదా. నీవు నీకోడలనినందునకదా. దుర్యోధనునకు నీయన్న మాట యేమారెనని. అధికదయాశరూ ద దనియుంటిని నీవు చెప్పినను సమ్మకుంటిని. నీవు ఒట్టిచెప్పినందునకదా దుఃఖము. ఇంను వలన నాకేమియు లేదు. నీయొక్క గొప్పతనమునకు తక్కువగును. ఇదిన్యాయమా. నాపై దయలేదా. అని ప్రార్థించి జాబు చూచి మాటలను గమనించి చెప్పకొనుటకు భర్త లేడేయనియు విదురుడు యోగనిష్ఠలో నున్నాడనియు చింతించి కృష్ణా నీ విప్పుడు రావలయును. చెల్లెలని కాకున్నను నమ్మినవారిని రక్షించువాడవు కదా. భగవద్గీత 9 అధ్యా 22 శ్లో యోగక్షేమనిర్వాహకుడవు కదా. కృష్ణా నీకు చెప్పిపంపవలయునా. అణువులో నణువై మహాత్ముకు మహాత్తుగ నుండువాడవుకదా. ఈ స్థూలస్థూలములోనుండి బయలుదేర రాదా. స్వర్గమునకై పోలేదా అసురబాలునికై పోలేదా. కరుణానిధి

యని నిన్ను వేదములు మొరలిడుచుండలేదా. అదయ యొచటికిపోయెను. లేక తే[illegible]
మైనను దాని దాచిపెట్టగా చెడిపోయెనా. ఎందుకు నిర్దయ తలిదండ్రులు బంధువు[illegible]
అచటచటనున్నారు. నిన్నువినా యెవరున్నారు. నీవు యొచటనుండుటనిజ మా[illegible]
నేని నేను ప్రలాపనము చేయుట తెలియదా. ఉన్నావో లేవో. ని న్నెందు వెదకుదు
నురా చతుర్ముఖుడైన బ్రహ్మదేవుని స్తోత్రమును విని రాని నీవు నాస్తుతి విని వత్తువా.
అని యేడ్చెను.

సుభద్రకు వాగత్తము చేసితిని. అది తప్పునటుల యేర్పడెను. అర్జునునికి
తన్ను యిచ్చినటులే అభిమన్యునికి వత్సలను యిత్తురని సుభద్ర నమ్మియున్నది. అయాశ
తీగపలయెను. వారు దుఃఖించవలయును అని భగవంతుడు ప్రేరేపణచేయగా దుర్యోధ
నుడు లేఖ వ్రాసెను. సుభద్రయేడ్వగా స్వామి అచ్చట ఆవిర్భవించి ఆమెయొక్క
కన్నీరు తుడిచి అమ్మా దుఃఖింపనేల అనెను. సు— అన్నా ఫూదోటలో వత్సలను
అభిమన్యునికి యిచ్చెదమంటివికదా. కృ— ఔను. సు— ఇటులాయెనే. కృ— తప్పిపో
యెనా. సు— పోలేదు. కృ— పోయినకదా దుఃఖము. సు— ఐన పెండ్లి యగునా. కృ—
అగును. సు— ఎపుడు. కృ— ముహూర్త మెపుడు పెట్టిరి. సు— రేపటికి. కృ— అపుడగును.
సు— ఎటుల వత్తును. కృ— నీకెందుకు యోచన. వచ్చిచేయుదువు, సు— ఏమి తీసికొని
వత్తును. కృ— అచింతనీకేల. యోగక్షేమ నిర్వాహకుడను నే నుండలేదా. సు— వాడిటుల
వ్రాసెనే. కృ— నేనుకదా వ్రాయించితిని. బలరాముడు వ్రాయడు. నీకు తెలియవలె.
ఆముహూర్తమున పెండ్లిజరుగవలయును అని వ్రాయించితిని. ఆలేఖలో వ్రాయబడినది త
యును స్తోత్రము. అర్థపాండిత్యము గలవారికి అర్థము సరిగ తెలియనందున అల్లాటము.
శిశుకునకు తెలియక యిచటిలను ఆగుగరు. నీకు అజాబుయొక్క అర్థము తెలియలేదు.
[illegible]యును అనుకూలముగ వ్రాయబడెను. సు— అన్నా అర్థము చెప్పుము. కృ— ఇపుడు
చెప్పను. అర్థము నిపుడు చెప్పితినేని నాపాండిత్యముచేత నటుల అర్థముచేసితి వందువు.
పెండ్లికాగనే చెప్పెదను. బిడ్డ వేటకుపోయి రాగనే భోజనమిడి బయలుదేరుము. సు—
ఈరాత్రియేకదా ఉన్నది. తెల్లవారగనే ముహూర్తము కదా. కృ— నీకేల ఆయోచన.
బయలుదేరి ద్వారకకు వచ్చి చేరుము. కృష్ణమూర్తి యిటులచెప్పి అంతర్ధాన మొందెను.
సుభద్ర ముఖము తుడుచికొని కృష్ణుడు ముందు యిపుడు చెప్పిన మాటలను స్మరించి
కొంత ఆప్యాయతనొంది యుండెను. కొడుకు వచ్చెను. వాడు వచ్చునపుడు అమ్మా
యని పిలుచుచు వచ్చును. విదురునిల్లు పరగృహమే కదా. వారెంత గొప్పగ నుపచరించి
నను మనసుకు కష్టముగనే ఉండును. శిశువు చంద్రుని మహామర్యాదతో ప్రీతి[illegible]
శిరమునుంచి రక్షించినను వృద్ధికారాదా కృశించియే యున్నాడు. పరగృహవా సము
కష్టము. కావున అభిమన్యుడు వచ్చునపుడే అమ్మాయనుచు ముఖము చూచుచు
వచ్చును. ఎవరేమనినేమిందురో యని ఆటుల వచ్చును. వాడు వచ్చి అమ్మాయని చూచి

గా దుఃఖించి కన్నీటిని విడచియుండెను. అభిమన్యుడు. అమ్మా సంగతియేమి చెప్పుము. సుభద్ర- మరేమియులేదు. మీరు చిన్నవయసున నుండగా పూదోటకు పోయియుంటిమి. మీరు ఆటలాడుచుండగా అన్న నన్ను పిలిచి అమ్మా నీకోడలినిచూడు మనెను. అదేటిమాట యంటిని. నామాట తప్పునా. సర్వేశ్వరుడను అనెను. జ్ఞాపక ముండ నిమ్మంటిని. ఆకన్యను దుర్యోధనుని కుమారునికి యీయబోదురట విని యేడ్చితిని. అ- అమ్మా వివాహము జరిగెనా. సు- లేదు. అ- చిన్నమామ చెప్పెనా. సు- చెప్పెను. అ- చెప్పిన తప్పునని తలచెదవా. సు- ఏమిరా చెప్పిన తప్పదా. అ- అదెటుల తప్పును. రేపు పెండిలి నిశ్చయము. సు- ఎవరికి. అ. నాకు. బయలుదేరుము. సు- చిన్నవాడవు యిటుల చెప్పుచున్నావేమిరా. అ- చిన్నవాడనా చిన్న అగ్ని కాల్చదా. అర్జునుని పుత్రుడను కానా. బయలుదేరుము. రేపు వారినెల్ల కొట్టి కన్యను తెచ్చెదనో లేదో చూడుము. అభిమన్యుడు యిటు లనగనే సుభద్ర వానికి భోజనముపెట్టెను. రాత్రికాగనే అమ్మా రథ మని అభిమన్యు డడిగెను. అచట విదురుని రథ ముండెను. విదురుడు పాండవ పక్షపాతియగుటచేత దుర్యోధను డతనికి సామాన్యమైన రథము నిచ్చియుండెను. ఓరీ దాని నడుగుమని సుభద్ర చెప్పగా అభిమన్యుడు విదురునియొద్దకు పోయి తాతా, రథము అనెను. విదురుడు ధ్యానయోగనిష్టలో నుండుటచేత యీమాట కష్టముగతోచి ఊ అనెను. కైకొనుమని చెప్పెనని తలచి అభిమన్యుడు రథము తీసికొని అమ్మా రథము గుర్రములు ఉన్నవి. సారథ్యము చేయువా డెవడనెను. సు- నేను చేసెదను. అ- అమ్మా నీకు తెలియునా. సు- ఏమనుకొంటివి. నీతండ్రిని వివాహ మాడినపుడును నేను రథము రాత్రిలో నడిపితిని. అపుడు కష్టములు సంభవించి నీతండ్రికి పెండ్లాయెను. నీకును అటులే అగునని తోచుచున్నది. అ- అమ్మా నీవు సారథ్యమెనర్చెదవా. సు- ఇటుల సంభవించునని తెలిసియే చిన్నమామ కృష్ణుడు బాలలీలలందే నాకు నేర్పెను. అ- అమ్మా రథము నడుపుము. చిన్నమామను దలచుచు పోవుదము. ఎవరైనను అడ్డము వచ్చిన చిన్నమామను తలచి కొట్టుదును. సంహరింపుదును. సు- అంధకారముగ నున్నదిరా (అభిమన్యుడు చిన్నమామను దలచి ఆగ్నేయాస్త్రమును విడువగా అది ముందు పోవుచుండెను. ఆప్రకాశములో సుభద్ర రథము నడుపుచుండెను.) కొంతవరకు మార్గముండెను. పిమ్మట మార్గము లేకుండెను. వృక్షములు యిటుల అటుల మొలిచియుండెను. బిడ్డా మార్గము లేదురాయని సుభద్ర అనెను. అభిమన్యుడు శూర వీర ధీరుడగుటచేత అల్లెత్రాడుగట్టి బాణము సంధించి సిద్ధుడై యుండెను. అమ్మా చిన్నమామను తలచికొనుము అనిచెప్పి తానును తలచి ఒకబాణము వేసెను. ఆబాణము యిటుల అటుల మార్గమును మరచియుండు చెట్లను కరకర కోసివేసెను. మార్గమేర్పడెను. పిమ్మట ఆచెట్లయొక్క వేరులు భూమికిమీదుగ నిలిచియుండెను. రథము పోవుచుండగా గడగడ శబ్దించెను. ఓరీ యీగుర్రములకు మంచిమార్గములో

పోవు వాడుక. మిట్టపల్లములుగ నున్నదిరాయని సుభద్ర అనగా అభిమన్యుడు అమ్మా చిన్నమామను స్మరింపుమని తానును స్మరించి ఒక బాణమును వేయగా అది ప్రక్కన నుండు కొండలను పొడిచేసెను. మార్గము చక్కపడెను. అమ్మా రథము నడుపుమనెను.

వారు పోవునపుడు హిడింబుని వనము వచ్చెను. హిడింబాసురుడు తనచెల్లెలగు హిడింబిని పంపి పాండవులను చంపి తెమ్మనగా అది భీముని వరించెను. వాడు రాగా భీముడు చంపెను. అది భీముని పెండ్లాడగా ఘటోత్కచుడు పుట్టెను. వానిచెలియలు హిడింబి. వారివనము ఇది. అచ్చట మనుష్యులు సంచరింతురా. అందునను రాత్రిలో సంచరింతురా. రథమురాగా రాక్షసులు రథశబ్దము విని లేచి చూడగా మార్గమేర్పరచబడి యుండెను. దీపము ముందు పోవుచున్నది. ఆనుది రథము నడుపుచున్నది. జానెడు బాలుడు మనవనమున వచ్చుటయా ఓరీ కాలవ్యత్యాసము లెండు అనిరి. వేలసంఖ్యాకులైన రాక్షసులు పరుండియుండిరి. ఇటుల చెప్పుకొని లేచివచ్చి అడ్డగించిరి. శ్రేయాంసి బహువిఘ్నాని మంచికార్యమునకు అనేకవిఘ్నములు వచ్చును. భగవదనుగ్రహముచేత అన్నియు మేలగును. సుభద్ర వారిని చూచి ఏమిరా రాత్రికాలము. నేను ఆడుదానిని నీవుచిన్నవాడవు. రాక్షసులు వేలసంఖ్యగ నున్నారు.రథము త్రిప్పుదునా. అనెను.అమ్మా చిన్నమామ పెండ్లిచేసెద ననియున్నాడు రేపు ముహూర్తము పెట్టియున్నారు. ఆయన మాట తప్పునా. తప్పవచ్చునా. కొంచెము బాగుగ స్మరింపుము. అని స్మరించిరి. రాక్షసులారా మీరెవరని అభిమన్యుడడుగగా ఓరీ! నీకు కాలము వచ్చెను. ఇపుడు నోట వేసికొనబోవుచున్నారము ఇది హిడింబుని వనము. అతడు లేడు చెలియలున్నది. ఆమె కొడుకు ఘటోత్కచుడు రాజుగ నున్నాడు. ఏల మావనము ఛేదించితివి. ఇదిగో రాచి వేయుదుము అని రాక్షసు లనిరి. అమ్మా భయపడకుము చిన్నమామను స్మరింపుమని అభిమన్యుడనెను. ఘటోత్కచుడెట్టివాడు సురాసురులు భీతిల్లుదురు. అట్టివాని వనము. అటులే మ్రింగుదుము.లేక రాచివేయుదుము అనిరి,రాక్షసులారా అనవసరకార్యము. తొలగుడు వలదు వలదు అని అభిమన్యుడనెను. ఓరీ యిది రాక్షస ప్రదేశము రాక్షసకాలము రాక్షసుల మనుష్యుల బలమును యోచింపవు. నీవు జానెడువాడవు. మేము తాటిచెట్ల పొడుగువారము. ఒరీ యనుచున్నావు. చిన్నవాడను తెలియక చేసితి ననిన మన్నింతుము. ఏల వనమును ఛేదించితివి. ఈచోటున నలిపివేయుదుము అని చోటును చూపిరి. ఓరీ.వారితో కలహింపకురా. రథము త్రిప్పెదనురా యని సుభద్ర అనగా అమ్మా అడుగడుగుకును అటులనకు మని చెప్పి చిన్నమామమాట తప్పరాదు ఆముహూర్తములో పెండ్లి కావలయునని ధనుసునెత్తి అల్లెత్రాడుగట్టి బాణమును సంధించి చిన్నమామను స్మరించి వేసెను. అది ప్రళయకాలాగ్నివలె బయలుదేరెను.అశోకవనమున యొనుబది వేలరాక్షసులు నిలిచియుండిరి. అందరికీ స్థలముండునాయనిన రాక్షసులు ఒకడు పరుండుచోటున వేవురు పరుండుదురు. సమయము వచ్చిన ఆకాశమువరకు

పొడుగుదురు. లక్షమంది వచ్చిరి. ఎడమచేతిని కరకర నరుకుచు పోయెను. ఒక క్షణమున అటుల చేసెను. భగవంతుని బలము అందరికిని చేతులు పోయి ఒకచేతితో నిలిచిరి. అభిమన్యుడు మరియొక బాణము నెత్తెను. ప్రాణముండ్డిన చాలునని తలచిరి. ఘటోత్కచుడు స్వస్థుడై నిర్భయుడై నిద్రించుచుండెను. అందరు పోయి ఒకచేతితో మహారాజా యని నమస్కరించి నిలిచిరి. ఘటోత్కచుడు మిద్దె మీద నుండి వీరిని చూచి ఒకచేత నమస్కరించుచున్నారేమిరా యనెను వారు వస్త్రమునుతీసి చూపిరి. సంగతేమని వాడనగా శత్రువు ఒకడు ఆడుదానితోడ వచ్చెను. ఒక దీపము ముందు వచ్చుచున్నది. చూచుటకు కాలేదు. ఒక గుర్రము అని చెప్పిరి. ఒరీ సిగ్గులేదా ఒకపర్యాయము పోరి చూడుడని ఘటోత్కచుడనగా యీ చేయియును పోవును. మీయుద్యోగము వలదు. అనిరి. ఈమాటలు విని ఘటోత్కచునికి కోపము వచ్చెను. ఒడలు వడకెను. ఒక మనుష్యుడు ఒక ఆడుది యిటుల చేసెనా యని మేడమీదినుండి దిగి పదికోట్ల రాక్షసులతోడ వచ్చి యెదుట నిలిచెను. ఓరీ వారందరిని చిన్నమామనుస్మరించి జయించితివి. వీడు వారందరితో సముడు. పెద్దవాడు. అనేకులతోడ వచ్చెను. రథము త్రిప్పుదునాయని సుభద్ర అనగా అమ్మా చిన్నమామనుమాత్రము స్మరింపుము. అని అభిమన్యుడనెను. ఓరీ నేను అల్పరాక్షసుడను కాను. ఘటోత్కచుడను అని వాడనగా నేనెవడను కృష్ణుని మేనల్లుడనని అభిమన్యుడనెను. అర్జునునిబిడ్డ అనలేదు. ఓరీ మాటలాడకుమనెదవా. మనుష్యుడు చిన్నవాడు అని తలచెదవా. చూచెదవా అని అభిమన్యుడు సింహనాదము చేసెను. వాడు భయపడెను. అభిమన్యుడు వానికి పైన సింహధ్వనిచేసెను. ఓరీ ఒక పెద్దపట్టణమాయె నేని జయించి స్వాధీనము చేసికొనవచ్చును. అడవి. ఎవరికి కావలయును. మంచిమార్గమునకు వచ్చిన బ్రతికి పోవుదువు. ఒకబాణము వేసెదను. అదిశిరము గిల్లివేయును తొలగెదవా తొలగవా ఇంతసంపదను పోగొట్టుకొని పోయెదవు అని అభిమన్యుడనెను. ఘటోత్కచుడు యిదివరలో నెవరిచేతను యిట్టిమాట వినినవాడుకాడు కావున వానికి కోపమువచ్చెను. వాడు సహించునా వాని వనము వారి కాలము. ఓరీ విడువుమనెను. అభిమన్యుడు చిన్నమామను స్మరించి బాణము వేసెను. ప్రళయకాలాగ్నివలె వచ్చెను. ఓహో ఆసామి లోపల నున్నాడురా అని ఘటోత్కచుడనుకొనెను. ఆసామి అనగా పురుషుడు. పురుషసూక్త ప్రతిపాద్యుడు కృష్ణుడు లోపల నున్నాడని అనగా మనసున నున్నాడని వేదాంతార్థము. బాణము వాని కంఠమునకు సూటిగ నిలిచిన కంఠము నిలువదని ఆకాశములో పోయి నిలిచెను. బాణము క్రిందుగ పోయెను. ఘటోత్కచుడు శిలా వృక్ష వర్షము గురిపించెను. అభిమన్యుడు చూచెను. ప్రతిబాణము వేయుటకు లేకుండెను. కొండలను 'వేసెదవు చూడుమని ఒక బాణము కృష్ణుని స్మరించి వేసెను. రాక్షసుడు యెన్ని వేసినను ఆబాణము వాని పొడి పొడిచేసి వేయుచుండెను. అభిమన్యునిమీద పడలేదు. ఒకగద నెత్తి త్రిప్పి మీద

వేయగా అది పోయి ఘటోత్కచుని గొంతుమీద కొట్టెను. వాడు తలతిరిగి క్రిందపడెను. అమ్మా వీడు పెద్దభూతమంటివే నాసామర్థ్యముకాదు చిన్నమామది అని అభిమన్యుడనెను. ఘటోత్కచుడు ఒక ముహూర్తము అటులే మూర్ఛనొందెను. శూరుడు భీమసేనుని కొడుకు కాబట్టి ఓరీ గదతో కొట్టెదవాయని వీరవాదము పలుకుచు ఆకాశములోపోయి ఒకశక్తిని వేసెను.ఆశక్తివచ్చి రొమ్మును భేదించి అభిమన్యుని ప్రాణము తీసికొనిపోయెను. సుభద్ర గుర్రమును కట్టి అభిమన్యుని తొడలో నుంచుకొని కృష్ణా వీడు బ్రతికియుండిన పెండ్లికాలేదందునని చంపుటకు తెచ్చితివా. ఇందుకా యుక్తి చెప్పి పోతివి నాపాతివ్రత్యమునకు భంగము కలుగునో. ఏకాకినైతినే అని బిడ్డను కౌగిలించుకొని యేడ్చెను. వాడు జయభేరివేసి తోడవచ్చినవారిని పిలుచుకొని పోయెను. సుభద్ర బిడ్డను కౌగిలించుకొనియుండి ముఖముచూడవలయునని కొంచెము విడిలి మోమున తనమోమునుంచెను. ఎంతయేడ్చినను వలదనువా రున్నారా. కృష్ణా కాపాడినను శిక్షించినను నీవే. పరమాత్మకు యెచ్చటను చెవులు కన్నులు అని వేదవాక్యము. భగవద్గీత 13 అధ్యా 14 శ్లో. అటులచెప్పబడెను. నీవు అట్టివాడవే. చెవుడాయెనా. కరుణాసముద్రా కావరా. పెద్దలు అంతకరుణాయున్నదని చెప్పుదురు. అని నమ్మి ప్రార్థించుచున్నానురా. ఔను కరుణాసముద్రుడనే అందరికిని సమునేనా యందువేమో భగవద్గీత 9 అధ్యా 29 శ్లోకమటుల నీవు శరణాగతులకు సముడవుకదా. శరణాగతి వ్యాచ్చిద్రకీవస! నిర్దిక్షిన్పద! పాపముచేసి కృష్ణకృష్ణయనిన పత్తునా యందువా నాపాపము నాతోనుంటే భక్తవత్సలుడను పేరెటుల నిలచునా. నీబిరుదుకు హానిరాదాదని చింతించుచున్నాను. భర్త వనమునకుపోయి బిడ్డపోయి మహావనమున అల్లాడవలయునని యేపాపి పల్లు పడెనో ఏపాపిశాపమో. కృష్ణా మిగుల ప్రీతితోనుంటివే నీబుద్ధి చెడెనే. ఈచలమేలరా. కొందరు తనవారిని అధికముగ దండింతురు. కీర్తిరావలయునని అటులచేయుదురు. వ్యాగమును కాపాడితివి. రాతిని నాతిని చేసితివి. ఆగజేంద్రుడు నీకేమి తాతనా. కోతులకేమి నితోడబుట్టినా. బలుగాయి నీకేమి అత్తయా. సామదానభేద దండోపాయముల తెలిసినవాడవు కదా. ఏయేసమయమున నేయేయుపాయము చేసి యెటులెటుల కాపాడవలెనో అటుల తెలిసినవాడవుకదా అని ప్రార్థింపగా స్వామికి తెలిసెను. తాను వచ్చుటకు లేదుగాన తన యోగమాయను పంపెను. ఆముసలియామె మందహాసముతో అమృతకలశమును చేతనుంచుకొని ఆభరణములు ధరించుకొని వచ్చెను. అమ్మా యేడ్వకుము. భయపడకుము. ఈయమృతకలశమున నీరెండుచేతుల నుంచుము. ఆచేతితో బిడ్డను తాకుము. వాడు లేచును అనెను. సుభద్ర అమృతకలశములో చేతులుంచెను. వచ్చినదుర్గ అంతర్ధానమొందెను. సుభద్ర అమృతస్పర్శమైన చేతితో అభిమన్యుని తాకగా పూర్వవాసన చేత ఓరీ ఘటోత్కచా యనుచు సింహముపిల్లవలె లేచెను. నిద్రించి లేచినటుల లేచి సింహధ్వనిచేసెను. అభిమన్యుడు వచ్చెనని ఘటోత్కచుడు

నిద్రించుచుండెను. అభిమన్యుడు లేవగనే సుభద్ర గట్టిగ కౌగిలించుకొని తండ్రీ మృతుడవై లేచితివి. ఒక ముసలిది వచ్చెను. అమృతకలశము నిచ్చెను. దాని స్పృశించి నిన్ను తాకగా లేచితివి అనిచెప్పెను. అమ్మా యుద్ధమున జయాపజయము లుండవా. ఒకపర్యాయము వాడు పడెను. ఒకపర్యాయము నేను పడవలదా. మనము యింటికి పోయిన చిన్నమామ కేమి గౌరవము అని చెప్పి అభిమన్యుడు సింహధ్వని చేయగా రాక్షసులు పోయి మహారాజా శత్రువు లేచెను. సింహధ్వని చేసెను. రం డనిరి. మీరు పొండని ఘటోత్కచుడు డనగా వారు పో మనిరి. సరియని ఘటోత్కచుడు బయలుదేరెను. కాలాత్యాసమని వానితల్లి అడ్డగించి ఓరీ యిదివరకు యిటుల జరిగెనా. కాలవైపరీత్యము. మరల పిలుచుచున్నాడు. పోయిన మరల రావని తోచుచున్నది. వలదురా అనెను. అమ్మా ఊరుడను. పోకుండవచ్చునా. ఎప్పుడైనను పోనా. ఇప్పుడే పోయెదనని ఘటోత్కచు డనెను. ఓరీ నీవు చచ్చిన నేమి గురుతు. ఎటుల తెలిసికొందు నని హిడింబి యడుగగా అమ్మా నాయింటిముందు యేడు తాటిచెట్లున్నవి. అవి నేను పడగా పడును. అని ఘటోత్కచుడు తల్లికి చెప్పి పోయి యుద్ధము చేసెను. అమృతకలశ స్పర్శ యున్నదిగాన అభిమన్యుడు చావడు. వాడు చచ్చెను. ఏడుచెట్లు ఒరిగెను. హిడింబి దాని తెలిసికొని యేడ్చుచు వచ్చెను. ఆకాశమువరకు ఒకేదేహముగలిగి తలవిరియబోసికొని వచ్చెను. ఓరీ అడుభూతము వచ్చెనురా యని సుభద్ర అనగా అడుదానికి భయమా అని అభిమన్యుడనెను. ఐదుయోజనముల శరీరమును బిడ్డాయని కట్టుకొనెను. దాని దేహ మెంతపెద్దదిగ నుండును మీరు చూచి నవ్వుకొనిరి. భయముగ నుండెను. అది యేడ్చునప్పుడు భీమా నిను పెండ్లాడితినికదా. ఎచట నున్నావురా హే ధర్మా నీధర్మ మెచటరా. అర్జునా నీ గాండీవ మెచటరా. నకులా సహదేవా అనెను. వీరికి సందేహము అడుగవలయునని తోచెను. అమ్మా అడ్డిగిరమ్మని అభిమన్యు డనగా సుభద్ర పోయి అమ్మా వరుసగ పాండవుల పేరులు చెప్పితివే నీకు వారేమికావలయును అని తిన్నగ అడిగెను. పాండవులకు నేనేమికావలయునో తెలియవలయునా. రమ్మని హిడింబి అనెను. అమ్మా సమీపమునకు పోకుమని అభిమన్యు డనెను. భీము డంటినే వాడు నామగడని హిడింబి చెప్పెను. ఈమె యిచట అతడు అనట ఆభూతమును యెచట పట్టెనని నవ్వుచుండిరి. నేను భీముని భార్యను. నీవెవరు అని హిడింబి అడుగగా నేను అర్జునితమ్ముని భార్యనని సుభద్ర చెప్పెను. హిడింబి సుభద్రను కౌగిలించుకొనెను. నాకొడుకు పోయినను పోనిమ్ము నీకొడుకు బ్రతికెనే అని హిడింబి అనగా అక్కా నాకొడుకు బ్రతికినటుల నీకొడుకును బ్రతుకు నని సుభద్ర తన అమృతహస్తమునో తాకగా ఘటోత్కచుడు అభిమన్యా యనుచు లేచెను. ఓరీ నీతమ్ముడురా యని హిడింబి చెప్పగా ఘటోత్కచుడు అభిమన్యుని ఆలింగనము చేసికొనెను. మనము లేచితిమి. మనకై అల్లాడిరే వారినికూడ లేపిన బాగుగనుండు నని ఘటోత్కచు డనగా

మంచిదని సుభద్ర వారిని తాకగా మునుపటికంటెను బలముతో వారు సజీవులైరి. సంగతేమని ఘటోత్కచుడడుగగా అభిమన్యుడు పెండ్లిసంగతి చెప్పెను. భగవంతుని మాటను నమ్మి బయలుదేరితిమి. అనేక విఘ్నములు వచ్చెను. దుర్యోధనునికి వాని మామ సహాయమని అభిమన్యుడు తెలుపగా యింతేకద నాకు మామలేడా యని ఘటోత్కచుడు మామాయని పిలువగా జాంబవంతుడను వాడు నూరుకోట్ల రాక్షసుల తోడ పైనుండి క్రింద దూకెను. ఘటోత్కచుడు సంగతిచెప్పి వనరాక్షసులు పోరి. నాకును తెలియక పోరితిని. భగవదనుగ్రహముచేత బ్రతికితిమి. రేపు ఉదయమున వివాహము. అనగా యింతే కద నేను వానికిని మామనుకదా యని అరచేయి తెరచి వారిని కూర్చుండుడనెను. గతియేమాయని సుభద్ర అనగా అమ్మా మామను మరువకుమని అభిమన్యుడనెను. వారిరువురును అరచేతిలో చక్కగ కూర్చుండులోపల అమ్మా ద్వారక దిగుడనెను. రైవతకపర్వత గుహకు ఒక క్షణములో వచ్చిరి. ఏమి భగవత్సంకల్పము. వచ్చిన కష్టము లెటుల పోయెను. ఘటోత్కచుడును మామయును ద్వారములోకి వచ్చిరి. కొంచెము అధికప్రసంగము చేయవలయును. కన్యను తేవలయును. కృష్ణుడు యేమనునో. ఏమైనను అన్నను అంత అగౌరవపరచవచ్చునా అనునేను కృష్ణుని చూడవలయును చెప్పి చేయవలయును అని తలచిరి. కృష్ణుడు తాను పోయినవ్వుడల పెండ్లి కావలయునని ఆపెండ్లికి పోక శిరోభారమని పరుండెను. రుక్మిణీసత్యభామలు పాదములు ఒత్తుచుండిరి. అబద్ధమైన జ్వరమని స్వామి వారితో చెప్పియుండెను. ఘటోత్కచుడు లోపలపోయి స్వామిని సుగుతీసి సుభద్రయును అభిమన్యుడును వచ్చిరనెను. ఏమి కావలయునని స్వామి అడిగెను. ఇటులచేసితిరి. అటుల చేసితిరని అనరాదని వారనిరి. సరి. అసందర్భముగ కార్యమును చెడుపకుడు కార్యమును శీఘ్రముగ ముగింపుడని స్వామి అనెను. అటులే చేసెదమని వారనిరి. మరియొకసంగతి దుర్యోధనుని భంగపరచి పంపుడు అని కృష్ణుడు చెప్పగా ఆహా సంతోషమని వారు పోయి రంభ ఊర్వశులతో సమానమైన రూపములు ధరించి ద్వారకవీధులలో పోయిరి. ఊరివారు దుర్యోధనునిభార్య యనుకొనిరి. వీరు బలరామునింటికి పోగా సంబంధియని మర్యాదచేసిరి. సంబంధికాదు. సంబంధికి భృత్యులమనిరి. వీరికి తగువిధముగ మర్యాదచేసి పంపవలయు నేయని వారు తలచిరి. ఎచటికి వచ్చితిరని వారడుగగా ఆభరణములు తెచ్చితిమి. సాధారణముగ వివాహకాలమున చేసిన నగలు వదులుగను బిగువుగను నుండును. పెండ్లి సమయమునకు సరిపడవు. అనేకవిధములైన కొలతలుగల నగలు తెచ్చితిమి. బిడ్డను మాతోడ పంపిరేని తగుమైన ఆభరణములు పెట్టిచూచి మరల తెచ్చెదము అని వారనిరి. ఏమి అదృష్టమని వారికి సంతోషము. అమ్మా పోయెదవా బహుఆభరణము నుతెచ్చియున్నారటనే అనగా కానిమ్మని వత్సల పోయెను. ఘటోత్కచుడు యెత్తుకొనెను. వానిదేహము కఠినముగ నుండగా వత్సల ముఖము చూచెను. ఇటుల పోయి

గుహ చేరగనే ఘటోత్కచుడు నిజరూపము జూపెను. వత్సల భయపడి హాయని యేడ్చెను. అత్తను జూడుమనగా అమ్మా రావేయని సుభద్ర అనెను. ఘటోత్కచుడు క్రిందదించెను. వత్సల సుభద్రను చూచెను. భయము తీరెను. అత్తయుని ఆలింగనముచేసికొనెను. బిడ్డను తెచ్చితిమి నీవుఉండికదా. పెండ్లిచేయవలయునని ఘటోత్కచ జాంభుకులనగా నేనురాకుందునాయని స్వామి అచట ఆవిర్భవించెను. ఒకరాక్షసుడు నవరత్నఖచితస్వర్ణపీఠ మాయెను. సుభద్రా చూచితివాయని స్వామి అనగా కృష్ణా అంతలోనే సంతోషమా. పరదేశిపెండ్లిగ నున్నదే యీగుహలోపల అని సుభద్ర అనెను. భగవత్సంకల్పముచేత గుహ వైకుంఠ మాయెను. పందిరికాళ్ళుగ రాక్షసులైరి. లస్తుగ రాక్షసులు వ్రేలాడిరి. సుభద్రా చూడుమని స్వామి అనగా బాగుగనున్నది. ఊరిలో పెండ్లిజరిగిన తలిదండ్రులు మొదలగు యెందరు వత్తురని సుభద్ర అనెను. అటులా యెందరు కావలయునో చూడుమని స్వామి అనెను. బ్రహ్మదేవుడు సరస్వతితోడను పరమశివుడు పార్వతితోడను వచ్చిరి. హాహా హూహూ గంధర్వులును రంభఊర్వశి మొదలగువారు నాట్యము చేయుటకును వచ్చిరి. సకలదేవతలును వచ్చిరి. అమ్మా చూచితివాయని స్వామి అనగా నీయనుగ్రహమని సుభద్ర అనెను. అమ్మాబిడ్డ పడగనే యేమని దూషించితివో నాకు తెలియదా. నాడే చెప్పియుండియును దూషించితివే యని కృష్ణు డనెను. అన్నా పురోహితులెటులని సుభద్ర అడిగెను. ఘటోత్కచా పురోహితుడు కావలదా. రాక్షసుడు కూడదు. వశిష్ఠ వామదేవాదులు తపమాచరించుచున్నారు. అటులే యెత్తుకొని రండు అని స్వామి అజ్ఞాపించగా వారు యిచట నొకకాలును అచట నొకకాలును ఉంచిరి. భగవంతునియొక్క లీల. మహర్షులు భగవద్గీత 6 అధ్యాయమువలె ధ్యానించుచుండిరి. వీరినెటుల పిలుతుము. అటులైన వారు లేచి కన్నుతెరచిన భస్మమగుదుమే అని యోచించి రాక్షసులు కొంతదూరము విడిచి భూమిని యెత్తి మెల్లగ తెచ్చి వారు లేచుటకై క్రిందకొట్టిరి. వారు కన్నుతెరచి శపింపబూడగా కృష్ణుడుండెను. కృష్ణా యెన్నిదినములుగ కోరుచుండగా బలాత్కారముగ పిలిపించి దర్శనమిచ్చితివేయని స్తుతించిరి. వచ్చినవారిలో కొందరు కృష్ణుని మరికొందరు నృసింహుని రాముని ఉపాసించువారు. కృష్ణమూర్తి వారివారికి ఆయా మూర్తులుగ దర్శనమిచ్చిరి. వారు స్వామిని స్తుతించిరి. ముహూర్తము చూడుడని స్వామి అనగా స్వామీ జాతకము తప్పుగ నుండుటచేతను లగ్నముపెట్టినవారి తప్పుచేతను పంచాంగములో తప్పుగ పడుటచేతను చెప్పువారి పొరబాటుచేతను దోషము లుండునని నీచరణారవిందములు స్మరింతురు. ఇక నీవు సమీపమున నుండగ మేము పంచాంగము చూచి ముహూర్తము పెట్టవలయునా అని ఋషులనిరి. పార్వతి మొదలగువారు శృంగారించిరి. వారువారు బహుమతు లిచ్చిరి. ఇంతకును పాండవుల భక్తియే కారణము. బంధుత్వము కాదు. పెండ్లి ఆయెను. సుభద్రకును అర్జునునకిని

జరిగినటుల జరిగెను. అందరు ఆశీర్వదించి పోయిరి. కృష్ణుడును పోయెను. ఘటోత్కచా అనగా. అందరును మాయమైరి. పందిరి అన్నియును పోయెను. అందరును మాయమై యుండిరి.

ఇక అచ్చటి సమాచార మేమనగా ఘటోత్కచుడు వత్సలగ నాయెను. మామ యెత్తుకొనిపోయి బలరామునింట విడిచెను. అమ్మా ఆభరణములు మాచితివా. ఆహా అమ్మా నిభాగ్యమే అని యొడిలో కూర్చుండబెట్టుకొనగా భారముగ నుండెను. ఆభరణముల భారమనుకొనిరి. వత్సలకు శృంగారించిరి. అల్లుని పిలుచుకొని వచ్చిరి. భగవంతుడుతప్ప అందరు వచ్చియుండిరి. నానాదేశముల రాజులు వారిభార్యలు వచ్చియుండిరి. కన్యాదానార్థమై రేవతియును బలరాముడును సిద్ధులైయుండిరి. నిజమైన వివాహము ఇంతకుముందె జరిగెను. అబద్ధమైన పెండ్లి ఆరంభమాయెను. ఏలననగా అచ్చట భగవంతుడు లేడు. మామా మరియొక వేడుక చేయవలయునని ఘటోత్కచుడనెను. ఇద్దరు రాక్షసులు సాహుకారులైరి. వారు బలరామునియొద్దకు వచ్చి ఒకానొక గొప్పవర్తకుని పేరుచెప్పి మీస్నేహితుడగు అతడు వస్త్రములు మొదలగువాని అంగడిపెట్టవలయునని చెప్పిరి. బలరాముడు వారికి ఒకవీధి యిచ్చెను. ఆవీధిలో రాక్షసులు అంగడిపెట్టిరి. ఆయంగడిలో అమ్మువారును సరకులును ఒక్కొకవస్తువును రాక్షసులుగ నుండిరి. ఒక బ్రాహ్మణుడు పురోహితునికై పోవుచుండి రాక్షసుల అంగడిప్రక్క పోయెను. ఆబ్రాహ్మణునిశాల్వ ప్రాతదిగ నుండినందున అతడు ఆయంగడికి పోయెను. మీరెవరని వారడిగిరి. దుర్యోధన చక్రవర్తియొక్క పురోహితుడనని ఆబ్రాహ్మణుడనెను. సరి వారితో చేరినవారికి ప్రాతదిగైకొని క్రొత్తది యిచ్చెదమని వారనిరి. తొమ్మిదిమూర ఉండవలయునని బ్రాహ్మణుడనగా వారిచ్చిరి. బ్రాహ్మణుడు కొలతవేయగా యేడు మూరలుండెను. ఏమయ్యా తొమ్మిదిమూర లుండవలయు ననగా యేడుమూరలిచ్చితిరని బ్రాహ్మణుడనెను. వారు ఆశాల్వను దీసికొని మడిచి తట్టి మరల నీయగా పండ్రెండుమూర లుండెను. అతడుపోయి ఆసంగతి అందరికి చెప్పగా అందరువచ్చి ఆ యంగడివారియొద్ద వస్త్రాభరణాదుల పుచ్చుకొనిరి. ఆయంగడివారు దుర్యోధనచక్రవర్తిని అంగీకరింపు మనిరి. మీరు అంగీకరింపవలయునని బలరాముడును చెప్పగా దుర్యోధనుడును అంగీకరించెను. పెండ్లికూతురు ఆకలి అనగా ఫలహారము చేయుమనిరి. వంటవారిముందు ఫలహారము సేయుటకు ఆకన్య సిగ్గుపడగా వారు అవలికి పోయిరి. ఆకన్య తలుపుమూసికొని యిరువదిలక్షలమందికై యేర్పాటుచేసియుండినదాని నంతయు భుజించెను. రాత్రి వంటచేయుటకై కాయగూరలు మొదలగునవి ఉంచియుండిరి. అంతయును ముగించి అచ్చటనుండిన రెండుబావులజలము త్రాగెను. ముఖము తుడుచుకొని మరల వత్సలరూపముతో నుండెను. వంటలవారువచ్చి భక్ష్యములు మొదలగు వానితో సమస్తమును మాయముకాగా యజమానుడు తిట్టునేయని అల్లాడిరి. వివాహము

జరుగుటకుముందు పెండ్లికూతురికిని పెండ్లికుమారునికిని మధ్య అంతరపటమను గుడ్డను
మరుగుగ కట్టుదురు. మంగళముపాడి ఆగుడ్డను తీసివేయగా బాలుడును బాలికయును
అక్షతలు వేసికొందురు. కన్యరూపముతోనుండు ఘటోత్కచుడు యీలోపల గోరును
పదును చేసికొని ఆగుడ్డక్రింద చేయిచాచి లక్ష్మణునితొడలో గిల్లెను. హాను బాధపడు
చుండెను. అటుల నాలుగు పర్యాయములు కాగా సింహము రాగా యేనుగు అరచు
నట్లు అరచెను. ఇదేమని దుర్యోధనుడు చూడగా రక్తము మాంసము తెలియుచుండె
ను. ఘటోత్కచుడు తనరూపముతో లేవగా అందరు వారివారి స్వరూపములతో
బయలుదేరిరి. వస్త్రములుగను ఆభరణములుగను నుండినరాక్షసులందరును లేచిరి.అందరు
వివస్త్రులైరి. భగవంతునికిని భగవద్భక్తులకును విరోధులైనయెడల యిటు లగును.
పైనవర్ణింపబడ్డిన భానుమతి వివస్త్ర ఆయెను. స్త్రీపురుషులెల్లను పరుగులిడుచు
వచ్చి రథమునకు పైనున్న ధ్వజములను చించి కౌపీనములుగ నుంచుకొనిరి. అందరును
పుట్టినపుడెటులుండ్రిరో అటులుండ్రిరి. కృష్ణుడు యీసభలోనుండిన నిటులగునా యని
తలచిరి.వత్సల యెచ్చటయని వెతుకగా లేకుండెను.కృష్ణునివ్యాపారమని కృష్ణుడు పరుం
డినస్థలమునకు పోయి కృష్ణా యనగా అన్నా పెండ్లియాయెనా. అనిస్వామి యనెను.
కన్యకానమని బలరాముడు చెప్పగా కృష్ణుడు దుఃఖించెను కృష్ణుడు అధికముగ యేడ్వ
నారంభింపగనే బలరాముడు మొదలగువారందరును ఊరివారందరును యేడ్వనారంభిం
చిరి.బిడ్డను పెండ్లాయెను. వీరందరును యేడ్వరాదని స్వామి నారదుని తలపగా నతడు
వచ్చెను, బిడ్డసుఖమాయనగా ఉన్నది, పెండ్లాయె ననెను. వివాహమా ' యెవరికిచ్చి
యనగా సుభద్రకుమారునికిచ్చి యనెను. ఎటుల నెరిగియు ననగా నేను పోయియుంటి
ని. పాటకచ్చేరి ఆయెననెను, ఆహా క్షేమమాయని సంతోషించిరి, అందరును నచ్చ
టికి పోయిరి, కృష్ణుడు సుభద్రను చూచెను, ఆమె నమస్కరించెను, సుభద్రా కన్యను
నే నీయకున్నను భగవంతుడు చేసెను, పెండ్లి యెవ్వరు చేసిరని బలరాము డడుగగా
సుభద్ర ఘటోత్కచుని చూపెను.ఎందుకిటుల చేసితిరనిన రాక్షసులు చంపుదురను భయ
ముచే బలరాముడు సంతోషము సంతోషమనెను. రాక్షసులందర్గును సురూపములతో
ద్వారకకు పోయిరి. అచ్చట తక్కిన శుభకార్యములు చేసిరి, కృష్ణా నాకర్త
యుండిన నెంత సంతోషపడునని సుభద్ర అనగా పాండవులు రావలయునట
యని స్వామిచెప్పెను,ఘటోత్కచుడును జాంఘికుడును పోయిరి, పాండవులను ద్రౌప
దిని తెచ్చిరి, వనవాసము వినపిమ్మటనే క్రింద దిగవలయునని వారిని దించలేదు. వారు
పైన నిలిచి వైభవము చూచిరి. మేము ఊరిలోనుండి వివాహము చేసిన నిటులగునా,
మేము అడవిలో నున్నాము భగవంతుడు యోగక్షేమము వహించెను, ఇటుల నడిపె
నని ప్రశంసించి కృష్ణుని నాలింగనము చేసికొనిరి, వారు పోవునపుడు ఆదివరలో నను
భవించిన కష్టములు పోయెను, వారిని తీసికొనిపోయి విడిచిపెట్టిరి, భగవంతునియొద

నిజభక్తి సల్పినయెడల ఆయన మన యోగక్షేమములను వహించును. ఈకథ స్కాందభవిష్యోత్తర పురాణములలో విస్తారముగ చెప్పబడెను.

— —

(36) సౌగంధికాహరణము.

బృహదశ్వుడు నలహరిశ్చంద్రులకథలు చెప్పి పోగానే పాండవులు దేవలోకమునకు పోయిన అర్జునునిరాకను నిరీక్షించుచుండిరి. అర్జునుడు ఇంద్రకీలపర్వతమునకు పోయి పాశుపతాస్త్రము పుచ్చుకొని రాలేదాయని ధర్మరాజు చింతించగా చింత యేల అనుచు నారదుడు వచ్చెను. వనవాసము ముగియవచ్చెను ఊరికి పోయిన కూర్చుండవలసివచ్చును, తీర్థములు సేవించుచు భూప్రదక్షిణము చేసినయెడల బాగుగనుండునని ధర్మరాజు అనగా చేయుడని నారదుడనెను. తీర్థస్నానములు భూప్రదక్షిణమువలని ఫలమేమని ధర్మరాజు అడుగగా నారదుడు ఆయాతీర్థముల నామములను మహిమలను చెప్పుచువచ్చి నేను వీణ నెత్తుకొని తిరుగుచుండువాడను, నీవు సమర్థుడవు ధౌమ్యాచార్యులున్నారు. పోయి రమ్మనెను. నారదుడిట్టుల తీర్థములను వర్ణించిచెప్పగా ధర్మరాజునకు పోవలయునని తోచెను, నారదుడిపుడు చెప్పిన ఆయాతీర్థములకు పోవలయును. మీరును మాతోడవచ్చి ఆయాతీర్థములను తెలిపి తీర్థయాత్రను చేయింపవలయునని ధర్మరాజు అనగా ధౌమ్యాచార్యులు సమ్మతించి వారిని పిలుచుకొనిపోయి స్నానములు చేయించి ఆయాతీర్థముల మహిమలు చెప్పుచువచ్చిరి. దీనికి ధౌమ్యతీర్థయాత్ర యని పేరు. ఒకదినము ధౌమ్యాచార్యులతో మాటలాడుచుండగా రోమశుడను మహర్షి వచ్చెను. అర్ఘ్యపాద్యములచేత నుపచరించి నమస్కరించి యెచటినుండి వచ్చితిరని ధర్మరాజు ప్రశ్నచేసెను. నేను దేవలోకమునుండి వచ్చితినని రోమశుడు చెప్పెను. దేవేంద్రుని చూచితిరా విశేషమేమని ధర్మరాజడుగగా అచటివిశేషములు తెలిసియేయున్నవి కదా. ఇపుడు అర్జునుడు విద్యాభ్యాసముచేసి నివాతకవచులను చంపి దేవేంద్రుని అర్థాసనములో కూర్చుండి యున్నాడు. వచ్చెదను అన్నతో చెప్పుమని అర్జునుడు చెప్పెను. నాకొరకై చెప్పుమని ఇంద్రుడును చెప్పెను అని రోమశుడు చెప్పెను. పాండవులు కైలాసపర్వతము మొదలు గ్రుమ్మరివచ్చిరి. గంధమాదనపర్వతమునకు పోయిరి. ఆప్రదేశమునకు రాజగు సుబాహుడు వారిని మిగుల ఉపచరించెను. వేటగాండ్రకు రాజగు సుబాహుచేత నుపచరింపబడి మందరపర్వతమునకు పోయిరి. రాళ్ళు మొదలగు వానిచేత ఆప్రదేశము కష్టముగ నుండెను. దీనికి రోమశతీర్థయాత్రయని పేరు. కొంచెము శ్రమపడి రండి మంచి తీర్థములని రోమశుడనెను. మీరందరును నావీపున కూర్చుండుడని భీముడు వారిని నెత్తుకొని పోయెను. పర్వతాగ్రమునకు పోయిరి. అచట నరకాసురుని అస్థి ఉండెను. ఇదేమనగా భగవంతుడు వానిచంపెనని అనగను చెప్పిరి. వా

డెవడనగా భూదేవిపుత్రుడు అదెట్టులనగా వరాహావతారకథ చెప్పెను. భీమసేనా వారు తమ్ములు ఆమె భార్య మేము కూర్చుండుటకు సంకోచముగ నున్నదని ఋషి యనగా ఘటోత్కచుని దలపగా వాడువచ్చి భీమునిసహా యెత్తుకొనిపోయెను. బదరి కాశ్రమమునకు పోయిరి. బదరి యనగా రేగుపండు. ఆచెట్లు అచ్చట విశేషముగ నుండుటచేత దానికా పేరు. నరనారాయణాశ్రమమునకు పోగా అచట ఒకవిశేషము. నిత్యమును దేవతలును దేవర్షులును దర్శనార్థము వచ్చుచోటది. అచట గంగయున్నది. అనరనారాయణాశ్రమమున కొంతకాలముండి గంగలో స్నానముచేయుచు నరనారాయణులను సేవించుచుండిరి. అర్జునుడుమాత్రము లేడు. లోమశునివలన అర్జునునికథ విని సంతోషముతో అచ్చటచట తీర్థస్నానము చేయుచు ఋషులను సేవించుచు బదరికాశ్రమమునకు పోయిరి. ఈలోకాభిమానము నే విడిచినవారు అచట నరనారాయణులను సేవించుచు తపసుచేయుచుండిరి. అంతరంగము అనగా లోపలనుండు అంగము, ధర్మపుత్రుడు ఇంతకుమునుపు అంతరంగమను ఒక అంగముచేత క్షమను తాకుచుండెను. అనగా ఓర్పుకలిగియుండెను క్షమయనగా భూమియని మరియొక అర్థము. ఇపుడు యెనిమిది అంగములచేత నైటి యింకొక క్షమను (భూమిని) తాకెను. అనగా సాష్టాంగముగ నమస్కరించెను. ధర్మపుత్రాదులకు నరనారాయణులు కడగంట చూచుటచేత యిన్నిదినములు అనుభవించినశ్రమ పోయెను. కవియిట్లులనిరి. జననమరణాత్మకమై భయమై విశాలమై దుస్తరమై యుండు సంసారసాగరమును నరనారాయణుల కడగంటిదృష్టి తరింపజేయును. ధర్మపుత్రాదుల దుఃఖముపోవుట ఆశ్చర్యము కాదు. అచ్చటచట పోయి ఆయాతీర్థ స్థలములను సేవించితిమి. విశేషముగ నుండెను. కొన్ని దినము లుంటిమి. ఐనను యీచోటు విశేషమైనది అని ధర్మపుత్రుడు తలచెను. ఆహా శకుని జూదమాడి సర్వస్వమును హరించి పంపినందునకదా వనమునకు వచ్చితిమి. బదరికాశ్రమములో నరనారాయణులను సేవించితిమి. ఇది శకుని ఉపకారము అని ధర్మపుత్రుడు తలంచెను.

ఇటుల సుఖముగ కాలక్షేపము సేయుచుండగా నొకదినము సౌగంధిక మను పుష్పము గాలికివచ్చి పడెను. ఆపుష్పము పద్మమువలె నుండును. వేయుదళములనుగలిగి సూర్యోదయమైనటుల ప్రకాశించుచుండెను. ద్రౌపది దాని చేతనెత్తుకొని వాసనచూచెను. దివ్యగంధము గలిగియుండెను. ద్రౌపదికి పాండవులందరును పతులైనను ధర్మపుత్రుడు వేదాంతి. అధికముగ మాటలాడడు. న్యాయప్రకారము నకులసహదేవులు భర్తలైనను తమకంటె పెద్దవారు ముగ్గురుండుటచేత సిగ్గుచేత వారు మాటలాడరు. భీముడు మొరటువాడు. అర్జునుడు ద్రౌపదితో సరససల్లాపము లాడుచుండును. అతడు లేనందున భీముడు గమనించుచుండును. కావున సౌగంధికపుష్పము పడినతోడనే ద్రౌపది దానినెత్తుకొని భీమునివద్దకు వచ్చెను. ఇంతకాలముగ నిచట ఉన్నారము. ఇట్టిపుష్ప

ము చూడలేదు ఎచటదొరకెనని భీము డడిగెను. అందుకే వచ్చితిని. ఇట్టిపుష్పములు మరియును కావలయునని ద్రౌపది అనెను. ఎచటినుండి యిది పడెనని భీము డడుగగా గాలితో వచ్చి పడెనని ద్రౌపది చెప్పెను. గాలిలో వచ్చి పడినదాని నెటుల తేగలను. ఇది ఎచటనుండెను. స్త్రీలు అభరణములను అడుగుదురు. ద్రౌపది అటు లడుగలేదు. పుష్పము నడుగుచున్నది. వెతకిచూచెదను. భయమేమి అని భీముడు గద నెత్తుకొని బయలుదేరెను. నామీదవాస్తవమైన ప్రీతియుండిన తెచ్చెదరు. అర్జునుడైన తేగా యని ద్రౌపది అనెను. ఇక క్షణమైన నుండరాదని భీముడు బయలుదేరెను. ద్రౌపదీ అర్జునుడు లేడని దుఃఖింపకుము. వాడు చేయుపని నేను చేయనా. వాడు నాజ్ఞానుగ చేయును. నేను చతుర్విధోపాయములచేత దెత్తును. కొన్ని పుష్పములుమాత్రమా వేలసంఖ్యగ తెచ్చెదను అనెను. ధర్మరాజు వేదాంతి. ఈసంగతి ఆయనతో చెప్పినయెడల భీమా అంతచనవు యిచ్చిన అడుగదా అనును. ద్రౌపదిని పిలిచి చనవిచ్చినాడని యిటుల అడుగనగునా అనును. ఇది యొక కార్యమా అన్నతో చెప్పుటకు. నావలన కాలేదని చెప్పరాదా అని కోపించును అనితలచి భీముడు గద నెత్తుకొని బయలుదేరెను. అపుష్పమును గాలి ద్రౌపదిముందు వేయనేల అనగా భర్త భార్యకు తెచ్చియిచ్చుటకు సిగ్గుపడును. మామగారు కోడలికై తెచ్చి యిచ్చును. వాయుదేవుడు పాంచాలికి మామగారగుటచేత తెచ్చెను. అపూవును వాసన చూడగా యిదివరకు పడ్డశ్రమము పోయెను. మిగుల వాసనగ నుండెను. చూడచూడ మరియు చూడవలయునని తోచెను. కల్హారము సౌగంధికమని పేరు. అది ఉత్తరము నుండి వచ్చినందున భీముడు అదిక్కులో పోయెను. అనేకపర్వతములను దాటవలసి యుండుటచేత భీముడు యాపర్వతమున నొకకాలును అపర్వతమున నొకకాలును నుంచుచు నడినచ్చిన దాటుచు పోయెను. అపుడొక పెద్ద కోతిని చూచెను. ఆయన యెవరనగా సాక్షాత్ హనుమంతుడు. అతడు కింపురుష ఖండమున ధ్యానము సేయుచుండెను. నిద్రించునటుల తోచెను. కవి యిటు లనిరి. హనుమంతుడు లంకను కాల్చినపుడు నిద్ర పోయి నన్ను రక్షింపుమని కుంభకర్ణుని పాదముల బడెను. భయపడకుము కాపాడెదనని అతడు అభయమిచ్చి తనకన్నులలో అనిద్రనుంచుకొని కాపాడెను. అనగా కుంభకర్ణుడు నిద్రపోవుచుండెను. హనుమంతుని ధ్యానము కుంభకర్ణుని నిద్రను పోలియుండెను. హనుమంతుడు చిరంజీవి. నిర్జనప్రదేశములో ధ్యానముచేయుచుండెను. భీముడు హనుమంతుని చూచియుండలేదు. అయుగమున హనుమంతుడు పెద్దకార్యము చేసెననిమాత్రము వినియుండెను. ఈతడయని తెలియదు. కావున ఓకోతీ దుష్టకోతివిగ నున్నావు. నేను వచ్చుట తెలియలేదా. అవలికి పొమ్ము నీవు తోకను కొండవలె యెంతదూరము చాచితివి. ఎటుల పోదును. ఒకక్షణము తాళను. త్వరగ పోవలయును. రాచివేయుదును. లెమ్ము. హేమూఢా. నీవు సమర్థుడవైన నొకచేత గదతో వచ్చుచున్నాడని తెలియలేదా. నీవు బుద్ధిలేని కోతివి. నాగద నిన్ను కండకండ

లంగను తుండతుండములుగను చేయును. లెమ్ము అనెను. హనుమంతునికిది చెవిలో పడలేదు. భగవద్గీత 6 అధ్యా 25 శ్లోకమువలె మనస్సును రామునియెడ నిలిపి ధ్యానము సేయుచుండెను. నిద్రలో కలవరించుచున్నాడనుకొనెను. మనస్సను పీఠమున రామునినుంచి నామములను భక్తియను పుష్పములతో పూజించుచుండెను. అటు లుండగా కోతీ లెమ్మనెను. భీమునికి అన్నయని తెలియదు. తమ్ముడని హనుమంతునికి తెలియును. పసివాడు గర్వముతో నిలుచుచున్నాడు కొంచెము సరిపరచి పంపవలయునని తలచి హనుమంతుడు యీమాట విని లేచినందుకు గురుతుగ కొంచెము తోకను కదిలించెను. కోతీ బుద్ధిలేని కోతివి. అందునను చెవిటికోతి యని భీముడు గట్టిగ అనెను. నాయనా ముసలివాడనగుటచేత వినలేదని హనుమంతు డనెను. ఏల అరచెదవు. తిన్నగ చెప్పరాదాయని కోపించక పెద్దలు మాటలాడవలయునని హనుమంతుడు చూపెను. నీవు మహారాజాధిరాజుగ నున్నావు. నీగద రూపముచేత నిన్ను చూడగనే లేచిమర్యాదచేయవలయును. ముసలితనము. దానితోడ నిద్ర. ఇప్పుడైనను లేవవలయుననిన రెండుగంటలగును. నీవు ఒకక్షణమైన తాళననుచున్నావు. ఒక కార్యము చేసెదవా. నాతోకను కొంచెము యెత్తి అటులవేసి పోయెదవా. తండ్రీ హింసింపకుము. కొట్టకుము. నేను తిర్యగ్జాతిని. దానిలో అధమజాతిని. తిర్యగ్జాతిలో పుట్టిననేను తిర్యక్కుగా (అడ్డముగా) కూర్చుండియున్నాను. నీకు యెంతస్థలము కావలయునో అంతవరకు తోకకడపట కొంతత్రోసి పోయిన బాగుగ నుండును. నిదానించినయెడల లేచెదను. లేకున్న తోకను త్రోసి పొమ్ము. అని హనుమంతు డనెను. హనుమంతుడు యిటులచెప్పగనే అదిలేచువరకు అవకాశము లేదనియు కోతిచెప్పినది నిజమనియు తలచి భీముడు కోతీ నీవుచెప్పినది మిగుల సరి. నిన్ను దాటజాలనని తలచెదవా. హనుమంతుడు సముద్రమును దాటినటుల అనాయాసముగ దాటుదును అనెను. నన్ను మాత్రము తెలియలేదు. నాసమాచారము వినియున్నాడనితలచి నీవు అటులచేయువాడవని తలచియే చెప్పితినని హనుమంతు డనెను. తోకను యెత్తుటకు అగునో కాదో అని సందేహముచేత భీముడు గదను క్రిందఉంచి అంగవస్త్రమును నడుముకు కట్టి రెండుచేతులతో తోకను నెత్తబోయెను. ఎత్తలేక పోయెను. సమీపమునకు వచ్చి నమస్కరించి, కోతీ నీవు సామాన్యుడవు కావు. భూమండలమును యెత్తుదును. నీతోకను కదిలించలేకపోతిని. నీవెవరు అనెను. సరి ఆసంగతి అటుండనిమ్ము. హనుమంతుడు సముద్రమును దాటినటుల అంటివే వాడెవడు. సంగతిచెప్పుమని హనుమంతు డనెను. నమ్రతతో బదులు చెప్పుచున్నావు. స్నేహముగ మాటలాడుదము. హనుమంతుడు నాయన్న అతడు వాయుదేవునికి పెద్దభార్యకుమారుడు. నేను చిన్నభార్య కుమారుడను అని భీముడు చెప్పగా, హ- వానిసంగతి చెప్పుము. భీ- అది యిపుడు చెప్పుటకు కాదు. రామాయణమును చూడుము. కడవరకు తెలియును. హ- తోకను త్రోసిచూడుము. భీ- నావలన కానేరదు. ఆశ్చర్యము. అవమానముగ నున్నది.

కోతి కోతీ యని పిలిచితివే. నీవు కోతివి కావు. నీవు దేవతలలో నొకడవుగ నుండవలయును. ఏదేవత కుమారుడవు. వానరరూపమే గాని యొక గొప్ప దైవముగ నుండవలయును. చెప్పుము. హా— తండ్రీ యిపుడు నీయున్నయని చెప్పుకొంటివే, సముద్రమును దాటిన ఆపెద్దకోతిని నేనే నేను. అని హనుమంతుడు చెప్పగనే, అన్నా యని భీముడు ఆలింగనము చేసికొనెను హనుమంతుడు రామాయణముసంగతి యంతయు చెప్పెను. అన్నా యేమి రామావతారము. ఏమి రామకైంకర్యము నేను రామాయణము చెప్పి చదివి దినదినము పారాయణము చేయుచున్నాను. ఆరాముని మనసు మీకే తెలియవలయును. ఎందరో కోతులున్నారు. ప్రయోజనమేమి. రాముడు పరబ్రహ్మము. సృష్టి స్థితి లయములు చేయువాడు. ఈసంగతి వాతాత్మజునికి తెలియవలయు ననిరి. అటుల రాముని అంతరంగము మీకే తెలియును అని ఆలింగనము చేసికొనెను. రాముని హృదయమునకు పరమతృప్తుడను రాముని హృదయరంజకుడను అని హనుమంతుడు చెప్పుకొనెను. భీమునికి మిగుల సంతోషమై నమస్కరించి, అన్నా నాకొక అపేక్ష యున్నది. మీరు మిగుల పెద్దలు. కష్టపెట్టెదను హనుమంతుడు దాటినటుల దాటును నంటినిగాని ఆరూపము చూడలేదు. సముద్రమును దాటినపుడు యెత్తినరూపమును చూపినయెడల దాటియుండునని నమ్మెదను. నామీద అనుగ్రహముండెనేని చూపవలయును అని భీముడనెను. చూడుము. భయపడకుము. పెద్దకోతిగ నున్నది. రామాయణము వింటివే అప్పటికోతులలో నొక కోతిగ నుండరాదా యని తలపకుము. అవసరపక్షి యెన్ని దుర్భాషలాడితివి. రమ్ము అని హనుమంతుడు నవ్వి చూడుమనెను. ముఖము తెలియలేదు. సూర్యమండలమునకు మీద పోయెను. సముద్రము దాటిన రూపము జూపెను. హనుమంతుడు సీతను వెతుకునపుడు చిన్నకోతిపిల్లగ నుండగా సముద్రమును దాటితివని యెటుల నమ్ముదును ఆరూపమును చూపుమని సీత అడిగెను. హనుమంతుడు చూడుమనిచూపెను. సూర్య చంద్రమండలములు దాటెను అటులచూపెను. బలిచక్రవర్తియొద్ద మూడడుగులు దానముగొని కొలిచి వశపరచుకొనుటకై స్వామి త్రివిక్రమావతారమెత్తెను. ఆరూపము హనుమంతునియొడ్డిలో నొకబిడ్డగ పరుండవచ్చును. హనుమంతుడు సీతకు అట్టిరూపము జూపెను. ఆరూపము నిపుడు భీమునికి చూపెను. ఈరూపముచేత భీముని గౌరవము తగ్గెను. అంతమాత్రముకాదు. సముద్రముయొక్క గాంభీర్యము తగ్గెను. అది చిన్నకాలువగ తోచెను. సముద్రముయొక్క గాంభీర్యమును తగ్గించినరూపము భీమునిగర్వమును అడపదా. భీముడు అంజలిచేసియే అన్నా అన్నా అనుచుండెను. అన్నా యిదివరకు తమకథలను దలచి అనుసంధానము చేయుచుంటిని. ఆయన్నను చూతునా. పుస్తకమున చదువవలసినదియే యని తలచియుంటిని. తమదర్శనమాయెను అని ధర్మరాజు నరనారాయణుల సేవకై శకునిని ప్రశంసించినటుల, భీముడును శకునిని స్తుతించెను. మరియును అనేకవిధముల స్తుతించి అన్నా సముద్రమును

దాటిన రూపమును చూడలేను. భయముగ నున్నది. నిద్రపోవునటుల ఉండినరూపము ను చూపుము అని భీముడనెను. భీమా భయపడకుము. నీవు చూపుమంటివని యీకద చూపితిని. మరపితినేని మరలరాదు. బాగుగ చూడుమనెను. ఏమిరా. ఈరూపమును చూచితివే సముద్రమును దాటియుందునాయని హనుమంతు డనగా అన్నా ఒకసము ద్రముకాదు. ఏడు సముద్రములు దాటవచ్చునని భీముడనెను. హనుమంతు డారూపము ను మరపి భీముని పిలిచి గాఢాలింగనము చేసికొని నేను రామకైంకర్యమునకు పుట్టితిని. నీవు కృష్ణకైంకర్యమునకు పుట్టితివి. కోతియని యెంచియుంటివి. సముద్రముదాటిన సకల రామకైంకర్యనిర్వాహకుడను. ఎటుల మాట్లాడితివి. శాంతములేక సౌఖ్యములేదు. ఎంతవిద్వాంసుడైనను బలశాలియైనను ఐశ్వర్యవంతుడైనను భగవద్గీత 5 అధ్యా 21 శ్లో కమటుల శాంతములేకున్న ప్రయోజనము లేదు. శాంతరసము పరమసుఖము. అన్ని కష్ట ములును కోపమువలననే అని నాల్గుయుగముల వానిధర్మముల సంగతులను ఉపదేశించి యొచ్చుటకి వచ్చితి వనెను. భీముడు సంగతిచెప్పి తమదర్శనమాయె ననెను. గంధమా ధనపర్వత శిఖరమున సరస్సున్నది. అది అచట నున్నది. అద్భుతపుష్పము. వేలసంఖ్యగ నున్నవి. అదికుబేరుని సరస్సు. అనేకులు కావలియుందురు. నేనును వత్తునా యని హనుమం తుడనగా అన్నా వలదు. మీరు వృద్ధులు రామధ్యానము చేయుచుండుడు. అనుగ్రహి ఉంచుడు అపుష్పమును తెచ్చి చూపి పోయెదనని భీముడనెను. హనుమంతుడు భీముని ఆలింగనము చేసికొని యుక్తివాదములుచెప్పి నాయనా నేను అన్ననగుటచేత కోపము రాలేదు. తమ్ముడవుకాబట్టి సంతోషించితిని. లేకున్న ముష్టిప్రహారములచేత చంపియుం డనా. అధికప్రసంగము వలదు అనిచెప్పి హనుమంతుడు తమ్ముని విడిచెను. అన్నను విడిచిపోవుచున్నానని భీముడు కన్నీగ విడిచెను. అనేకులు వచ్చుచుందురని హనుమం తుడు కింపురుషఖండముకు పోయెను. అచట దేవతలే సంచరించుచుందురు. ఉపదేశ ...యుచు వినుచు ఉందురు. బ్రహ్మవాదు లుందురు. భీముడు పోవుమార్గమున మహ ...లు వేదాధ్యయనము చేయుచుండిరి. పరబ్రహ్మస్వరూపమును యెత్తిచెప్పు వాక్యము ... వినబడెను. ఇచటనే యుండవలయునని తోచెను. వినుచు పోగా క్రమము వినెను. భగవద్గీత 13 అధ్యా 5 శ్లో, 8 అధ్యా 13 శ్లో, 15 అధ్యా 15 శ్లోకములవలె వేదప్ర తిపాద్యమూర్తిని వేదమును తెలిసినవారు చెప్పుచుండిరి. కృష్ణుడే దైవము. పరబ్ర హ్మమనిన కృష్ణుడే అని హనుమంతుని జూచుటకు మునుపు భీముడు తలచియుండెను. హనుమంతునితో సల్లాపముజరిగిన పిమ్మట ఒకపర్యాయము రామాయణము చూచెను. నాకులదైవము కృష్ణుడు. నాయన్నకులదైవము రాముడని రామునిసహా పట్టుకొనెను. ఇటుల కృష్ణనామగర్జనము రామనామగర్జనము చేయుచు పోయెను. భీముడు హనుమం తునియు తగువు పొంది హనుమంతునిదలచి రామచంద్రుని వారిపాదమున హనుమం తుని ధ్యానించుచు కృష్ణుని ధ్యానించుచు పోయెను. గంధమాధనపర్వతమును చూచె

ను. హనుమంతుడే యనుకొనెను. హనుమంతుడు కొండవలెనుండెను. భీముడు కన్ను మూసి తలచుచుండినందున అటులే తోచెను. కొండనుచూచి అన్నాయనెను. కన్ను తెరచి ఓహో కొండయా అనుకొనెను. ఇటుల గంధమాధనపర్వతమునకు పోయి చేరను. హనుమంతుడు చెప్పియుండినందున కొండయెక్కెను. అచ్చట తటాకమును చూచెను. అది కుబేరునిది. అచ్చట లక్షోపలక్షలుగ యక్ష రాక్షస కిన్నర కింపురుషులు కాగలియుండిరి. అచటనుండిన హంసపక్షులు భీముని చూచి భయపడి ఒకటియును ఉండక పరుగెత్తిపోయినవి. కుబేరునికీర్తి పరుగెత్తిపోయినటు లుండెను. ఇచ్చటికి మనుష్యులు రారను కీర్తియుండెను. భీముడు దానిలో దిగగనే ఆకీర్తి పోయెను. భీముడు వలసినంత జలము త్రాగెను. ఆతీర్థము అమృతతుల్యమైనది భీముడు దాని గ్రోలి మిగుల అందముగను వాసనగను నుండిన సౌగంధికపుష్పములను అన్నిటిని కోసికొనెను. అన్ని పుష్పములను కోసికొనిన చూచుచుండువారు ఊరకుందురా. వారికి కోపము వచ్చెను. వారు భీమునిమీదికిరాగా భీముడు అన్నను స్మరించుచు గదను వేసెను. ఆయన చెట్లను విరిచి వేసినటుల యీయన గదను వేసెను ఒకడులేక చేసెను. భీమునిచేత దెబ్బలుతినిన పనివారు సహించలేక కుబేరునియొద్దకుపోయి ఒకమనుష్యుడువచ్చి పుష్పములనన్నిటిని కోసికొనెను. ఒకటియైనను లేదు అనిచెప్పిరి. ఏమిరా లక్షలుగ నున్నారేయని కుబేరుడనగా సాధ్యముకాలేదనిరి. కుబేరుడు ధనాఢ్యుడు. అష్టదిక్పాలురలో నొకడు. సామాన్యుడుకాడు. అతడు సంగతి విని ఓరీ మీకు తెలివిలేదా ఒకలక్షమందిని కొట్టినతోడనే మీకుసాధ్యముకాదనితలచి నాతో చెప్పరాదా. దెబ్బలుతిని వచ్చితిరే అనెను. స్వామీ నవ్వుచున్నారే సేనాపతికి ఉత్తరువీయుడని వారనిరి. బుద్ధిహీనులారా అతడు విడిచియుండినయెడల ఆపుష్పములను సహా తీసికొనువాడు. వాడెవడు సాక్షాత్ వాయుకుమారుడు. పాండుపుత్రుడు. దేవకార్యార్థమై అవతరించెను. కృష్ణభక్తుడు. వానిభార్య పతివ్రత. ఆమె అడిగెను. అజ్ఞుడు లేడు. వాడుండిన వచ్చియుండును. పుష్పముల నన్నిటిని గైకొనుడనుడు. మీరుచేసిన అపరాధమునకై నను క్షమింపుడు అని కుబేరుడు చెప్పిపంపెను. వారు చెప్పిరి. భీముడు తనశక్తియని తలపలేదు. కృష్ణుడు మాయింటికి దూత ఆచార్యుడు బంధుడు గురుడు సకలకార్య నిర్వాహకుడు. వానిదయ. శ్రీరామునిదయ. అంతమాత్రమేకాదు. నా అన్నయొక్క అనుగ్రహము అనితలచి అంతయును భగవదనుగ్రహమని కూర్చుండియుండెను. బదరికాశ్రమమున పెనుగాలివచ్చి పక్షుల అపశకునములను కాగా ధర్మరాజు అర్జునుడు క్షేమముగ నుండవలయునని తలచి చెప్పుకొనుటకై భీమాభీమా అనెను. భీముడు పలుకలేదు. పాంచాలితో మాటలాడుచున్నాడని లేచివచ్చి ద్రౌపదీ భీముడెచట అనెను. ఆమె చెప్పక గుటకలు మ్రింగుచుండెను. పాంచాలీ నీకు మిగుల చనువునిచ్చినారు. ఊరకుందువు. పంపితివా నిజముచెప్పుము అని ధర్మరాజు అనగా ఆమె సంగతి చెప్పె

ను. అయ్యో ఆపుష్పము యెచట నున్నదో వాడు శీఘ్రముగ రావలయునే. ఆచార్యా రెండు. భార్య అడిగెనేయని అధికప్రసంగి సంతోషముగ పోయెను. పరబ్రహ్మమును వెదుకబోయెను. అని ధర్మరాజు భీముని వెదుకబోయెను. నాలుగుపర్వతములను దాటగా వారికి పోవుటకు సాధ్యపడలేదు. కుమారుని (ఘటోత్కచుని) తలపగా వాడువచ్చి వీరిని రెకెత్తుకొని పోయి భీముడుండు స్థలమున దించెను. ధర్మరాజు ఆపుష్పములు చూచి పాంచాలి చేసినది మిగుల యుక్తమైనకార్యము. ఇట్టిపుష్పముచూచి యెవరైన అడుగకుందురాఅనెను. భయపడియుండిన భీముడు అన్నా అందుకే వచ్చితిననెను. ధర్మరాజు అచ్చటకన్నులు కాళ్ళు పోయియుండినవారిని చూచి యిదేమిరా కుబేరుని నడుగరాదా అనెను. దీనికై అడుగవలయునా. అడ్డగించిరి. కొట్టితి ననెను. ధర్మపుత్రుడు మన్నింపవేడుచు కుబేరునికి చెప్పిపంపెను. తమ్ముడు మొరటువాడు. తమతో చేరినవారిని హింసించినాడని చెప్పిపంపగా కుబేరుడు ధర్మరాజు వచ్చినాడని తలచి, కానుకలు యిచ్చి ప్రార్థించినను వత్తురా. భాగ్యమనెను. అచటనే కుబేరుని ఆదరముచేత అర్జునుని రాకను నిరీక్షించుచు ఆశ్రమమేర్పరచుకొని యుండిరి. పుష్పము తెచ్చినవెందులకు పాంచాలికొరకుకదా. సిగ్గుపడినసెటుల అనితలచి అన్న ధౌమ్యాచార్యులతో మాటలాడుచుండగా భీముడు పుష్పరాశిని పాంచాలియొడిలో పోసెను. మిమ్ము మిగుల శ్రమపెట్టితిని. అన్నతో చెప్పక వచ్చితిరి. అందరము చేరితిమి. అర్జునుడు వచ్చువరకు యిచ్చటనే ఉందము అని పాంచాలి ప్రియముతో చెప్పెను.

---

(37) అర్జునాగమనము.

ఇచటిప్రదేశములు రమణీయములైనవి. మిగుల సాత్వికములైనవి. భీముని పిలుచుకొని బహుదూరము ఉత్తరముగ వచ్చితిమి. మరియును కొంతదూరము పోవలయును. వచ్చినదుష్టులను చూచుకొనుటకు భీముడున్నాడు. సకల ఆపదలను పోగొట్టి కాపాడుటకు అంతర్యామియైన స్వామి ఉన్నాడు. పోదమని ధర్మరాజు తలచెను. ఇక పోవలను. మనుష్యులు పోరాదని అచటివారు చెప్పిరి. భీముడును స్వామియును సహాయులని ధర్మరాజు బయలుదేరగా, ధర్మపుత్రా మీరు దేవాంశసంభూతులైనను యిపుడు మనుష్యులేను. దేవత్వముండిన దేవతలవలెను మానుషత్వముండిన మనుష్యులవలెను ఉండవలయును. సహాయమున్నదని పోరాదు అని అశరీరవాణి పలికెను. భగవంతుడు సాక్షాత్తుగ చెప్పినటులాయెను. ఇక పోరాదని ధర్మపుత్రుడు నిలిచెను. దేవసంచారమట్టి. మనము పోదమనిన అశరీరవాణి కలదనుచున్నది ఏమియేర్పాటని యుధిష్ఠిరుడు ఆశ్చర్యపడెను. ఇటుల అశరీరవాణి పలుకగా మరల బదరికాశ్రమమునకు వచ్చిరి. నరనారాయణాశ్రమముచేరి తోడవచ్చిన అనేక బ్రాహ్మణులను పాంచాలిని నకులసహదేవులను

భీముని నుంచుకొని ధర్మపుత్రుడు మిగుల సుఖముగ నుండెను. రాజ్యము పోయి అడవిలో నుండగా సుఖమెటుల కలిగెననగా, భీముడు కుబేరునివిషయమున అపచారపడెను. కుబేరుడు సామాన్యుడుకాడు. భగవద్గీత 10 అధ్యా 23 శ్లో కుబేరుడు నేనని స్వామి చెప్పెను. త్వమాత్మా సర్వభూతానాం అనినటుల స్వామి తల్లి. భగవంతుని విషయమున అపచారపడినను యోచనలేదు. ఈభీముడు భాగవతుల విషయమున అపచారపడెనే స్వామికి కోపమువచ్చునని తలంచితిని. కుబేరుడు కోపించక ఆదరించెను. అని ధర్మపుత్రునికి ఒకవిధమున సంతోషము. అర్జునుడు రాలేదని చింతించుచుండగా సమీపములోనే తమ్ముడు వచ్చునని రోమశుడను మహర్షి చెప్పెను. అర్జునుడు వచ్చుననియు భీముడు బ్రతికెననియు ధర్మరాజు మిగుల సంతోషముగ నుండెను. ఒకతమ్ముడు బ్రతికెను. ఒకతమ్ముడు వచ్చును. ఇద్దరు తమ్ములును పాంచాలియు నున్నారు. వేదాంతవిచారమునకు బ్రాహ్మణు లున్నారు. ధర్మరాజిటుల సుఖముగ నుండగా, భీముడు భుజించి కూర్చుండువాడు కాడు. వేటకు పోయెను. జటుడు అను అసురుడు భీముడులేని సమయము చూచుచుండెను. భీముడులేనిసమయము వానికెటుల తెలియును. వానికెవరు తెలియచేయుదు రనగా వాడు పాండవులతోడ నుండెను. ఆసంగతి భీమునికి తెలిసిన సంహరింపడా. కావున వాడు బ్రాహ్మణులమధ్య నొక బ్రాహ్మణుడుగ నుండెను. వాడు మిగుల బుద్ధిమంతుడు. యోచనలోను అస్త్రశస్త్రములలోను నేర్పరిగ నుండెను. బ్రాహ్మణులు మిగుల బుద్ధిశాలియని తలచిరి. వాడు పాండవులకు అంతరంగప్రియుడై యుండెను. భీముడు పోగనే జటాసురుడు ధర్మపుత్రుని నకులసహదేవులను పాంచాలిని యెత్తుకొని దక్షిణముగ పోయెను. ధర్మపుత్రు డేమిసేయును. వృద్ధుడు. వేదాంతి. ఆపద్బంధు దయాసింధు దీనబంధును తలచెను అర్జునా భీమా మీరుండిన యిటు లగునా అని మరల వారినేల తలపవలయునని ఆపద్బంధుని తలచెను. మనసా నీవు పోయి స్వామిని పిలుచుకొని రమ్ము. మనసులో తలచిన స్వామికి తెలియును. మనోనియామకు డతడు. తలచునప్పటికి తెలియును. వచ్చును. వచ్చిన సౌభాగ్యభాగ్యములు కలుగును. చిన్న నాటినుండియు కాపాడెను. ఇపుడు తలచిన వచ్చును. ఆపదలు పోవును. శాశ్వతసుఖము కలుగును. ఆహా వీడు సమయము చూచి యెత్తుకొనిపోవుచున్నాడు. స్వామి యెట్టివాడనగా ఆపదలు యెవరికి వచ్చునో యెవరు పాపులో యెవరికి దిక్కులేదో యెవరు భక్తులో వారిని కాపాడెదనని పట్టము కట్టుకొని యున్నాడు. వసిష్ఠుని గురువుగ చేసికొనినవాడు కోటిమన్మథరూపుడు. త్యాగరాజు మనసున సంచరించువాడు అనియిటుల ధర్మరాజు తలచుచుండెను. రక్షించుటకు స్వామి రావలయునా పాండవులను తలచెను. భగవదనుగ్రహముచేత సహదేవునికి కొంచెము తేజస్సు అధికమై క్రిందదూకి ఓరీ నేను నిన్ను బాధించుచుందును. ఇంతలోపల అన్న భీముడు వచ్చును. నిన్ను సంహరించును అని వానితో పలికె భీముడు పోయిన దిక్కునుచూచి

అన్నా భీమా అనెను. రాక్షసుడు మరల సహదేవుని భుజమున వేసికొనెను. ఔపాసన అగ్ని వేదికవలె పాంచాలి శుద్ధురాలు త్రేతాగ్నులవంటివారు ధర్మనందన నకుల సహదేవులు. వేదికతోడ మూడగ్నులనువలె జటుడు వారినెత్తుకొనెను. అర్జునుడు లోకాంతరములోను భీముడు స్థలాంతరములోను నుండగా ధర్మరాజు స్వామిని దలచెను. జటుడు పోవుచుండెను. స్వామి కాపాడునని తలచుచుండియు వ్యర్థ మయెను అని ధర్మరాజు తలంచెను. విశ్వంభరుడు లోపల ఆవిర్భవించగనే ధర్మపుత్రుడు పెద్దకొండవలె బరువాయెను. జటునికి తొడలలో బలము లేకపోయెను. భగవంతుని దలచిన క్షణమున అటు లాయెను. తొడలలో ఉష్ణము లేకపోయెను. నిలిచెను. వీరినేల మోసికొని పోవలయునని యీముగ్గురిని చంపుటకు నిలిచెనని వనదేవతలకును ఋషులకును తోచెను. సహదేవుడు భీమాయని పిలువగా యిదిగో వచ్చితినని భీము డనెను. భగవంతుడు ఒకవిధముగ సహదేవునికిని ఒకవిధముగ ధర్మరాజునకును ఒకవిధముగ భీమునికిని చేసిరి. భీముడు వనప్రదేశమున రేమిసంభవించునోయని తిరుగగా సహదేవుడు అన్నాయనెను. భీముడు వచ్చితి ననెను స్వామి రావలయునా ఊరిదుపోట నుండియే యింత చేసెను. భీముడు వచ్చెను. కని యిట్లు లనెను. నేను లేనిసమయమున రేమవారాయెనో అన్నాయని పిలిచెనే రేమవారాయెనో అని రాలేదు. త్వరితముగ మాట్లాడినయేను కోపముతో వచ్చు నటుల వచ్చెను. వీడు సంగతి తెలిసినవాడు. ఇక బ్రతుకనని తెలిసి ముగ్గురిని దించి భీమునితో యుద్ధముచేయుటకు తీర్మానించుకొనెను. రాక్షసుడు సామాన్యుడు కాడు. వానికి పరమదర్పము. అన్యథా చింతితం కార్యం అనినటు లాయెనే. వారు లేరు. వీరిని యెత్తుకొని పోదమనిన వీడు వచ్చెనే అని వా డనుకొనెను. నాకు ప్రియమైన వస్తువులను దించితివే నీకు ప్రియమైన వస్తువును (తలను) దించెదనని భీము డనెను. జటాసురుడు ముగ్గురిని దించి, భీమా రమ్ము నీవు లేనిసమయమున వీరిని అంబి వెంచింపదలచితిని. భగవత్సంకల్పము రమ్మనెను. ఓరీ యిన్ని దినములు హితునియటు లుండి యిటుల చేసితివా. రమ్మని అన్నా యెత్తుకొనివచ్చెనే ఏమేమైనను చేసెనా యని భీముడనెను. లేదు. వాహనముగ నుండెనని ధర్మరాజనెను. బాధకలిగెనాయన్ని భీము డడుగగా లేదు శ్రమపరిహార మాయెనని ధర్మరాజనెను. ఓరీ వారినెత్తికొంటివి. పోనిమ్ము. అదుదాని నేల తాకితివిరా యని భీము డనెను. భీమసేనునికి మిగులకోపము. దానిని ధర్మరాజు అణచెను. దుర్యోధనునిసభలో భీముడు గదతోడ లేవగా భీమా స్వామికాపాడునని ధర్మరాజనెను. వీనిముందు కోపము సరిపడదని భీముడు కోపమును వదలియుండెను. ఇపుడు వీనికై అన్నా కానిత్తునా యనగా ధర్మరాజు అనుజ్ఞనిచ్చెను. భీముడు కోపవా రమ్మనెను. ఓరీ రమ్మని వీరవాదముచేసి యుద్ధమారంభించిరి. భీమునికి రథముండిన అగునా. రథము అస్త్రశస్త్రముల జోలికే పోడు. వీనికి వానికి కోపము వచ్చెను. ఇంద్రునికిని శంబరునికి జరిగిన యుద్ధమువలె తోచెను. బాహుయుద్ధము వృక్షయుద్ధము చేసిరి.

గొప్పవృక్షములను లేత మొలకలనువలె పెరుకుచుండిరి. వారు సంచరించు వనములో ఒకవృక్షమైనను లేకుండునటుల యుద్ధముచేసిరి. బాహు ముష్టి శిలా యుద్ధములు అన్నియును ఆయెను. జటాసురుడు వృక్షమును యెత్తుకొని వచ్చుచుండగా భీముడు రెండుచేతులతో వానినెత్తి పైకి ఎగరవేసెను. వాడు పైకిపోయి గిరగిరతిరుగుచు క్రిందపడెను. వాడు లేచునంతలో భీముడు వానికాలితో రాచెను. మరల తెప్పిరిలి లేవగా మరల లేచెదవాయని పట్టుకొనగా సంధిబంధములు వీడిపోయెను. రాతిమీదనుంచి నూరినటులాయెను. అస్థితకితెచ్చి మెడపై కొట్టగా అటులే శిరసు పడిపోయెను. వాని ప్రియవస్తువేది. ఉత్తమాంగము దానిని దించిపెట్టెను. జటాసుర సంహారమాయెను. వీడు విరాధుడు వాలి వంటి వారితో చేరినవాడు వాని తల క్రిందపడగా భూమి ఒకమూర కుంగెను. భగవద్భాగవతద్రోహి నామీదపడెనని భూమి లోపలపోయెనని కవియనిరి. వీరు యుద్ధము చేయునపుడు పారలుచుపోయిరి. భీముడు వానిచంపి జయలక్ష్మితోవచ్చి అన్నకు నమస్కారించెను. ఇంద్రుడు దేవాసురయుద్ధములో పోయి అసురులను చంపి రాగా దేవతలు స్తుతించునటుల బ్రాహ్మణులు భీముని స్తుతించిరి. ఇటు లుండు కాలములో మరల బయలుదేరిరి. ఏనప్రదేశములో యీవనము ఆవనము అనుచుపోయి ఆర్ష్టిషేణుడు అను రాజర్షి యుండుస్థలమునకు పోయిరి. పాండవులారా అర్జునుడు వచ్చువరకు యిచటనుండుడని ఆరుషి ప్రార్థించెను. ఆయాశ్రమమున నుండిరి. పంచవర్ణములు కలిగిన పుష్పములు పడుచుండును వారుచూడని పుష్పములు గాలికి వచ్చిపడును. గరుడుడు సంచరించుచుండగా రెక్కలగాలిలో వచ్చిపడును. వారు ఆపుష్పము నెత్తి వాసన చూచి ఆహా యేమి భగవద్వ్యాపారమని ఆశ్చర్యపడుదురు. గరుడుని రెక్కల గాలిచేత మెరపుగవరె యొక తామరసపుష్పము పడెను. పాంచాలి దానిని భీమునికి చూపెను. ఏమీ మరల అడుగుచున్నానని భీముడు అనుసేకమునని చూపునపుడే మీకు శక్తియున్నదికాబట్టి అడుగుచున్నాను. పురుషవ్యాఘ్ర దీనివాసన రూపముచూడగా విశేషముగ నాకు ఆశ కలిగెను. అని యేకాంతమున అడిగెను. పాంచాలి పుష్పము తెమ్మని అడుగగా భీముడు గదనెత్తుకొని బయలుదేరెను. కొంచెమైనను భయములేక అనేక వనములు దాటి ముందుపోయిన గంధమాధనపర్వతము చేరెను. ఆపర్వతముమీద నిలిచి చూచెను. కుబేరునిఇల్లు అగపడుచుండెను. అదిక్కును సరసునుచూచి ఆహా యేమిభాగ్యమని ఆశ్చర్యపడెను. తామరకొలనులో దిగెను. కావలివారు యుద్ధముచేసిరి. వారిని సంహారము చేసెను. మణిమాన్ అనువాడు కుబేరుని స్నేహితుడు. గొప్పవాడు. వాడు ఆయుద్ధములో రాలేదు. ఇదియేమి అని అడుగుకొనుచు వచ్చి సంహారముచేయుచున్నాడని మణిమానునువాడు సేనలతోడ వచ్చెను. శూల శక్తి గదాయుధములతో వచ్చెను. యుద్ధమాయెను. భీముడు వానితో అనేకవిధముల యుద్ధములు చేసి కుబేరుని సఖుడని యోచింపక రాజధర్మము ననుసరించి వాని చంపెను. భగ.గీత 2 అధ్యా 4 శ్లో భీష్మద్రోణులు పెంచిన

విశ్వ చెప్పినవారని చూడక స్వధర్మము ననుసరించి చంపుమని స్వామి చెప్పెను. భీముడు అట్లుల చంపెను. మణిమాన్ చంపబడగా వానితోడ వచ్చినవారు పరుగులిడుచు పోయిరి. భీముడు తామరకొలను నొద్ద కూర్చుండియుండెను, అపశకునములు కలుగగా పాంచాలీ భీముడెచట పూర్వమువలె నొక పుష్పముచూపి అడిగితివా యని ధర్మరాజడెను. ఔనని పాంచాలి చెప్పగా వెతకుచుపోయెను. గంధమాదనపర్వతము చేరిరి. భీముని చూచిరి. అన్నా యిచటికి వచ్చితిని. యుద్ధమాయెను. కుబేరుని గొప్ప సఖుని చంపితిని. మిమ్ము తలచితిని. వచ్చితిరి. పుష్పముకై పోయెదననిన మరలమరల యేల యని అందురని చెప్పక వచ్చితిని. పాంచాలి భాగ్యశాలి మైయుసుఖపడెను. వస్త్రములడిగెనా ఆభరణముల నడిగెనా అని తలచి వచ్చితిని. క్షమించవలయునని భీము డనెను. పోనిమ్ము క్షేమము కదా యని ధర్మరాజనెను. భీమా నీవు అడుగడుగునను ఆపదలనుండి తప్పుటకు అర్జునుడు దేవలోకములో నుండుటకు కారణమేమి. పాండవబంధు పాండవదూతయేకద అని ధర్మరాజు చెప్పుచుండగా, సఖుని పోవుటకు వినిన ప్రభువు వచ్చునని దూతలు పోయి కుబేరునితో చెప్పిరి. కుబేరుడు యోచించుచుండెను. నేను పోయి నన్ను సంహరించును, భగవంతుడిచ్చినదాని నుంచుకొని యుందము. సమాధానము చేసికొనిన బాగుగ నుండును. అడుగకున్నను యిట్లుల చేయవలదని చెప్పవలయును. గౌరవస్తుడగు నేనెట్టుల పోదును, అని కుబేరుడు యోచించుచుండెను. ధర్మపుత్రుడు వచ్చెనని విని యోగ్యుని చూడవచ్చినట్టుల వచ్చెను. వీరిని చూచి పరమానంద మొందెను. ధర్మపుత్రుడు మన్నింపు వేడెను. వీడు మూర్ఖుడు. మీవాడని చూడక చంపెనని కుబేరునితో చెప్పె. భీమా అధిక ప్రసంగివి. ఆదేమి మరలమరల యిట్లు చేయుచున్నావు. కుబేరుని స్నేహితుని చంపితివని కుబేరునిముందు భీముని కోపించెను. ధర్మపుత్రా నచ్చుట పుట్టుట ఉండుట భగవంతునివలననే. పోవుటది నిమిత్తము. కాలస్వరూపుడైన స్వామి చంపెను. నీతమ్ముడు నిమిత్తము. భగవద్గీత 11 అధ్యా 32 శ్లో అర్జునా సంహరించెదను. కాలోస్మి అనిరి సర్వసంహారమూర్తినైన నేను యీరూపములో వచ్చితిని అనెను. అట్లయిన మీరే చంపుడు నేను పోయెదనని అర్జునుడనగా నీవు ఉండపనిలేదు. నేనే సంహరింతును. నీకు కీర్తికావలెనా. నేను ప్రసిద్ధుడను. నాకు కీర్తి వలదు. నీకు కీర్తి కావలయును. అన్నిటిని నీవే గైకొనుము. నాకేల వైకుంఠరాజ్యమున్నది. భక్తులయందలి వాత్సల్యముచేత వచ్చితినని స్వామి అనెను. ఇందరిని చంపవలయునా యని అర్జునుడనగా నేనే నాకటాక్షవీక్షణముచేత వీరిని చంపితిని. నీవు నిమిత్తమాత్రమనిరి. అట్టుల ధర్మపుత్రా వాడు చంపలేదు. కాలము చంపెను. నీతమ్ముడు నిమిత్తము అని కుబేరుడు చెప్పెను. కుబేరా యీవిషయమున నీకు కోపము లేదాయని ధర్మరాజనగా ఇందుకొక శాపమున్నది. అగస్త్యుని శాపము. వాడు పోయి భీముని చేత సంకటపడవలయునని ఉన్నది. ఒకసమయములో నేను నాస్నేహితుడు విమానములో పోవుచుండగా వాడు ఉమ్మివేసెను.

అది అగస్తుని తలపైపడెను. అదేను నాతలపై పడెను. ఇటుల చేయవచ్చునా అంత గర్వమా యిపుడు వీడు ఉమ్మివేయగా చూచుచున్నావు. వీడు ఒకమనుష్యునిచేత చంపబడును. అపుడు ఆదుఃఖమును చూతువని అగస్త్యుడు శాపమిచ్చెను. అటుల జరిగెను అనెను. కుబేరుడు శాపవృత్తాంతమును చెప్పి మనస్తాపము లేదని పోయెను. అర్జునుని రాకను నిరీక్షించుచుండిరి. భగవంతుని తలచుచుండిరి. ఒకదినము ఆకాశమార్గములో ప్రకాశము తెలిసెను. అదియేమని చూచుచుండగా గుఱ్ఱములు తెలిసెను. పిమ్మట రథము తెలిసెను. అది ఇంద్రుని రథము ఇంద్రుడు తనరథములో కూర్చుండబెట్టి కొడుకును పంపెను. మబ్బులేదు వర్షములేదు. పిడుగులు లేవు. మెరుపులేమని చూచుచుండగా రథము గుఱ్ఱములు కనుబడెను లోపల అర్జునుడు మెరుపుతీగవలె ప్రకాశించుచుండెను. అర్జునుడని తలచుచుండుటచేత అర్జునుడుగ తోచుచున్నాడు అని తలచిరి. వీరు కూర్చుండియున్న చోటుననే రథము దిగెను. అర్జునుడు రథములోనుండి దిగెను. మొదట ధౌమ్యాచార్యులకు పిమ్మట ధర్మపుత్రునికి అటుపిమ్మట భీమునికి సేవించెను. తమ్ములు వచ్చి అర్జునునికి సేవించిరి. అర్జునుడు త్వరితముగ లేచి పర్ణశాలకు పోయెను. అచట పాంచాలి యుండెను. పోయినచోట యేమి జరిగెనని అడగక వనప్రదేశము భీముడు నిత్యమును గదతోడ పోవును. వారు చిన్నవారు. ఎన్నిదినములు ఆయెనని పాంచాలి ఆరంభించెను. పోయినచోట కార్యముండెను అదియేమి అట్లులడిగెదవని అర్జునుడు కోపించక మంచిమాటలుచెప్పి పాంచాలిని సమాధానపరచి యిక పోవని ధర్మపుత్రునియొద్దకు పోయెను. ఏమియును యోగ్యతలేనివారు యెంతో గర్వపడుదురే అర్జునుడుయెటుల కూర్చుండవలయును. ఒకశక్తియును లేనివాడు కూర్చుండునటుల అణకువతో కూర్చుండెను. తండ్రీ సురక్షితముగ వచ్చితివా యని ధర్మరాజు అడుగగా అంతయును తమ అనుగ్రహము కృష్ణునియనుగ్రహము అని అర్జునుడనెను. ఏమిచేసితివనగా బయలుదేరినది మొదలు సాంగోపాంగముగ సకలవృత్తాంతములు చెప్పెను. వీరిటుల మాటలాడుచుండగా యీముచ్చటను చూచుటకు ఇంద్రుడు వచ్చెను. తండ్రి గురువగుటచేత అర్జునుడు ఉపచరించెను. బిడ్డకు మేలుచేసితిరని ధర్మరాజనగా నాకు ఉపచారము చెప్పవలయునా నీకు తమ్ముడు. నాకు కుమారుడు. అని ఇంద్రుడాశీర్వదించెను. ధర్మపుత్రా పదుమూడు సంవత్సరములుకాగా యుద్ధము జరుగును, రాజ్యము లభించును. అర్జునుడు సకలవిద్యలు ద్రోణాచార్యులయొద్ద నేర్చెను. వారియొద్ద నుండు దాని యిచ్చుటకు పిలిచితిని. నివాతకవచులను కాలకేయులను సంహరించినావలనకాని కార్యముచేసి గురుదక్షిణ నిచ్చెను. వీడొకడుండినను చాలును. త్రిలోకములును నేను చేరినను వీడొకడు చాలును అనిచెప్పి ఇంద్రుడు బ్రాహ్మణులచేత స్తుతించబడి రథములో కూర్చుండి పోయెను. పాంచాలి అర్జునుని దేహమును తాకిచూడగా అర్జునుడు ఇంద్రుడు తనకిచ్చిన అపూర్వవస్తువులు యేకాంతమున ఆమె కిచ్చెను. అర్జునా దేవలో

కమున నేర్చిన అస్త్రములను కొంతచూపుమని ధర్మపుత్రు డడుగగా యుద్ధరంగములో కద చూపవలయునని అర్జును డనెను. కొంచెము చూపుమని ధర్మరాజనెను. అర్జునుడు ఆగ్నేయాస్త్రమును వేయగా అది అడవినంతయు కాల్చెను. వలదు వలదనుచుండగా విడుచుచుండెను. దేవతలు వచ్చి ధర్మపుత్రా యింటిలోనా యీ వేడుక చూడవలయును. రేపు యుద్ధములో అన్నిటిని విడుచును అనిచెప్పి అర్జునా యిటుల విడుచుచున్నా వేమిరా యనిరి. అన్న ఉత్తరువని అర్జునుడనగా సరి నిలుపు మనిరి. మరియును అచ్చట నుండినవారు సమాధానము చెప్పిరి. ఇంద్రుడు మొదలగు దేవతలువచ్చి యికమీద యీ దారుణాస్త్రములను విడువకుము. యుద్ధములో చూపవచ్చుననిరి. వనవాసము కాగనే ఒకసంవత్సరము అజ్ఞాతవాసము చేయవలసియుండును. ఇంతలోపల చూడని ప్రదేశములను చూతమని ధర్మపుత్రుడు అర్జునునితోడ పోయి పోయి సరస్వతీనదీతీరమునకు వచ్చిరి. ముప్పదిమూడు కోట్టుల దేవతలు అచ్చట వసించుచుందురు సరస్వతీతీరమున సదవానందభరితులై సుఖముగ వాసము చేయుచుండిరి. అర్జునుని రాక పరమశ్రేయము, రాక్షసుడు చచ్చుట అనిష్టనివారకము. ఈకథను వినినవారికి యిష్టప్రాప్తి అనిష్టనివారణ అగును.

(38) నహుష శాప మోచనము.

పాండవులు సరస్వతీనదీతీరమున వాసము చేయుచుండిరి. ధర్మపుత్రుడు భగవద్ధ్యానము చేయుచుండును. ద్రౌపది పతివ్రతాధర్మము ననుసరించి పత్నిశాలలో నుండును. నకుల సహదేవులు అన్నల ఆజ్ఞాను వర్తులై యుందురు. భీమునకు వనములో గ్రుమ్మరుచుండెను. అప్పుడు దుష్టశిక్షణ మగును. భీము డొకదినము వనములోకిపోగా ఒక పాము అతని పట్టుకొనెను. అజగరము. దాని చూచిన అజగర మనరాదు. మృత్యువనవలయును. అది పర్వతగుహలో పడుండియుండెను. వచ్చి భీముని పట్టుకొనెను. భీమునికి విషాదమోహములు భయమును రోమాంచమును కలిగెను. భీమసేనుడు మహాబలవంతుడు. దానికి ఆకలిగనుండెను. భీముడు గొప్పదేహము గలవా డగుటచేత నేడు మంచిఆహారము దొరకెనని పాము రెండుచుట్లుచుట్టి భుజములను కట్టెను. పెద్దఅపరాధము చేసినవారిని కట్టినటుల కట్టెను. కదలుటకు సాధ్యముకాకుండెను. నాకు చరాచర ప్రపంచమునిన లక్ష్యములేదు. పెద్దవృక్షములను విరిచివేయువాడను. పాము కదలక చేసెనే ఇందుకు పెద్ద కారణముండును. దీనిశక్తికాదు భగవంతుడున్నాడు. కొంచెము ప్రయత్నించెదను. అని భీము డనుకొనెను. అది శాస్త్రము. ఒకకార్యమునకు రెండుకారణములు రెండుచక్రములవలె. ప్రయత్నింపకున్న ఆత్మద్రోహమగును. నువ్వులనుండి నూనెను తీయదలచినవారు భగవంతుడు లేనిది తృణమైన కదలదని కూర్చుండెనేని ఆనువ్వులు బూజుపట్టిపోవును. వీడు ప్రయత్నించినయెడల స్వామి చెడకుండ

చేయును. వారివారికి ఆపదసంభవించిన ఆయాపదను తొలగించుకొనుటకు ప్రయత్నించవలయును. ఆపదపోయిన సంతోషము. లేకున్న ఆత్మద్రోహము లేకుండును. వేదాంతమును నమ్మి నోరుమూసికొని యుండ్డిన కర్మయుందురు. అటు లగుటచేత దీనిలోనేదియో విశేషమున్నదని భీమునికి తోచి విడిపించుకొనుటకు ప్రయత్నించెను. తీవ్రప్రయత్నము చేసెను. పాము వచ్చిన భీముడు విడిపించుకొనుటకు ప్రయత్నింపవలయునా. అందునను తీవ్రప్రయత్నము చేయవలయునా అనగా కారణము వేరు. పాము కదలలేదు. విడువలేదు. అది అటులచేయగా మైకము కలిగెను. అటుల పట్టుకొనగా మృతప్రాయుడైయుండెను. కొంచెము తెలివికలిగినపుడు కృష్ణుని స్మరించెను. కృష్ణా యీయాపదలో నీవుకాక రెవరు. ఇదియొక కార్యమా నీశోధన అనెను. సాధ్యముకాదు. బల పరాక్రమములచే అగునటులుండిన నావలన కావలయును. కాలేదు. ఇక భగవదనుగ్రహమువలన కావలయును. మనలో అన్న వేదాంతి. పరమసాత్త్వికమూర్తి. అన్నయిచ్చిన నిధి విడుచును అని భీము డనుకొనెను. భగవదనుగ్రహము ధర్మముచేత కావలసినటులున్నదని స్మరించెను. మనసా యీశరీరమును కాపాడుకొనవలయునని యేల తలచెదవు. అంతే నారాయణస్మృతిః అని యుండలేదా. బ్రతుకునటులుండిన తప్పయుండదా. మనసా యేల తగుప్రయత్నములను చేయుమనుచున్నావు. భగవద్గీత 8 అధ్యా 5 శ్లోకమునవలె ఆకాలములో భగవంతుని స్మరింపవలయును. (లేక భాగవతములో) కర్మయోగమో జ్ఞానయోగమో చేసినయెడల దానికి ఫలముగ కడపట నారాయణస్మృతి కలుగవలయును. (భాగవతములో యుద్ధవుడు నంద యశోదలనుచూచి హే- నందగోపాలా మీభాగ్యమే భాగ్యము. స్వామి మిమ్ము తలిదండ్రులారాయని పిలుచును. మీరు అతని బిడ్డడని లాలనము చేయుదురు. ప్రాణవియోగకాలమున ఒకక్షణము మనసులయింపజేసిన మోక్షమని చెప్పియున్న భగవంతుని సదా దండించుచుందురనెను) స్వామి అట్టిధ్యేయుడు. వాని స్మరించక ప్రయత్నించుచున్నావే. వాసుదేవుని స్మరింపుమనెను. కృష్ణుని దలంపుము నారాయణుని దలంపుము అనక వాసుదేవుని స్మరింపు మనుటకు కారణమేమనగా, నేను తలచిన భగవంతునికి తెలియవలయునే అని మనసు అనెను. వాసుదేవుడనగా అవతారప్రకారము వసుదేవుని కుమారుడని యర్థము. మరియొక అర్థమేమనగా చరాచరప్రపంచమును సృష్టించి అంతర్యామియై యుండువాడనియు ఆధారభూతుడై భరించుచున్నాడనియు అర్థము. భగవద్గీత 9 అధ్యా 4 శ్లో చరాచరప్రపంచములో నుండవలయుననిన కష్టముకదా యనిన ఆధారభూతుడై క్రీడగా భరించుచున్నాడని చెప్పబడెను. మనసా కావున నిచట ఉన్నాడు. వాసుదేవుని స్మరింపుమని భీము డనెను. స్వామి వచ్చి యీశరీరమును కాపాడవలయునని యెంచి స్మరింపుమనుచున్నా ననుకొనకుము. ఈశరీరమున నేమున్నది. కడపట భగవంతుని తలచుట అవశ్యకముగాన తలంపుము అనెదను. పాపమునకు దండనను పీడనుభ

వించవలయును. అపుడే వీని కర్మము తొలగును. కావుననే జ్ఞానులు ఆపదవచ్చిన సంతోషముతో అనుభవింపుదురు. భగవంతుని పిలువరు. కాబట్టియే ఇంద్రద్యుమ్నుడు శరీరరక్షణమునకై స్వామిని పిలువలేదు. పూర్వజన్మజ్ఞానముచేత పుష్పమును గైకొనుమని పిలిచెను. జ్ఞానులు శరీరసంరక్షణార్థము స్వామిని తలపరు. భక్తిచేత దలంతురు. అటుల భీముడు తలచెను. బలమైనకార్యమో ధర్మమువలననే పోవును అన్నచెప్పిన తొలగునేమొ అని అన్నను స్మరించెను. కొంచెము తెలివిగలిగినపుడు సర్పమును జూచెను. ఆశ్చర్యపడెను. ఇది యేమి సర్పము. దేవతయో రాక్షసుడో భూతమో లేక సర్పమో. దేవతారహస్యము తెలియలేదు అని సర్పమా నీవు సామాన్యసర్పమైన అవుగను. నీవెవరో నిజముగ చెప్పుము. ఎటులైనను మ్రింగపోయెదవు. నీవెవరు. నన్ను పట్టగా ప్రయోజనమేమి. ఆకలికై పట్టితివా లేక మనసున నేమైన నున్నదా. నీవెవరని నన్నడిగెదవా. పాండవులని వినియుందువు. పాండవులలో పెద్దవాడైన ధర్మరాజునకు వెనుకటివాడను అని భీము డనెను. అనగా సర్పము యేడ్చి తండ్రీ పాండుపుత్రుడా నేను అవంశములోని వాడను. నహుష మహారాజును. భగవంతుని బ్రహ్మ అత్రి చంద్రుడు బుధుడు పురూరవస్సు ఆయుస్సు నహుషుడు యయాతి పూరు. పూరువంశములోనివారు పాండవులు. ఆయుస్సుకొడుకు నహుషుడని వినియుందువు. నేను నీవంశములో ముందటివారిలో నొకడను. అని సర్పము చెప్పెను. ఇక సామనరాదు తాత అనవలయును బిడ్డ యనవలయును అటుల సంబంధ మేర్పడెను. అయుస్సునకు కుమారుడవు. యయాతికి తండ్రివి. తాతా నీకేల యిటుల తటస్థించెనని భీము డడిగెను. కడతేర్చవలయునని భీమునికి తోచెను. ఆపాము తనకథను యిటుల చెప్పెను.

తండ్రీ అగస్త్యునిశాపము. ఐశ్వర్యమదముచేత బ్రాహ్మణులను హింసించితిని. వారిని కాలితో తన్ని కొట్టితిని. వారు తగ్గినవారని వారిని అలక్ష్యము చేయుచుంటి అగస్త్యుని విషయమున ప్రత్యేకముగ అపరాధపడి యిటు లయితిని. ఇంద్రుడు వృత్రాసురుని చంపెను. బ్రహ్మహత్య చుట్టుకొనినందున అతడు తామరతూడులో డాగెను. అపుడు అమరావతికి రాజుగ నుంటిని. ఇంద్రపదవికి యెవరని యోచించి నన్ను ఇంద్రునిగ చేసిరి. భీమా పెద్దపదవి వచ్చెనే కాపాడుకొనరాదా. ఒక దుర్బుద్ధిపుట్టెను. నేను ఇంద్రుడను ఇంద్రాణియేల నాపడకకు రాకూడదు అనితోచెను. నేను దానికి చెప్పిపంపితిని. భర్త పోయెను. అది దిక్కులేనిది. నేను పిలువగా ఆమె బృహస్పతిని జూచి యేడ్చి సంగతి చెప్పెను. అధికప్రసంగి. వానితో చెప్పుటకు కాదని తలచి బృహస్పతి అమ్మా ఒకకార్యము చేయుము. నేను రావనిచెప్పిన బలాత్కారము చేయును. దుష్టుడు. మీరు వచ్చునపుడు ఋషులను మోయుడని పల్లకిలో రండి.అటుల వాడుక.ఋషివాహనులై రండి. ఇటుల వచ్చిన నేను స్వాధీన నగుదును. మిగులసుఖముగ నుందమని చెప్పిపంపుము అని ఇంద్రాణితో చెప్పెను. ఇది మంచియుక్తి యని ఆమె చెప్పిపంపె

ను. తండ్రీ మీరందరును జాగ్రతగ నుండుడు. దేవేంద్రపదవిని కాపాడుకొనక పోతిని. ఋషులు జాగ్రతగ కూర్చుండబెట్టి తేవలయునసెను. నేను వరించుటకు మార్గమని నలపక ఇంద్రాణి యింతేకద. ఋషులు మనకు స్వాధీనులు అందరిని రప్పించి పల్లకిని మోసికొని రమ్మనెదను. నేను ఋషివాహనుడనై రాగా చూడవలయునని కోరితివేని అటులచేసెదను. నేను యీత్రైలోక్యమునకు రాజునేగాని నీకు దాసుడను అని చెప్పి పంపితిని. ఋషులను రప్పించి పల్లకి మోయుడంటిని. మోసిరి. పల్లకి పోవుచుండెను. నిదానముగ పోనీయరాదా. సర్ప సర్ప పరుగెత్తుడు పరుగెత్తుడు అంటిని. అగస్త్యుడు పొట్టివాడు సరిగ నడువలేదని లోపలకూర్చుండిన నేను కాలుచాచి అగస్త్యుని కొట్టితిని. బ్రాహ్మణాపమానముచేత దేవరాజ్యశ్రీ విడిచిపోయెను. ఓరీ పూర్వులు ఆచరించుచుండిన సనాతనధర్మమును నిందించితివి. నన్ను కాలితో కొట్టితివి. పోనిమ్ము. బ్రాహ్మణులను పల్లకి మోయుమంటివి. నన్ను కాలితో కొట్టిన మహానుభావులైన మహర్షుల చేత పల్లకి మోయించిన అపరాధముచేత నీవు స్వర్గమును విడిచి క్రిందపడవలయును. ఈస్వర్గలోకమునకు నీవు తగవు. సనాతనధర్మమును అనుష్ఠింపక పల్లకి మోయించి నన్ను కొట్టితివి. చెప్పరాని అకార్యమునకై యిటుల చేసితివి. సర్ప సర్ప అనుచున్నావు. నీవు సర్పమై క్రిందపడవలయును అని అగస్త్యుడనగా, సర్పమై క్రిందపడితిని. పదివేలసంవత్సరములు పామై అడవులలో సంచరించవలయును ననెను. వనప్రదేశములలో సంచరించవలెనని ఉత్తరువాయనె, మరల శాపమోచన మెపుడని అడిగితిని. నహుషా నీవంశములో పాండురాజు పుట్టును. వానికి పరమధార్మికుడైన యుధిష్ఠిరుడనువాడు జ్యేష్ఠుడై పుట్టును. వానిదర్శనముచేత శాపమోచన మగు ననెను. తండ్రీ పాండవులంటివే ధర్మపుత్రుని దర్శనముచేత శాపము పోవుసే. నిర్భాగ్యుడను, పదివేలసంవత్సరములుగ నిటులున్నాను అని సర్పము సంగతిచెప్పెను. ఇపుడేమి చేయవలయునని భీము డనెను. నహుషా ధర్మరాజు వచ్చును. అతని ప్రశ్న లడుగుము అతడు బదులు చెప్పును. అభాగవత సల్లాపము చేత పాపము పోవునని అగస్త్యు డనెను అని సర్పము చెప్పెను. భీమసేనుడు చాల ప్రొద్దుకనుబడక పోగా ద్రౌపదీ భీమసేను డెచట, నీవెచటికైనను బంపితివాయని ధర్మరాజు అడిగెను. ఈపర్యాయము నేను పంపలేదని ఆమె చెప్పెను మునుపు అపశకునము లాయెను. ఇపుడటుల కాలేదు. ఆపద యుండదు. గుంపుగ పోనవసరములేదు అని తలచి ధర్మరాజు అర్జునుని పిలిచి ద్రౌపదిని జాగ్రత్తగ చూచుకొమ్ము. అటుల ప్రమాదము వచ్చియుండదు నేను పోయి చూచెదను అనిచెప్పి బ్రాహ్మణులను చూచుచుండుడని నకులసహదేవులకు చెప్పెను. ద్రౌపదిని బ్రాహ్మణులను రక్షించుటకు అర్జునుని నకులసహదేవులను ఉంచి భీము డేమార్గములో పోయెనని ధర్మరాజడుగగా పోయినమార్గమును చెప్పిరి. భీముడు ఒకేమార్గముగ పోయియుండునా తిరుగుచు పోయియుండడా, గుర్తులెటుల తెలియును అనగా అతడు గదను త్రిప్పుచు పోవునపుడు

సింహవ్యాఘ్రములు చచ్చిపడియుండెను. తోడలగాలిచేత వృక్షములు ఒరిగియుండెను. ధర్మరాజు యీగురుతులను గమనించుచుపోయి భీముని చూచెను అతని కొండపాము చుట్టుకొనియుండెను. భీముడు మైకముచేత నిశ్చేష్టితుడై మృతునివలె నుండెను. ధర్మరాజు అట్టితమ్ముని చూచి దూరముగ నుండి యోచించెను. ఒక సాధారణమైన పాము భీముని నిటుల చేయునా. బాల్యమున దుర్యోధనుడు యెన్ని పాములను వీనిపై విడువలేదు. పాముల వీనునే. విశేషముండును అని పామా మాతమ్ముని విడువు మనెను. పాము— నాకు వరము. లేకుండిన పట్టుకొనం గలుగుదునా. ధర్మరాజు ఏమివరము. పా— అగస్త్యుడు శపించగనే నన్ను పాముకమ్మంటికే అకలియగునే ఆహార మేమియని అడిగితిని. భగవదిచ్ఛచేత నేది లభించిన దాని భుజింపవచ్చును. త్రిమూర్తులలో నొకడైనను నీకట్టువిడిపించుకొనజాలడని అగస్త్యుడు చెప్పెను. భీముడు కనుబడెను. మ్రింగెదను. నీవుపోమ్ము. లేకున్న ఆహార మగుదువు. ధ— సరి యిరువురిని భుజింపుము. నీవు దేవరవా. దైత్యుడవా. పామా సంగతి చెప్పుము. సత్యముగ చెప్పుము. పా— నీవడిగిన సత్యముగ చెప్పవలయునా. ధ— నేనెవరు. పాండుపుత్రుడను. ధర్మపుత్రుడను, నాయెడ అసత్యము కూడదు. నిన్నడుగునది యుధిష్ఠిరుడు. పా— తండ్రీ నీవు యుధిష్ఠిరుడవా. నేను నహుష మహారాజును. చంద్రునికి ఐదవతరమువాడను. (చంద్రుడు బుధుడు పురూరవుడు ఆయువు నహుషుడు.) నాకు అగస్త్యునిచేత యీగతివచ్చెను. ధ— పామా యిదంతయును నీకెటుల జ్ఞాపకమున్నది. పదివేల సంవత్సరముల సంగతికదా. పా— అగస్త్యుడు శపించునపుడు నన్ను జూచి నీవు మిగుల గొప్పవాడవు అపచారముచేసి క్రిందపడితివి. నీకు పూర్వజన్మజ్ఞానముండు ననెను. (పూర్వజన్మజ్ఞాన ముండిన దుఃఖము కదా.) నేను కొన్ని ప్రశ్నలడిగెదను. బదులుచెప్పితివేని నాశాపము పోవును. ధ— అగస్త్యుడు చెప్పినవాడని చెప్పెదను. సర్పమా అడుగుము నీవడుగుదానికి బదులుచెప్ప శక్తియుండిన చెప్పెదను. పా— యుధిష్ఠిరా బ్రాహ్మణు డెవడు. శూద్రు డెవడు. ధ— శూద్రుడు శూద్రుడు కాడు. బ్రాహ్మణుడు బ్రాహ్మణుడు కాడు. బ్రాహ్మణునికి చెప్పియుండు ధర్మము యెవని యెడ నుండినను వాడు బ్రాహ్మణుడే. లేకున్న శూద్రుడు. బ్రాహ్మణునికని యేర్పడిన భగవద్భక్త్యాదు లుండినవో అశూద్రుడు బ్రాహ్మణుడేను. (నవద్బ్రాహ్మణ్యారవవు. నంద నాచవవు; కృష్ణకృష్ణ యను భగవన్నామ మెవని నాలుకపై నుండునో వాడు శ్వపచుడైనను వానికి నమస్కరింపవచ్చును. ఊరక చెప్పిన కాదు. భక్తితోడ రావలయును. నీయెడ భక్తిలేని బ్రాహ్మణుడు బ్రాహ్మణుడుకాడు. శ్వపచుడైనను భక్తియుండిన బ్రాహ్మణుడేను అని ప్రహ్లాదు డనెను. భగవద్గీత 9 అధ్యా 31 శ్లోకమునను యీయభిప్రాయము తెలుపబడెను. కృష్ణుడు విదురునింట భుజింపగా కృష్ణా మేమందర ముండగా శూద్రునింట భుజింపనేలయని భీష్మాచార్య లడుగగా తాతా యిక శూద్రుడనకుము. భగవద్భక్తియుండిన బ్రాహ్మణుడేయని కృష్ణుడు చెప్పెను. ఇట్లు

భేదమేటులరా యని భీష్ముడడుగగా ఒక్కొక్కవర్ణములోను ఒక శూద్రుడున్నాడు. ఎవనికి దైవభక్తిలేదో వాడు శూద్రుడని స్వామి చెప్పెను. ధర్మరాజు దాని ననుసరించి చెప్పెను. పాము అనేకప్రశ్నలడుగగా యుధిష్ఠిరుడు బదులుచెప్పెను. ధర్మపుత్రుని నడిగి అనేకసంగతులు తెలిసికొని సంతుష్టుడై ధర్మపుత్రా నీతమ్ముని విడిచితిని. సురక్షితుడై వచ్చును. మీరు నావంశములోనివారు క్షేమముగ నుండుడు. నేను స్వర్గలోకమునకు పోయెద ననెను. ప్రకాశము కలిగి సర్పశరీరము పోయి దివ్యశరీరము వచ్చెను. ధర్మపుత్రుడు పాముసంగతి చెప్పగా తమ్ములు అన్నా మీకును అపదయా యని ఆశ్చర్యపడిరి. ద్రౌపది పరిహాసము చేసెను. భీముడు సురక్షితముగ వచ్చెనని యొకసంతోషము. ఆహా మనవంశములోనివారికి శాపమోచనమాయెనని యొకసంతోషము. తమచేత అయెననియు ఆభాగ్యము తమకు లభించెనని మరియు నింకను సంతోషము.

నలుగురు తమ్ములతోను ద్రౌపదితోను ధర్మపుత్రుడు వాసము చేయుచుండగా భగవంతునికి పాండవులను చూడవలయునని తోచెను. పాండవులు అందరును చేరి కూర్చుండియుండిన దేవలోకమున నేమి జరిగెనని అడుగుదురు. అర్జునుడు సంగతి చెప్పును. ఇంద్రునికి ఒక ప్రయోజనము కలిగెను. నివాతకవచులు కాలకేయులు చచ్చిరి. శత్రులు లేరు. యుద్ధము లేదు. అందుచేత ఇంద్రుడు ధనుర్విద్యను మరచెను. దానిని స్మరింపవలసినదే లేకుండెను. అర్జునుడు దేవరాజ్యము సంగతి చెప్పెను. పరమశివునికిని నీకును యుద్ధమాయెనే అదెటుల అనగా పరమశివుడు వచ్చినది యుద్ధముజరిగినది అతని తల పగులగొట్టినది అర్జునుడు చెప్పెను. అర్జునా నివాతకవచులు కాలకేయులు గొప్ప కాదు. పరమశివుని తలపగులగొట్టితివే అది గొప్పని ధర్మరాజనెను. పరమశివుడు అనుగ్రహముచేసినది ఆశీర్వదించినది విని యిదియే మిగుల రసమని యుధిష్ఠిరుడు శిరఃకంపము చేసెను. ద్వైతవనమునకు వచ్చిరి. భగవంతునికి వీరిని చూడవలెనని తోచి సత్యభామపై మిగుల ప్రియముండుటచేత ఆమెతోడ వచ్చెను. నేను పాండవులను చూడవలయు ననగా ఆమె నేనును ద్రౌపదిని చూడవలయు ననెను. సరియని నాలుగుగుర్రములు కట్టిన రథములో రాగా మనుష్యుడు వచ్చునటుల తోచలేదు. ఇంద్రుడు ఇంద్రాణితోడ వచ్చునటు లుండెను. వారు వచ్చి పాండవులను చూచిరి. ఆలింగనములు నమస్కారము లాయెను. సల్లాపములు సలిపిరి. ఈసంగతి మార్కండేయునికి తెలిసెను. పాండవులు భగవంతునికి ప్రాణములు వారిని చూడవలయునని తలచి యుండెను. స్వామియును రాగా యిది మంచిసమయము. భగవద్భాగవత దర్శనమగునని ఆయన వచ్చెను. అందరు కూర్చుండిరి. కుశలప్రశ్నమాయెను. మార్కండేయుడు స్వామిని స్తోత్రము చేసెను. స్వామి మార్కండేయుని స్తుతించెను. పెద్దల ఆగమనము అర్ధోదయమువంటిది. బావా నేను వచ్చుటకేమి నిత్యము వచ్చుచుందును. మీరు పెద్దలు. మీకు కావలసినదాని నడుగుము. నేనును వినెదనని చెప్పి స్వామి భగవద్భక్తుల గౌరవము

చూపిరి. రాజ మోక్ష అపద స్త్రీ పతివ్రత బ్రాహ్మణ మాతాపితృశుశ్రూష ధర్మములు మార్కండేయుడు చెప్పెను. మహాభారతములో వనపర్వములో నిది. మిగుల గొప్పఘట్టము.

---

(39) ధర్మవ్యాధ ఉపాఖ్యానము.

ఇంద్రుడు ఇంద్రాణితోడ వచ్చినటుల కృష్ణుడు సత్యభామతోడ పాండవుల యొద్దకు వచ్చెను. తపోవృద్ధు మార్కండేయుడును వచ్చిరి. మార్కండేయుడు తపము గావించి యమబాధ తప్పించుకొని దీర్ఘాయుష్మంతుడాయెను. సత్యభామ ద్రౌపదులు ఉండిరి. పాండవులు స్వామి మార్కండేయుడు అందరు చేరియుండగా సభయెటు లుండును. ఈసంగతి నారదునికి తెలిసెను. ఇందరిని ఒకచోట చూడవచ్చునని పాండవులపై ప్రేమగల నారదుడు వచ్చెను. మార్కండేయుడు అపుడు ధర్మపుత్రుడు అడుగగా అనేకధర్మములు చెప్పనారంభించెను. మిగులసరియని స్వామియు మహాలక్ష్మి యైనసత్యభామయు వినుచుండిరి. ధర్మపుత్రా భగవంతుడగు కృష్ణుని యనుగ్రహము మీకు పూర్ణముగ నున్నది. భయమేమి. వనవాసమాయెను. అజ్ఞాతవాస మగును. యుద్ధము జరుగును. చేయుటకు అర్జునుడును చేయించుటకు మీకు పరమాప్తుడైనకృష్ణుడు ఉండ భయమేమి. భగవద్గీత 18 అధ్యా 78 శ్లో వలె కృష్ణార్జును లెచట నుందురో అచట ఐశ్వర్యఅధిపత్యము లుండును. రాజ్యలక్ష్మి జయలక్ష్మి యుండును. నీతి తప్పదు. పరమనీతితో పాండవులు పోయినరాజ్యమును సంపాదింతురు. ధర్మపుత్రా నీవు రాజ్యపరిపాలనము చేయునపుడు అన్నిధర్మములును ఆచరింతువు. అందరిని కాపాడుదువు. ఒకధర్మమును మాత్రము తప్పకుము. శరణాగతరక్షణమును మరువకుము. నన్ను రక్షింపవలసినభారము నీది యందురు. తన్ను రక్షించుకొనుటకు చేతకాకకదా ఒకడు వచ్చి రక్షింపుమనును. కావున శరణాగతుని రక్షింపుము. కనుకనే శత్రుని తమ్ముడైనను శరణమనగా విభీషణుని శ్రీరాముడు అంగీకరింప దలచెను. మీరు వాని చేర్చుకొనినయెడల సమయముచూచి వాడు హానిచేయగా యని సుగ్రీవుడు మొదలగువారనగా, శత్రువైనను శత్రుని తమ్ముడైనను శరణమనినవాని విడువనని శ్రీరాము డనెను. స్వామి చేర్చుకొనవలయు ననగా వారు ఏల దనుచుండిరి. స్వామిపక్ష ఒకరును చేరలేదు. తుదకు హనుమంతుని పిలిచిరి. సుగ్రీవాదులు వేరుమందిచేరి చెప్పినను సరియగునా. హనుమంతుడు చెప్పిన చాలును. సుగ్రీవాదులబుద్ధి జనకకాలమునందువలెనే యున్నది. హనుమంతునిబుద్ధి పదును పెట్టబడియున్నది. ఇట్టికార్యాలోచనకు అతనినే చేర్చుకొనవలయును. సుగ్రీవాదులు యిన్నిమాటలాడుదురు. అర్థముండదు. హనుమంతునిమాటలు అర్థముతోగూడి వృద్ధులుగను మధురముగను లఘువుగను నుండును. ఇటు లగుటచేత రాముడు సంగతి హనుమంతునితో చెప్పె. ... మునకు శరణమనుటను వినగనే చేర్చుకొనవలయు నే

ఎందుచేత చేర్చుకొనక తామసించుచున్నారని హనుమంతు డనెను. మిగుల యుక్తము. వారందరును అటులచెప్పుచున్నారేయని శ్రీరాము డనగా నిజమే. శత్రుని తమ్ముడేను శరణ మనెను. చేర్చుకొనుడు. మంచివాడుగ నుండిన నుండనీయుడు. కొంచెమారంభించిన నేనున్నాను అని హనుమంతు డనెను. రామునికి మిగుల సంతోషమాయెను. హనుమంతా నామనసే నీమనసు అనెను. ధర్మపుత్రా స్వామి అనుకూల్యమున్నది. రాజ్యము లభించును. నీవు మహాబుద్ధిమంతుడవు. నీకు ధర్మచింతయున్నది. శరణాగతరక్షణము చేయుదువు. మేము చెప్పవలసిన విధిగాన చెప్పుచున్నాము. అని అనేకధర్మములు చెప్పి కడపట శరణాగతరక్షణమును చెప్పిరి. శరణాగతరక్షణము నావ్రతమని శ్రీరాము డనెను. ధర్మపుత్రా వాడెవడైనను శరణ మనిన కాపాడుము. ఎవడైనను సరేయోచింపకుము.

శిబిచక్రవర్తియెడ సకలధర్మము లుండెను. అన్నిటికంటెను శరణాగతరక్షణము అధికముగనుండెను. తనకెంతకష్టము వచ్చినను చేయును. ఇటుల జరుగుచుండగా ఇతని మనోదార్ఢ్యమును చూచుటకు అగ్ని పావురముగను ఇంద్రుడు డేగగను వచ్చిరి. పావురము పోవుచుండగా డేగ తరిమెను. పావురము చిన్నది. డేగ బలిష్ఠమైనది. పావురము వచ్చి శిబిచక్రవర్తి యొడిలోపడి మహారాజా నీవు శరణాగత రక్షకుడవు. నన్ను కాపాడుము అనగా అభయమిచ్చెను. ఇంతలో డేగవచ్చి రాజా శరణమ్మనగా అభయప్రదానము చేసితివి. ఆకలిచేత అల్లాడుచున్నాను. దానికేటుల అభయమిచ్చితివి అనెను. ఆకలియేకద దీనినిచ్చెదను దానినిచ్చెదను. అనెను. నాకు మాంసము కావలయునని డేగఅనెను. ఈమాంసము ఆమాంసమని రాజుచెప్పెను గాని కపోతమాంసమే కావలయునని డేగయనెను. కపోతమాంసము లభించదు. అదితప్ప యేమాంసమైనను యిచ్చెదనని శిబిచెప్పెను. నీమాంస మీయుమని అది అడిగెను. రాజు తనదేహములో నొక భాగము కోసి యిచ్చెను. ఇది సరిపోవునా యని అదియనగా శిబి తూచి యీయనారంభించెను. శిబి తనదేహము కండలు కోసికోసి త్రాసులో పెట్టుచుండినను పరీక్షయగుటచేత కపోతము బరువగుచు వచ్చెను. దేహములోగల కండలన్నియు కోసి అయెను. ఇక కోయుటకు మాంసము లేకుండెను. ఇక నేనే త్రాసులో కూర్చుండెదను, నన్ను మ్రింగుమని అతడు అనెను. దీనికి శ్యేన కపోత ఉపాఖ్యానమని పేరు. కపోతము త్రాసులో ఒకప్రక్క కూర్చుండి యుండగా రాజు మరియొకప్రక్క కూర్చుండి యుదివరలో నెందరినో శరణాగతులను వారివారికి కావలసినదానినిచ్చి కాపాడితిని. ఇది స్వల్పజంతువు. నాకండలు ఎంతో కోసి వేసితిని. అదియే బరువుగ నున్నది. ఇది భగవంతుని శోధన. వానిసంకల్ప మెటులున్నదో ఆదెవరికి తెలియును. వానిసంకల్పము వానికే తెలియవలెను. కార్యము జరిగినపిమ్మట ఇతరులకు తెలియును. ఎవ్వరికిని తెలియదా యనిన వారి ఉపదేశమును పొందిన, వానినాభికమలములో కూర్చుండియున్న బ్రహ్మకైనను తెలియునో తెలియదో అని కన్నుమూసికొని భగవద్ధ్యానము చేయుచు, డేగా

నన్ను భుజింపుమని యుండగా ప్రకాశములో యిరువురు దివ్యపురుషులు యెదుట నిలిచిరి. కపోత డేగలు కనుపడలేదు. మీ రెవరని శిబిచక్రవర్తి అడుగగా కపోతముగ నుండిననేను అగ్నిని. నన్ను తరుముచు వచ్చిన డేగ ఇంద్రుడు. సౌరథేయా (సురథ పుత్రా) కౌసల్యాసుప్రజారామ అనినటుల శిబిని పిలిచిరి. నీసత్యగుణమును శరణాగత రక్షణ నియమమును చూడ వచ్చితిమి. ఇటుల కండలు కోసికోసి మరియొక డిచ్చునా. తానే త్రాసులో కూర్చుండునా. ఇట్టిధార్మికు డుండడు. అని అనేక ఆశీర్వాదములు చేసి పోయిరి. (కైక దశరథుని రెండువరము లడ్గిగి ఒకటి రాముని అడవికి పంపుట మరియొకటి భరతునికి రాజ్యము కట్టుట అనెను. ఇటుల అడుగునటులుండిన వరము లిచ్చియుందునాయని దశరథు డనెను. మహారాజా మాటతప్పవచ్చునా. ఒకకథ వినలేదా. అగ్నికపోతముగవచ్చి కాపాడుమనగా శిబిచక్రవర్తి కాపాడెదనని చెప్పి ఆమాటతప్పరాదని తనశరీరమును కోసికోసి పెట్టెనే ఆమహానుభావునికథ వినలేదా అనెను.) మార్కండేయుడు యీకథ చెప్పి శరణాగతరక్షణమును విడువరాదని చెప్పెను.

ధర్మపుత్రుడు ఒకధర్మమును అడిగెను. మార్కండేయా స్త్రీలవలన పురుషులకు ధర్మము జరుగవలసియున్నది. కావున పతివ్రతలకుగల లాభమును పతిభక్తియొక్క విధమును దానివలని గౌరవమును, మాతాపితృ శుశ్రూషనుగూర్చియు, చెప్పుము అనెను. పుత్రునికి భార్యయున్నది గాన తలిదండ్రులను విడుచుటకు హేతువు ఉన్నది. తలిదండ్రులకు వీనిమీది ప్రీతి పోవుటకు కారణములేదు. వీడు తలిదండ్రులు చావవలయునని తలచును. వారు కొడుకు చావవలయునని తలపరు. కారణము కలిగి దూరముగ పెట్టినను యెచటనైనను కొడుకు బాగుగనుండవలయునని తలతురు. తలిదండ్రులనోట వచ్చుమాట వేదవాక్యము. వారు భయపడుచు చేయునో చేయడోయని చెప్పుదురు. అమ్మా దీనికాచేయునా అనవలయును. దుర్మార్గ పుత్రుడు అటులనక అమ్మా యిదిపిచ్చిమాట యనును. తలిదండ్రులు పుత్రుని నడవడిక చేత సత్పుత్రుడని సంతోషించుచుండవలయును. యమునికి నాచీటి దొరకలేదని చింతించుచునటు లుండరాదు. ఎవడు వానితలిదండ్రులు సంతోషించునటుల నడచునో వానికి యిచ్చట కీర్తియు పైన ముక్తియు కలుగును.

స్త్రీలు ఒక దినమునకు యేడుస్నానములు చేయుచు తృతీయ చతుర్థి షష్ఠి యేకాదశి వ్రతములు చేయుచు, ఆ స్త్రీల వలననే వర్షముకురియుచున్నదని యితరులకు తోపించుదురు. విచారించగా భర్తతో మాట్లాడి అనుమానముతై యుండును. అటులుండి ప్రయోజనమేమి. భర్తను దైవమనిభావించి పూజింపవలసిన భార్యలు బద్ధవైర హృదయులుగ నుందురనియు, పుత్రులు పితృదూషకులుగ నుందురనియు కలివైభవమున చెప్పబడెను. అధర్మములేల. అధర్మములు కాపాడవు. స్త్రీలకు పతిభక్తియే తారకము. దానివలననే గౌరవము. భర్తయెట్టివాడైనను పతియేగతి పడతులకు. అతడే బంధుడు

గురుడు పరదైవమని అనసూయ సీతకు చెప్పెను. ధర్మపుత్రా నీవు రాజైనపుడు మాతా పితృ.శుశ్రూష చేయు నటులుగను పతిశుశ్రూష చేయునటులుగను శాసించవలయునని మార్కండేయు డనెను.

స్త్రీలకు పతిభక్తివలన లాభమేమని ధర్మపుత్రు డడిగెను. వేదాధ్యాయియు మహాతపస్వియు ధర్మశీలుడును అగు కౌశికు డను బ్రాహ్మణుడు ఒకచోటునుండి మరియొక గ్రామమునకు పోవుచుండెను. ఒకచెట్టుక్రింద కూర్చుండి బ్రహ్మయజ్ఞము చేసెను. వేదాధ్యయనము చేయనారంభించెను. ఆచెట్టుమీద నొక కొంగ కూర్చుండి యుండెను. బ్రాహ్మణుడున్నాడని మర్యాదగ నుండవలయునని దానికి తెలియదుకదా. అది అతనిమీద మలమూత్రవిసర్జనము చేసెను. బ్రాహ్మణుడు కోపముతో దానిజూచెను. అతడటుల చూడగా అది భస్మమై క్రిందపడెను. ఆహా మిగుల పాపాత్మైన కార్యము జరిగెనని సంకటపడుచు బ్రాహ్మణుడు భిక్షకు ఒకగ్రామమునకు పోయెను.

అతడు ఒకయింట దూరెను. ఆయింటి యామె యింటిపనులుచేసి భర్త ఆకలి యనిరాగా ఆకువేసి భోజనముపెట్టుసమయముగ నుండెను. బ్రాహ్మణుడు భిక్ష భిక్ష యని పోయెను. కొంచెము నిదానింపుడని ఆమె చెప్పెను. వీడు బ్రాహ్మణుడు. భర్త దైవము. ఆమె విడిచి రావచ్చునా అసందర్భముగ నున్నదని బ్రాహ్మణుడు పోవునేమొ యని కొంచెము ఉండుడని ఆమె యనెను భర్త భుజించుచుండగా నామె అతనికి విసరుచుండెను. బ్రాహ్మణుడు చూచెను. ఆమె రాలేదు. లేదనిన ప్రక్కయింటికి పోనా అతడు నాకంటెను గొప్పవాడా వానికేమియోగ్యతకలదు. నామాట మరచెనే అని బ్రాహ్మణుడు కోపముతో నుండెను. అయ్యో బ్రాహ్మణునిసంగతి మరచితినే యని యిదిగో భిక్ష వేసివచ్చెదనని భర్తతోచెప్పి ఆమె భిక్ష తెచ్చెను. నాకీభిక్ష వలదు. లేదనిన పోయియుండనా ఆదియేమి అంతధైర్యమా యని బ్రాహ్మణు డనెను. లేదు. వచ్చెదనంటిని. పతిశుశ్రూషలో నుంటిని. జ్ఞాపకము వచ్చెను. కోపము వలదు అని ఆమె చెప్పెను. అమ్మా నీకు బ్రాహ్మణులశక్తి తెలియదు. వారికి కోపము వచ్చిన భూమండలము భస్మమగును. అని బ్రాహ్మణుడు క్రూరదృష్టితో చూచెను. స్వామీ నేను కొంగ ననుకొంటిరా. అటుల తలచి చూచితిరా. ఈక్రూరదృష్టి నన్నేమియు చేయదు. నేను వేరుకార్యములో నుండలేదు. భర్తశుశ్రూషలో నుంటినని ఆమె అనెను. అటులైన దీనికంటెను అది హెచ్చాయని బ్రాహ్మణు డడుగగా, ఔను. స్త్రీలకు పతిశుశ్రూషయే హెచ్చు. కావుననే మిమ్ము నిలిపి వారికి శుశ్రూషచేసితినని ఆమెచెప్పెను. దానివలన నీకేమి లభించెనని బ్రాహ్మణు డనగా; స్వామీ మీరు క్రూరదృష్టితో చూడగా కొంగవలె అంటినే. అజ్ఞానము సర్వజ్ఞత్వము కలిగెను. నేనెవరు అదుదానిని అని ఆమె అనెను. బ్రాహ్మణుడు అక్షయపాత్రమును క్రిందపెట్టి అంగవస్త్రము నడుముకు కట్టి నమస్కరించి, అమ్మా వేదాధ్యయనముచేసి యేమిప్రయోజనము. నీకు

వలె ఫలించలేదే నిన్న క్రూరదృష్టితో చూచితిని. నీవుకాలియుండిన స్త్రీహత్య కలిగి యుండునే, నీవు ఉపదేశింపుము. నాకు మంచిబుద్ధి కలుగలేదు అని గట్టిగ ఆమె పాదములు పట్టుకొనెను. భోజనము చేయుచుండిన ఆమెభర్త పిలుచుచుండెను. అమ్మా పాండిత్యము విద్యచేత వచ్చును. శాల్వలు తోడాలు లభించును. వాదముచేసి యితరుని జయించి వానిలాభము పోగొట్టి ఆనందింపుదురు. అట్టిచదువుచేత నేమి లాభము. భగవద్గీత 3 అధ్యాయములోవలె కామము జ్ఞానులయొక్క జ్ఞానమును తగ్గించును. అన్నియుండును అంతరంగశుద్ధికలుగదు. అమ్మా ఉపదేశింపుమని బ్రాహ్మణుడనెను. నాకుపతిశుశ్రూషాధర్మముతప్ప మరియొకటి తెలియదు. అధర్మము మీకెందుకు.

ఒకని తెలిపెదను. మిథిలాపట్టణమునకు పొమ్ము అచట ధర్మవ్యాధుడను కటికవాడున్నాడు వాడు మిగుల నీచకృత్యము చేయుచుండును. వాని చూచిన దూరముగ పోవలయునని తోచును. జంతువులను చంపి మాంసవిక్రయము చేయుచుండును. అతని అవమదించిన అనర్థము వచ్చును. వాని ఆశ్రయించిన సకలధర్మములు చెప్పునని ఆమె చెప్పెను. బ్రాహ్మణుడు యోచించి నేను చదివితిని మంచిబుద్ధి కలుగలేదు కానిమ్మని జనకునిచే పరిపాలింపబడ్డిన మిథిలాపట్టణమునకు పోయి ధర్మవ్యాధుడను నేవానియిల్లు యెచట అని విచారించుచు పోయెను. అచ్చటివారు స్వామీ మీరు బ్రాహ్మణులు. వాడు అంగడిలోనుండును. హీనకార్యము చేయుచుండును. వానినేల అడిగెద రనిరి. లేదు చెప్పుడని కౌశికుడనెను. మాంసవిక్రయస్థలము. అచటికి పోరాదు. మీరు పోయి విచారింపుడు. తెలిసికొను డనిరి. ఇటుల పోగా అంగడిచూపి అదిగో వాడే ధర్మవ్యాధు డనిరి. నాల్గుప్రక్కలలోను మృగములను పక్షులను హింసచేయువారు చేయుచుండిరి. ధర్మవ్యాధుడు మధ్యకూర్చుండి త్రాసులో మాంసమునుంచి తూచి వారివారికి యిచ్చుచుండెను. బ్రాహ్మణుడు ఒకప్రక్క నిలిచియుండెను. ధర్మవ్యాధుడు రావలయునే వానికి చెప్పిపంపవలయునే యెటులని యుండెను వానికి యిటు అటు తిరుగుటకు తీరిక లేకుండెను. త్రాసును క్రిందపెట్టుటకు వ్యవధిలేదు. కొనువారు మీదమీద వచ్చుచుండిరి. ఒకబ్రాహ్మణుడు చూడవలయునని నిలుచుచున్నాడని యెవరో ధర్మవ్యాధునితో చెప్పిరి. పని అట్టిదైనను ధర్మవ్యాధుడు మిగుల భక్తిమంతుడు. ఈమాట విని అటులా యని త్వరపడి లేచి పసుగత్తి వచ్చి బ్రాహ్మణునకు నమస్కరించి, వేచియున్నారటనే మిగుల ప్రొద్దాయెనటనే నేను పతితుడను నేనేమి నాయోగ్యతయేమి అధమాధముడను తమయోగ్యతయేమి మిగుల దూరములో నుండవలసినవారు యేలవచ్చితి రనెను. తెలియక రాలేదు. తెలిసియే వచ్చితిని. సావకాశముగ మాటలాడుటకై వచ్చితిని నిలిచి మాటలాడునదికాదని బ్రాహ్మణుడు చెప్పెను. అటులా నేను మాయింటికి రండని పిలువను. తమకు యిష్టముండిన రావచ్చునని ధర్మవ్యాధుడనెను. అటులే వచ్చెదనని కౌశికుడనెను. ధర్మవ్యాధుడు బ్రాహ్మణుని తన

యింటికి పిలుచుకొనిపోయి పీటవేసి కూర్చుండబెట్టెను. మాంసవిక్రయమునకై వాని యింట పశువులుండెను. దుర్గంధమువచ్చెను. బ్రాహ్మణునికి సహింపగూడక పోయెను. ధర్మవ్యాధా నీయోగ్యతకు యీపని తగినదికాదు, నీఅణకువయేమని బ్రాహ్మణుడనెను. ధర్మవ్యాధుడు అంజలిచేసికొని స్వామీ! మను యాజ్ఞవల్క్యాదిస్మృతులను చూచితిరా, బ్రాహ్మణులుగ తోచుచున్నారే నాకేమి తెలియును. ఆజాతిలో నెపుడు పుట్టితినో నాకది స్వధర్మము, భగవద్గీత 3 అధ్యా 35 శ్లోకమునతెలసెను మీవలె నుండవచ్చునా, ఏది భగవంతునిచేత నేర్పరుపబడినదో అది మంచిదైనను చెడ్డదైనను చేయవలయును. భగవద్గీత 18 అధ్యా 47, 48 శ్లోకములటుల చూడబోయిన అన్నికర్మములలోను దోషమున్నది. ఇదినాజాతికి స్వధర్మము తాము కోపించరాదు. అందువలననే వచ్చెదరా యిష్టముండ్డినరండి యంటిని. ధర్మవ్యాధుడు చెప్పెను.

ధర్మవ్యాధా కొన్ని ధర్మము లడుగుటకు వచ్చితి చెప్పుమని బ్రాహ్మణుడనెను. దానము దయ శౌచము సత్యము వీ గూర్చి ధర్మవ్యాధుడు చెప్పుచుండగా, సర్వసాధారణముగ నందరికి అన్వయించు ధర్మములు చెప్పెను. వేదాంతవిచారము చేసియుండడ వేదాంతవిచారమాయెనాయని బ్రాహ్మణు డడిగెను. నాకార్యముచూచిన తెలియలేదా పెద్దలయొద్ద కొంచెము వింటిని ధర్మవ్యాధు డనెను. అదిరో చెప్పుమని బ్రాహ్మణుడనగా వాడు గీతార్థమును స్మరించెను దేహాత్మస్వరూపమును చెప్పుమనగా బ్రాహ్మణా తెలిసినది చెప్పెదను. దేహము అనిత్యము. దేహము యెట్లైనను పోవును. అది పంచభూతముల చేరికచేత కలిగినది కావున దానికినాశము కలుగును. శరీరము మారును. ఆత్మ మారిపోదు. భగవద్గీత 2 అధ్యా 12 శ్లో ఆత్మకునాశములేదు. 13 శ్లో శరీరమునకుమాత్రము నాశమున్నది. వేరుశరీరము వచ్చును. ధర్మవ్యాధుని గీతోపన్యాసము మూడుశ్లోకములు. దేహముపోయిన ఆత్మపోదా. ఆత్మనిత్యమనుచున్నావు. చంపిన హత్యనేరమేర్పడదా. 19 శ్లో ఆత్మ చంపును చంపబడును అనిచెప్పువాడు మూఢుడు. దేహమును విడిచి పోవలయునే యెటుల పోవును. స్థూలదేహమును విడిచి యాతనాదేహమును పొంది అనుభవించి స్థూలదేహము వచ్చును. మరణమన నేమి. 2 అధ్యా 28 శ్లోకమునలె ఒకటిగనుండు పంచభూతములు వేరైపోవును. పాపముచేసిన అచట అనుభవింపవలయునా అనుభవింపవలసినదే. ఒకడుచేసి మరియొకడు దండింపబడుననిలేదు. ఎవడు దోషియో వానికే దండన. 2 అధ్యా 20 శ్లో ఉపనిషదర్థము. వీల కొందరు పాపులు కొందరు పుణ్యులుగ నున్నారు. 7 అధ్యా 27,28 శ్లో జన్మాంతర వాసన. పోయినజన్మమున పాపము చేసియుండిన పాపులౌదురు. పూర్వపుణ్యవాసన ఉండువారు పుణ్యులౌదురు. మరణముకలుగగా తోడనెవరు పోదురు. వీడు వంటరిగ పోవలయును. పుణ్యమో పాపమో వీని తోడ పోవును. (వీడుసంపాదించిన ధన మునంపాదించిన ప్రభువని వెంట పోవునా పశువులు గుర్రములు వెంట పోవునా

కట్టిన చోటుననే అవి యుండును. భార్య వాకిటనే నిలుచును. కన్నులుగలుపుకొనుచు స్నేహితులు శ్మశానమువరకు పోదురు. నాడి నాది యని యెంతో జాగ్రతతో కాపాడినదేహము పొమ్మని పడుండును. వీడుచేసిన పుణ్యపాపములు రెండు వీనితోడ పోవును. రాత్రి పడుండునపుడు కూడ వికటపకి పడుండినవారు లోడ వత్తురా. సమయమున అందరు విడిచిరే యిపుడు నీవే రావలయునని ఒకజ్ఞాని అనిరి. అటుల పుణ్యపాపములు తోడపోవును. ఇదే శాస్త్రము అని ఉపనిషదర్థము గీతార్థము చెప్పెను.

మరియొక వేదాంతార్థము దేహము రథము. ఆత్మ రథి. గుఱ్ఱములు దశేంద్రియములు. ఆగుఱ్ఱములు పరుగెత్తి పడకుండునటుల వాని స్వాధీనములో నుంచుకొనవలయును. అటులచేసిన తనస్థలమున చేరును. గుఱ్ఱములను వాని యిచ్ఛానుసారముగ పోనిచ్చిన బండిని బోర్ల త్రోయును. ఇది ఉపనిషదర్థము. ఎవడు యింద్రియములను స్వాధీనమున నుంచుకొనునో ఆగుఱ్ఱములు మంచివి. వాడు క్షేమపడును. శ్రవణమననములు చేసి వివేకమును సంపాదించి గుఱ్ఱములను ఆగాని సరిగ పోయినయెడల శరీరమను రథములో గూర్చుండి వైకుంఠమునకు పోవచ్చును. అని ధర్మవ్యాధుడు చెప్పెను. ధర్మవ్యాధా నీపని యిట్టిది. నీజ్ఞానము నావలె అనరాదు. నాకంటెను హెచ్చు. గంగాప్రవాహమువలె పోవుచున్నది. యీజ్ఞానమునకు కారణమేమని బ్రాహ్మణు డడుగగా,

"నేను పూర్వజన్మములో మహా బ్రాహ్మణుడను. నాకు విద్య యధికముగుటచేత ఒకరాజుకును నాకును మిగుల స్నేహమేర్పడెను. ఆరాజు నావిద్యను జూచి నన్ను తన వలెనే తలంచుచుండెను. వారు పోవుచోటులకు నేను పోవుచుంటిని. నాకు ఆదిరయే వ డుకపడెను. నేను ధనుర్విద్యలో పారంగతుడ నైతిని. మృగములను సంహారము చేయుచుంటిని. ఒకబాణము ఒక గొప్ప ఋషిమీద పడెను. ఈబాణమును వేసిన దెవరురా యని ఆయన అనగా అయ్యోయని పోయి చూచితిని. ఓరీ మహాబ్రాహ్మణుడవుగనున్నావు. ఇటుల చేసితివి. వేటకాండ్రు యిటులచేయుదురు. నీవు అజన్మము నెత్తుము. మహాపాపివి కమ్ము. మిగుల చెడ్డపాపములు చేయువాడవు కమ్ము. అనెను. నేను ప్రార్థించితిని. నామీద దయకలిగి ఓరీ భగవద్గీత 2 అధ్యా 27 శ్లో పుట్టినవానికి చావు నిశ్చయము భగవదాజ్ఞ అయెను. పోయెదను. ఒకటిచెప్పెదను. మరల మంచి స్థితికి వత్తువు. అదేదియనగా నీకు పూర్వజన్మవాసన ఉండును. అటుల అనుగ్రహించెదను. నీవు మాతాపితృ శుశ్రూష చేయుము. కడతేరుదు వనెను.

అని ధర్మవ్యాధుడు తన పూర్వజన్మవృత్తాంతము చెప్పెను. అందుచేతనా నీకు మహిమయని బ్రాహ్మణు డడుగగా, ధర్మవ్యాధు డతని లోపల పిలుచుకొనిపోయి వయోవృద్ధులగు తన తలిదండ్రులను చూపెను. ధర్మవ్యాధుడు తలిదండ్రులకు స్నానము చేయించి దివ్యవస్త్రములుకట్టి భోజనముపెట్టి ఉయ్యాలలో కూర్చుండబెట్టియుండెను. వారిని బ్రాహ్మణునికి చూపి మనకు మాతాపితృశుశ్రూషచేత గొప్పకలుగును. నాకు

వేరు మంత్రము తంత్రము తెలియదు. నాకేమి అధికారమున్నది. మీవంటివారు ఏమేమి చేయుదురో అది యంతయును వీరిశుశ్రూషయే. వీరికి స్నానముచేయించి భోజనము యిడ్చి కూర్చుండబెట్టి పోదును. ఇపుడు శుశ్రూష చేయుదును అని ధర్మవ్యాధు డనెను. ధర్మవ్యాధా, నీవు మహాజ్ఞానివు. ఆపతివ్రత చెప్పినది నిజము. నాకు మాతాపితృభక్తి జ్ఞానము కలిగెను అని కౌశికుడను బ్రాహ్మణుడు పోయెను. వాని తలిదండ్రులు అంధులు. ఆబ్రాహ్మణుడు శాస్త్రప్రకారము మాతాపితృశుశ్రూష చేయుచుండి కడతేరెను అని మార్కండేయుడు చెప్పెను. బావా పెద్దలు చెప్పుచుందురు. నాకు అవకాశము లేదు. పోవలయును అని కృష్ణమూర్తి ధర్మరాజుతో చెప్పి మార్కండేయునిచూచి ఉపదేశింపుడని ద్వారకకు పోయెను. స్త్రీలకు పతిభక్తి, పురుషులకు మాతా పితృభక్తి ముఖ్యము.

---

(40) ఘోషయాత్ర.

భగవద్గీత 9 అధ్యా 22 శ్లోకమటుల అనన్యభావముతో నమ్మినవారి యోగక్షేమములను భగవంతుడు వహించును. అటుల నమ్మినవారు పాండవులు. వారు స్వామిని తప్ప వేరొకరిని నమ్మలేదు. కావుననే వారు సకల ఆపదలలోను కాపాడబడుచుండిరి. వారిని హింసించవలయునని యుండినవారు చెడుచుండిరి. కౌరవులు ద్రౌపదీమానహరణము చేయవలయునని తలపగా వారిభార్యల మానము పోయెను.| భగవద్గీత 9 అధ్యా 31 శ్లోకములో నాయెడ భక్తిచేసినవారు చెడరని స్వామిచెప్పెను. మొదుట కష్టముగ తోచినను పర్యవసాయమున మేలుగ అగును. ఆపదలు వచ్చినటుల వచ్చును. అనాయాసముగ తొలగిపోవును. మార్కండేయుడు ఉపదేశించుచుండగా స్వామి పోయెను. హస్తినాపురములో దుర్యోధనుడు రాజ్యపరిపాలనము చేయుచున్నాడు కదా. అతడు దుశ్శాసన కర్ణ శకునులతో యోచించుచుండెను.యోచన అవగా నేమి దురాలోచన మామా పాండవులు వచ్చులోపల యేమిచేయుదము.మనసు ఉండలేదు. అచటనే వారిని హతముగావింతమా అనెను. దుర్యోధనా నీకేమి తక్కువరా. పాండవులుండిన అర్ధభాగముపోయి తక్కువైయుండును. వారిని పంపినందున అంతయును నీదాయెనని శకుని అనెను. దుర్యోధనా యుద్ధముచేసినయెడల భీముడున్నాడు. జూదమునకు పిలిచిన ధర్మపుత్రుడు వచ్చును. అనుటకు చేతకాదు. ఆడవలయునని ఆశమాత్రమున్నది. అనిచెప్పి జూదమును యేర్పరచి పంపిన మహానుభావుడవుకదా. నీవు దేవతలందరును ఒకటిగ చేరినను పాండవులను జయించుటకు కాదు. ఒకయేర్పాటు చేసెదను వినుము. సకలము జయించి పంపెదను అని అటులేపంపితివి. మామా నీవిచ్చినసొత్తుఅని దుర్యోధను డనెను. పరదేశులకు కృష్ణానుగ్రహమున అంతసొత్తు వచ్చెనే అని తలచితిమి అంతసొత్తు నీకువచ్చెను. రాజసూయయాగమున నెంతసొత్తు చూచితివో అంతయును

నీకు వచ్చెను. ఆయైశ్వర్యము నుంచుకొని యీయూరిలోనుండ్డి యేమిప్రయోజనము! ఒకరి సంపదను చూచుటకు యిరువు రుండవలయును. ముందుగ కొనివారు చూచి సంకట పడవలయును. పిమ్మట బంధువులు స్నేహితులు చూచి సంతోషించవలయును. అప్పుడే ఐశ్వర్యమునకు ఫలము కావున దుర్యోధనా నీకు అపరిమితభాగ్యము లభించెను. బంధువులు స్నేహితులు చూతురు. మన సకలసంపదను పాండవులు చూడవలయును. అయ్యో యిదియుంతయును మనదేకద యని వారికి దుఃఖము కలుగవలయును. అని శకుని చెప్పగా దుర్యోధన దుశ్శాసన కర్ణులు సమ్మతించిరి. ఒకదినముచూచి మన సకల సంపదలతోడ కుబేరునివలె వారియొద్దకు పోవలయును సముద్రము పొరలి వచ్చినటు లుండవలయును. శ్రీచేతను యశస్సుచేతను నీవు సూర్యునివలె ప్రకాశించుచున్నావు. వారు చూడవలయునని శకుని చెప్పగా ! మామా నాకు యిష్టమేను వారికి చూపవలయునని పోయినటు లుండరాదు. కార్యార్థమై పోగా వారు చూచునటు లుండవలయును అని దుర్యోధనుడనెను. వారివారి వస్త్రాభరణములు సొత్తులు యింటిలో నుండును. గోధనములు బయటనుండును. అచ్చటచట గొల్లవాండ్ర నేర్పరచి ఆవులను ఉంచుదురు. గొల్లవాడలను గమనించుటకై పోవుటకు ఘోషయాత్రయని పేరు. దుర్యోధనుడు ఘోషయాత్ర పోదలచెను. మామా ద్వైతవనములో మన గొల్లవాడ లున్నవి. వాని చూచి బహుదినము లాయెను. యజమానులు రాలేదని వారుయెదురుచూచు చుందురు. సకలైశ్వర్యముతోను పోవలసియున్నది తండ్రిని అడ్డిగిన బాగుగనుండునని దుర్యోధనుడనగా శకుని కానిమ్మనెను. ధృతరాష్ట్రునియొద్దకుపోయి ఘోషయాత్రకు పోవలయుననగా పొండనెను. మనకు భగవంతుడు సకలము నిచ్చెనే వానితోడ పోవలయునని కోరగా ధృతరాష్ట్రుడు అనుజ్ఞనిచ్చెను. సకలవాద్యములతోను సకల అంతఃపురస్త్రీలతోను సకల యిష్ట మిత్ర బంధువులతోను పోయి పాండవులకు సమీపమున నిలిచి గుడారములు వేసిరి. అహంకారము యోగ్యులకు కలిగిన కొంతతగ్గిపోదురు. అయోగ్యునికి కలిగిన నెటు లుండును. అట్టివాడు దుర్యోధనుడు. వాడు సకల విభవములతో పోయి చేరెను. పాండవులు మిగుల నొచ్చిరి. వీడు మిగుల హెచ్చుగ నుండెను. దుర్యోధనుడు అయోగ్యులచేత ప్రశంసింపబడువాడు. వానికి స్నేహితులు అయోగ్యులు. జగదీశా నీవు మాకిచ్చిన వైభవమేమి. దానిని గ్రహించిన విధమేమి. నీవేమియిచ్చినను అనుభవించవలసినది మావిధి. పుట్టినదేమి పెరిగినదేమి. అట్టి దరిద్రులకు యేమైశ్వర్యము కలిగెను. అది నీవిచ్చిన భాగ్యము. ఇపుడు నీవు తీసికొంటివి. ఇష్టముండ్డిన నిత్తువు అని పాండవులు తలచుచుండ్డిరి. వీరు పోయి చేరిరి. గుడారము వేసిరి. తెల్లవారి నిదురలేచి పశువులను చూచివచ్చిరి. వాద్యములు మ్రోగెను. భోజనము లాయెను. వీణ వాయించువారును పాటకులును అందరును ఉండ్డిరి. హరికథ పాడువారు రాలేదు. ఆకాశమువరకు పెరిగియుండు వటవృక్షముక్రింద గుడారము వేసిరి.

వైణికుడు వీణవాయించుచు పాడ నారంభించెను. కవి ్రయిటు లనిరి. దుర్యోధనుడు తనభాగ్యమును చూపగోరి పోయెను. వారు అల్లాడుచున్నారని తలచెను. నోటిపాటను పిడీలుపాటను పెట్టలేదు. ఎందుకనగా ఆపాటలు పెట్టిన ఆపాటకులు వత్తురు. వీణకచ్చేరి పెట్టనేల అనగా తన్ను పట్టుకొనిపోవుటకై వైణికులు రావలయునని ఇంద్రసభలో పాడువారు రావలయుననివీణను పెట్టనేమోయని తోచుచుండెను. పాండవుల కడుపు మండుటకు పెట్టినపాట యెట్టిదిగ నుండును. ఇంద్రుని కీసంగతి తెలిసెను. నాపుత్రుడు అల్లాడుచుండగా వీనికి సంతోషమా. వాని పట్టి తెండని చిత్రసేనుడు మొదలగువారిని పంపెను. వారు వచ్చిరి. దుర్యోధనుని సంపదలుచూచి అందరు భయపడుదురు. మదముపట్టిన యేనుగుకేమి భయము. చిత్రసేనుడు లోపల ప్రవేశించి సభను కలిపివేసెను. అచటనుండినవారిని కొట్టనారంభించెను. తలగుడ్డలు వస్త్రములు పోవుచుండగా అందరు పరుగెత్తిరి. పాండవులు చూచిరి. ముందటి విభవమునుచూచి దుఃఖించలేదు ఇప్పటి దుఃఖమునుచూచి సంతోషించలేదు. ఆసభికులకు సంగతి యిట్టిదని తెలియలేదు. నానాదిశలలో పరుగెత్తుచుండిరి. ఈవిధమును దుర్యోధనుడు చూచుచుండెను. వాడు చూచుచుండగా కర్ణాదులు పరుగెత్తుచుండిరి. కర్ణా యిదేమని దుర్యోధను డనగా అన్యథాచింతితంకార్యం దైవమన్యత్రచింతయేత్ అనినటు లాయెను. మనము వైభవము చూపగోరగా మానభంగము చూపియాయెను. మన చెడుకాలంపు స్వామికి తెలియదా. ఉండనిమ్ము నేనున్నానని కర్ణుడనెను. అందరు పరుగెత్తగా కర్ణుడొకడుమాత్రము దుర్యోధనునికై నిలిచియుండెను. దుర్యోధనుడు పరుగెత్తుటకు లేదు. గౌరవము. కర్ణాకర్ణా అనుచుండెను. గంధర్వులు వచ్చి గుంపులుగుంపులుగ పడగనే కర్ణుడు బాణములువేసి వారు వచ్చిపడకుండునటుల చేయుచుండెను. రాధేయుడు (కర్ణుడు) మహాశూరుడు. ఓరీ యుద్ధమునకు వచ్చువారు వీణతోడ వత్తురా. ఇదియేమి వీణకచ్చేరి యనుకొంటిరా మీకు వీణవాయించుటకు తెలియునా యుద్ధముచేయుటకు తెలియునా అనెను. కర్ణునిది కాలపృష్ఠమను ఆయుధము. వాడు పాండవులు భగవంతుడుతప్ప జగదేకవీరుడు. చిత్రసేనాది గంధర్వులను తిట్టెను. భగవత్సంకల్పము అందరుండిన యత్నించెను. అందరు పోయిరి. గంధర్వులు కొందరు రథములను గుర్రములను ధనుసును ధ్వంసము చేయుచుండిరి. అనేకులు వచ్చి రథమును పాడిపాడిచేసిరి. కర్ణుడు పరుగెత్తెను. యజమానుడు పరుగెత్తుచున్నాడని సైన్యము ఉండుచోటు తెలియక పరుగెత్తెను. కర్ణా నీవును పరుగెత్తుచున్నావేమిరాయని దుర్యోధను డనెను. వీడును పరుగెత్తరాదా గౌరవముగ నిలిచెను. గంధర్వులు పరుగెత్తివచ్చుచుండిరి. కర్ణుని చంపవలయునని కాదు. దుర్యోధనుడు బిడ్డను (అర్జునుని) అవమదించుటకు వచ్చినాడని వాని పట్టి తీసికొనిపోవలయునని వచ్చిరి. రథములేదు. క్రింద నిలుచుచుండెను. ఓరీ కట్టుడని రెండుచేతులను వెనుకకు కట్టిరి. దారమును కొంచెము విడిచియుంచుడు. ఎత్తుడని

యెత్తిరి. వాద్యఘోషముచేయుచు అచ్చటచట నిలుపుచు ఓరీ యిచట వీరెక్కడ చ్చేరి యేమిరా ఘోషయాత్రలో కచ్చేరియేమి. జూదమాడి సంపాదించిన సొత్తును వారికిచూపి సంకటపెట్టుటకా. కొట్టుడు అని పిలుచుకొని పోవుచుండిరి. వీని చంపలేదు. పిమ్మట మానాపమానము లుండునా. జయ విజయీభవ అనుడని చిత్రసేను డనెను. నారదా దులు చూడవచ్చిరి. దుర్యోధనచక్రవర్తి యనిరి. నారదుడు దుర్యోధనా యనగా వాడు తలయెత్తలేదు. విశ్వావసుకొడుకు చిత్రసేనుడు. కర్ణుడు మిగుల వేగముగ పరుగె త్తుచుండెను. పందెమేర్పడినపుడెకదా పరుగెత్తుదురు అనగా చిత్రసేనా నీబాణము ముందుపోవునో నేను ముందుపోదునో యని పరుగెత్తెను. బంధులు యిష్ట మిత్రులు కర్ణాకర్ణా యనుచుండిరి. అపుడు దుర్యోధనుడు యుద్ధరంగములో దొరికెను. వాని కట్టి గర్జనముచేయుచు వాద్యఘోషముతో పోయిరి. రావణుడు సీతను తెచ్చునపుడు తిరిగిచూచుచు తెచ్చెను. అన్నా భయపడుచు జానకిని తెచ్చితిరే అది కొంచెము జ్ఞాప కము చేసికొనుడని విభీషణు డనెను. అటుల చిత్రసేనునికి భయమాలేదు. వేగముగ కాక నిధానముగ పోయిరి. ఎపుడు దుర్యోధనుని కట్టితీసికొని పోయిరో కర్ణుడు పరుగెత్తె నో తదితరులందరు పారిపోయిరి. దుశ్శాసనుడు దుష్టుడని వాని కట్టి తీసికొని పోయిరి. దుర్యోధనాదుల భార్యలు నూర్గురును దివ్యవస్త్రములు కట్టి దివ్యాభరణములు వేసికొని వచ్చిరి. వారు మిగిలియుండిరి. అయ్యో ప్రాణముపోయి స్వర్గలోకమునకు పోదురు. ప్రాణముతోడ పోదురా యనిరి. ఈ స్త్రీలకు గతేమియు లేదు. ఈ స్త్రీలయొక్క వస్త్రములు విప్పడు. ద్రౌపదిచీరలు విప్పిరి. వీరిని విడిచిపెట్టి వారిని యెత్తుకొని ప్రయో జనమేమి అనిరి. ఈ స్త్రీలు యేమగునోయని భయపడి ధర్మరాజుయొక్క పాదములం బడిరి. కవి యిటు లనిరి. ఆ స్త్రీలు యేడ్చుచు వచ్చిరి. పరుగెత్తవలయునని చూచిరి. వలను కాకుండెను. బురదగ నుండెను. ఏలననగా అందరు స్త్రీలును యేడ్చుచు వచ్చిరి. అందు చేత అకస్మాత్తుగ బురద ఆయెను. పరుగెత్తుటకు కాలేదు. అందరును రొమ్ములు కొట్టు కొనుచు పోయిరి. ధర్మరాజుయొక్క శరణుపొందవలయును. వారు కాపాడవలయును అని పోయిరి. మరియొకప్రభువైన అపుడు దాయాదులు ఇపుడు బంధువులా అనును. ధర్మరాజు భయపడకు డనెను. నమస్కరించుచు తలవంచి వచ్చి పాదముల బడిరి. ఆభర ణములతో వచ్చిరి. తలవంచవలయు ననిన కష్టముగ నుండెను. లజ్జ కొంతసహాయము చేసెను. వారు తలవంచియే యుండిరి, స్త్రీలు అందరును ధర్మరాజుపాదములలో పడి అభయప్రదానము చేయవలయును అనుగ్రహము చేయవలయును మాంగల్యభిక్ష మీయ వలయును మీతమ్మునికి తమచరణారవిందములందు భక్తి. తమభాగ్యమును తమకుచూప వచ్చిరి. చరణారవిందదర్శనమునకు వచ్చిరి. మీరు కొట్టిన తక్కువయుండదు. ఇంద్ర సభలో నుద్యోగస్తుడు. ధనుసా. వీణనుంచుకొని కొట్టుచున్నాడు చూడుడు చూడుడు గుజమానుడు పోవుచున్నాడు పోవుచున్నాడు అనిరి. మీరు హింసించవచ్చును

జాయాదులు. క్షత్రియులు. పాటకచ్చేరి జరుగుచుండగా నొకహేతువును లేక యిటుల చేయవచ్చునా యనిరి. ఇపుడేమిచేయవలయునని ధర్మరాజనగా వేరేమున్నది. మా కేమి కావలయును. మాకేమి తక్కువయున్నది. లేమదర్శనమునకు వచ్చిన తమ్ముని యిట్లుల చేయనగునా పాదాదికేశ పర్యంతము ఉండునగలు ఉన్నవి. ఇంటను ఉన్నవి. ఎచ్చటను పోవు. ఒకఆభరణమునకు అపాయము వచ్చెను. యజమానుని చంపిన మాంగల్యము పోవును ఆయాభరణము కావలయును. మేము మీకోదండము కావం. (తమ్ముడు కొడుకని శాస్త్రము.) ఇటుల అల్లాడిరి. భాగవతాపచారముచేత పెద్దఆపద వచ్చెను. వారు యేమిచేయుదురో. వాడు మనవాడు. మనకుకదా అగౌరవము అని ధర్మరాజు యోచించుచుండెను. భీముడు ఆహా తమ్ముడా దర్శనమునకు వచ్చెనా. ఏమి అనువారిమాటలు. ఈమాటలను ఆయన నమ్మును వారెుద్దనా. నేనే వాని కట్టియుండవలయును. మనకేమనియుండగా భగవంతుడే అటుల ప్రేరేపించి చేసెను అని భీముడనెను. వారిదుఃఖమును చూచి ధర్మపుత్రుడు దుఃఖించెను. పెద్దతండ్రి కుమారులు కౌరా కౌరవులకిటుల తటస్థించెనని ప్రచురింపరా మనకుకదా అగౌరవము. వారిచేష్టలను తలచిన యిప్పటికంటె నధికముగ చేయవచ్చును. ఆపదరా యనెను. భీముడు కోపస్వరముతో ఆహా వచ్చితిరా యనగా వారికైనటుల వీరికిని అగునని ధర్మరాజు గలచి పిలిచి ఓరీ వారు సంపత్తులో నుండినపుడు అటు లనవచ్చును. ఆపదలు వచ్చినపుడు యిటుల నిష్ఠురముగ మాటలాడవచ్చునా, నీమనసేమి రాయిరా యనెను. । ఇటుల విశేషముగ బోధించెను. వీరు మనలనెటుల శ్రమపెట్టిరి. మనయేవురిని పెండ్లాడిన పరమసాధ్వియైన ద్రౌపదిని చేసినదేమి. ధర్మపాశబద్ధులమై యుంటిమే నీకొరకు. ఓరీ తమ్ముడని చూడరాదు. కొట్టుడని భీము డనెను. శరణమనివచ్చిన కోపము చూపవచ్చునా, రాముడు భార్యనెత్తుకొనిపోయినవాని తమ్మునికి రాజ్యము కట్టలేదా. పరమద్వేషియైనను శత్రువైనను ఆపదవచ్చి శరణమనిన కాపాడవలయునని ధర్మరాజనెను. జ్యేష్ఠభ్రాతయెడ మర్యాదగలవాడగుటచేత అన్న అటుల చెప్పగనే భీముడు అణగెను. ఓరీ అర్జునా నీవును పొమ్ము. పోయి వాని తెమ్ము మిగుల దూరముపోయిన పోవుట కష్టము. త్వరితముగ పొండు అని ధర్మరాజనెను. అన్నా విరోధిని తెమ్మనుచున్నావేయని అర్జును డనగా మనలో కలహమేర్పడిన మనము యేవురు ఒకప్రక్కను వారు నూర్గురు ఒకప్రక్కను ఉందుము. ఇతరుడు వచ్చినపుడు మనము నూటయేవురని యెంచవలయును అని ధర్మరాజు చెప్పగా, అర్జు. సరియని బయలుదేరిరి. వారు దేవలోకములోనుండి వచ్చిరి. ఇంద్రునిసభలో నుండువారు. మంచిమాటచెప్పి తెండని ధర్మరాజనగా అన్నా వీని విడిపించవలయును. మంచిమాటలతో తేవలయు ననుచున్నారు. యుద్ధముచేయక యిత్తురా యని అర్జును డనెను. మంచిమాటలు చెప్పిచూడుడు. వినకుండిన చిన్న యుద్ధము చేయుడు. గాయముకారాదు అని ధర్మరాజు చెప్పెను. అజ్ఞయని పోయిరి. ఒ

కావున నిర్బంధనగ చేయవలదా. హేగంధర్వులారా నిలుడు. యుద్ధముచేయు స్థలమని తలచితిరా. వీణకచ్చేరియని వచ్చితిరా. మేమిచ్చట నున్నామని విని వచ్చితిరా. వినక వచ్చితిరా. మీరే యిటుల వచ్చితిరా. ఎవరైనను చెప్పి పంపిరా. ఏమాశ్చర్యము. మావలె ఆయుధములతో రావలదా. ఈదుర్బుద్ధి మీకే పుట్టెనా. ఎవరైనను చెప్పిరా అనెను. యుద్ధరంగములో వీరవాదములో ఆత్మప్రశంస చేసి కొనవచ్చును. మేము ద్వైతవనమునకు వచ్చి బహుదినము లాయెను. నేను యిచ్చట నున్నానని తెలియదా. నేనువచ్చి విద్యనేర్చినది యెరుగరా. కాలకేయులను నివాతకవచులను చంపినది తెలియదా. నేనిచట నుండునది తెలియుదేమో తెలిసిన వచ్చియుండరు. విడువుడు.విడువకున్న యుద్ధము. వీడు పరమశివునితో యుద్ధము చేసినవాడు. ఓడినవాడా వాని తల పగులగొట్టినవాడు. ఊరికి పోతినని తలచితిరా. అర్జునునిసంగతి పడిన పరమశివునికి తెలియవలయును. అని గాండీవధనుసును చూపెను. ఇతడు మాభ్రాత విడువుడని అర్జును డనెను. ఏమిర ఆడంబరము చేసెదవని చిత్రసేను డనగా, ఓరీ నేను ఇంద్రుని కుమారుడను. ఈభ్రాతను విడువకున్న ఇంద్రునికి వీణవాయించువారు లేక స్వయముగ మీటుకొనవలసి వచ్చును. నేను చేయవలనది లేదు. నాగాండీవము చేయును అని అర్జునుడు వీరవాదము చేయగా చిత్రసేనునికి కోపము వచ్చెను. ఇంద్రుని కుమారుడు. నిన్న అచ్చట ఆల్లాడినవాడు. వీనికొరకేకద వీని తెచ్చుచున్నాము. బుద్ధిలేనివాడు తెలియకున్నాడు. ఇంతగర్వము పట్టెనా అని యుద్ధము చేసిరి. అర్జునుడు భీముడు యుద్ధముచేసిన ఇంద్రుడు నిలుచునా. ఖాండవవనమున నేమాయెను. చిత్రసేనాదులకు సహించలేదు. అర్జునా మీకొరకు పురా మీకొరకేకద తీసికొని పోవుచున్నాము.ఏల కొట్టెదవురా యనెను. మాకు విరోధమున్నది. మీరేల యెత్తుకొని పోయెదరు కారణము చెప్పుడని అర్జును డనెను. వీడు మిమ్ము సంకటపెట్టుటకు వచ్చెను. సంగతి తెలిసి పితండ్రి వీని తెమ్మనెను. నీకొరకే తెమ్మనెనని చిత్రసేనుడు చెప్పగా అర్జునుడు నవ్వుకొని నాకొరకా నాకేది ప్రియమో దాని చేసినకదా, వీని విడిచిన నాకు సంతోషము. శత్రువనితలపను. నా అన్నకు ప్రియము, నాయన్నప్రియము నాప్రియము, నాప్రియము తండ్రికి ప్రియము, ఆయనప్రియము మీకుప్రియము, కావున విడువుడని అర్జునుడనెను. అర్జునా నీకేదిప్రియమో దాని చేసి రమ్మనెను. విడిచిన ప్రియమా విడుతునాయని చిత్రసేనుడనగా విడువుమని అర్జును డనెను.కట్లువిప్పివిడుతునాయని చిత్రసేను డనగా వలదు అన్నయొద్దకు తీసికొనిపోయి విడిచెదమని అర్జును డనెను. వారువిడిచిపోయిరి. ఇంద్రుడు వాడెచ్చటయని యడుగగా మీబిడ్డ విడువుమనెను నాకేదిప్రియమో అదికదా చేయవలయు ననెను. విడిచితిమని చిత్రసేనుడనెను. యుద్ధములో మృతినొందిన యిరుపక్షములవారిని అమృతవర్షము కురిపించి బ్రతికించిరి. దుర్యోధనుని గంధర్వుడు యెత్తినదిచాలక అర్జునుడు యెత్తుకొని రారా అన్న ఉత్తరువులేకున్న యేమగును. అని అన్నసన్నిధానమున వేసెను. పరాక్రమములేని

చేతులు. అన్నకు చూపరాదు. వెనుకనుంచుమని కట్టిరోయని తోచెను. దుర్యోధనా నీవు పుట్టినదేమి. అన్నదమ్ములగు మమ్ము అవమానపరచితివి. కౌరవవంశమునీవ దేవాదులు భయపడుదురు, న్యాయమో అన్యాయమో సంపాదించితివి ఇట్టివాడవు గంధర్వుడు యెత్తుకొనిపోగా నేమిచేసితివి నేను వీరిని మంచిమాటచెప్పి పంపినదేమి, అర్జునుడు తెచ్చినదేమి యీకళ్లేమిరా చూడ వ్యసనకరముగ నున్నదిరా, మనలోమనకు యెన్ని ఉండినను కౌరవవంశమని ప్రమరింతురుకదా. కర్ణుడెచ్చట శకుని యెచ్చట అని ధర్మరాజనెను. కర్ణుడు లేడు శకుని ఊరికి పోయెనని దుర్యోధనుడనగా యిక యిట్టి అధికప్రసంగము చేయకుము చెంపలు వేసికొమ్మని ధర్మరాజనెను. చేతులు వెనుకకు కట్టియుండిన నెటుల చెంపలు వేసికొనును. ఊరకుండెను. ఇటులైన కీర్తికి క్షయరోగము వచ్చినటుల కదా. భీమా విప్పుమని ధర్మరాజనగా విప్పెను. న్యాయమో అన్యాయమో అసొత్తు అవంశముతో చేరినది. మీరో మేమో అనుభవింతుము. ఇక యిటుల చేయకుమని ధర్మరాజనగా లేదులేదని దుర్యోధనుడనెను. విప్పగా పరుగెత్తిపోయెను. కర్ణుడును దుర్యోధనుడును సంధించిరి. కర్ణునికి సంగతి తెలియదు. దుర్యోధనుడు గంధర్వులను జయించి వచ్చినాడని తలచి దుర్యోధనా నేను కర్ణుడను. ఏమిప్రయోజనము. నీవు శూరుడవు జయించి వచ్చితివి అనెను. కర్ణా నీకు సంగతి తెలయదురా ఆ చిత్రసేనాదులు యెత్తుకొనిపోయిరి. అన్న వారినుండి విడిపించి కోపించి విడిచెను. వాద్యములేలరాయని ఊరికిపోయి మూతి చూపుటకు సిగ్గుపడి అచ్చటనే కూర్చుండెను. ప్రాయోపవేశము చేయదలచి దర్భాసనము వేసికొనెను. ఇదితగదని కర్ణుడును స్త్రీలును చెప్పిరి. దుర్యోధనుడు వినలేదు. వాడు అచట నుండిరి. వీడు దైత్యుడు. పాతాళములోనుండు దైత్యులకు తెలిసెను. వారు హోమము చేసిరి. పిశాచము రాగా దుర్యోధనుని తెమ్మనిరి. అది తెచ్చితినని వచ్చెను. హా యనిరాగా దుర్యోధనుడు భయపడెను. అది యెత్తుకొనిపోయెను. దైత్యులు దుర్యోధనునిచూచి పాండవులను పదుమూడు సంవత్సరములు కాగా మరల పంపవచ్చును. దీనికొరకా ఊరికి పామ్మనిచెప్పి మరల భూతమును విడిచిపెట్టుమనిరి.వీనికి స్వప్నముపలె నుండెను.అందరితో చెప్పగా మేమందరము చెప్పిన వింటివా దైత్యులు దానవులు మనవారనిరి. వాద్యములతోడ.ఊరుచేరిరి. ఇపుడు జరిగినదానికి మరల తలయెత్తవలయునని యుండగా. దుర్యోధనుడు మానహీనుడు రాజసూయయాగము చేయదలచెను. ఆయాగమును నీవు చేయరాదు. వంశములో పెద్దవాడు చేయవలయును పౌండ్రకయాగము చేయుమని భీష్ముడు లనిరి.ఆయాగములో నింద్రునికి అధికముగ హావిర్భాగ మీయవలయును. ఇంద్రా ఒకపర్యాయము గంధర్వులనుపంపి కట్టితివి. ఇక అటుల చేయకుమని హావిర్భాగమిచ్చెనో యని తోచుచుండెను. కవి యిటు లనిరి. దుర్యోధనుడు అయోగ్యుడు వానికి యజ్ఞముచేయవలయునని ఉండువాయనిన భగవద్గీత 17 అధ్యా 18 శ్లో విధియుండెదు. పెద్దబ్రాహ్మణులకు అన్నదానము చేయరు. మంత్ర

ము ఉండదు. దక్షిణయుండదు. శ్రద్ధయుండదు.అది అయోగ్యులుచేయు యజ్ఞము. 16 అధ్యా 17 శ్లో దంభముగ చేయుదురు. (ద్వైతము) పేరుకు చేయుదురు. అనగా పేరే గాని విధియుండదు. అద్వైత విశిష్టాద్వైతములు. సోమయాజియని పేరుకిలుగుటకై చేయుదురు. వీడు అందులో చేరినవాడు. మహాపాపి యనిరి. అవబృథస్నాన మాయెను. రాజులు అందరును మర్యాదలుచేసి పంపగా పోయిరి.దుర్యోధనుడు సకల వైభవముతో హస్తినాపురి చేరెను.

---

(41) దూర్వాస పరీక్ష.

వంశములో జ్యేష్ఠుడుండునపుడు కనిష్ఠుడు రాజసూయయాగము చేయరాదని పెద్దలుచెప్పిరి. దుర్యోధనుడు యోగ్యుడై యుండ్డినయెడల అహా యెంతజరిగినది పాండవులు కాపాడిరే ప్రాణదానము చేసిరే వారిని అవమదింపవలయు ననియు సంకట పెట్టవలయుననియు పోతిని. వారికి దైవసహాయ మున్నది. వారియెడ అపచారపడితినే అని చింతించును. అయోగ్యుడగుటచేత అటుల తలపలేదు. అయోగ్య నాయత్నము ఫలించలేదు. మరలపోయిన సెవడైనను కట్టి తీసికొనిపోయిన సెటుల.కావున నేను పోరాదు. ఎవరైనను తగువారిని పట్టి వారిని యెటులైనను సంకటపెట్టవలయును అని తలచెను. దుర్యోధనాదులు దురాత్ములగుటచేత మహానుభావులైన పాండవులను యెటులైనను సంకటపెట్టవలయునని యోచించుచుండిరి. ఒకనాడు పదివేలశిష్యులతోడ దూర్వాసుడు వచ్చెను. మహాతపస్వి పరమకోపి. కోపము వచ్చిన శపించును. ఆయనచేత సెందరు అల్లాడిరి. ఒకసమయమున స్వర్గలోకములో అమరావతిపట్టణము నేలునట్టి ఇంద్రుడు యేనుగుమీద వచ్చుచుండెను. దూర్వాసుడు పుష్పము నిచ్చెను. ఇది పార్వతి యిచ్చిన పుష్పము. నేను బీదబ్రాహ్మణుడను.ఇది నాకేల. వానికి ఐశ్వర్యవృద్ధి కావలయును అని తలచి యేనుగును నిలుపుమని మాలను వానిమెడలో వేసెను. వానికి గర్వము. ఇంద్రుడు దాని యేనుగుమెడలో వేసెను. అది గురుగురు మనగా ఏనుగు తొండముతో మాలనుతీసి క్రిందకొట్టికాలితో రాచెను. దూర్వాసునికి కోపమువచ్చెను. నీవుయైశ్వర్యముచేత మాలను ఏనుగు రాచునటుల చేసితివో అయైశ్వర్యము యింటికిపోయి చేరులోపల పోవునని శపించెను. ఇంద్రుడు ప్రార్థించి మన్నింపువేడుటకులోపల అతడు శపించెను. ఓరీ నేను మహర్షిని. పార్వతీదేవియొక్క అనుగ్రహమని వేయగా క్రొవ్వుచేత నిటులచేసితి వనెను. ఇతడు అట్టిప్రసిద్ధ మహర్షి. ఇంద్రుని అల్లాడించినవాడు.

కుంతి దూర్వాసుని నొకసంవత్సరము ఉపచరించగా మంత్రోపదేశము చేసిరి. ఇంద్రాదులను పిలిచిన వారు రావలయుననిరి. నిగ్రహానుగ్రహశక్తిలో అద్వితీయుడు. అంతయును తపస్సుయొక్క ప్రభావమే. ఆయన కోపమునకు స్థానము. అట్టివాడు భగ

సద్గుణములను భగవన్నామములను చెప్పుచు వచ్చెను. మనము యోచించుసమయమున తగుమైనవాడు వచ్చెను. ఆయనను పట్టి పాండవులను ధ్వంసముచేయవలయునని తలచి దుర్యోధనుడు వారికెదురుగ పోయెను. దుర్యోధనుడు మిక్కిలి భయభక్తులతో శుశ్రూషచేసెను. కవి యిటు లనిరి. వాడు అటుల వంగునా. అవినీతాత్మ. పాండవులను చంపవలయునని మనసున నుంచుకొని వంగెను. సూర్యోదయాదాది పునస్సూర్యోదయపర్యంతము శుశ్రూషచేసెను. భృత్యులనుంచి చేసెనా కాదు. తానుస్వయముగ భృత్యులలో అధమభృత్యునియటుల మెలంగెను. ఆయనకు ఏయేవేళలో నేనేమి కావలయునో దానినంతయు గమనించుచు ఏయేవేళలో దుర్యోధనా యనునోయని నిద్రాహారములు వదలి విశేషముగ నుపచరించెను. మహాదుష్టుడైన దుర్యోధనుడు వంగునా, ఈశ్వరునికిని అటుల చేయడు. ఈయనకు కోపమువచ్చిన జగత్తును నాశముచేయును. అనియు పాండవులను నాశము చేయింపవలయు ననియు అటుల శుశ్రూషచేసెను. ఉపచారములను పరమవినయముతోను పరమజాగరూకతతోను చేసెను. ఆయనకు తృప్తికలిగి నీకేమికావలయును చెప్పుము చేసెదను అనువంతటిస్థితికి తెచ్చుకొనెను. పాండవులయెడ గల ద్వేషముచేత అర్ఘ్యపాద్యాద్యుపచారములు చేసెనుగాని భక్తిచేత చేయలేదు. ఇదివరలో దూర్వాసునికి యిట్టియుపచారము యెచటను జరుగలేదు. చెడుతలపైననేమి మంచితలపైననేమి ఉపచరించుచుండ యెంతసుఖము. గౌరవము ఉండనీయుమని ఉండెను. మహాతపస్వియైన యితడు వాని ఉపచారములను మెచ్చి యుండెను. భక్ష్య భోజ్యము లెందుకు. చేరు అన్నమైనను ప్రియముగ పెట్టిన అమృతముగ తోచును. అనేక భక్ష్యభోజ్యములు పెట్టినను ప్రియములేకున్న ప్రయోజనముండదు. దూర్వాసుడు శోధించుటకై రాత్రివేళలలో ఊరకుండి అర్ధరాత్రమాయెను. భోజనము వలదనును. పగలు తెల్లవారగనే భోజనమనును. ఆకువేసియుంచగా యెచటికో పోవును. ఎటులెటుల సంకటపెట్టవలయునో అటుల పెట్టెను. చక్రవర్తి సహించియుండెను. దుర్యోధనుని మనసులో దూర్వాసుని వశపరచుకొని పాండవులను హింసింపవలయునన్న తలపుతప్ప వేరు యోచనలేకుండెను. నేను మిగుల కోపిష్టిని. ఎంత జాగ్రతతో చేసినను కోపము రాకమానదు. నేను కోపించవలయునని చూచినను కోపమేరాకున్నది. ఏయేవేళలో నేదేది కావలయునని కోరిన అన్నియును యిచ్చుచున్నావు. ఇటుల యెవరును చేయలేదు నేను మిగుల తృప్తుడనైతిని. నీమనసున నేమున్నదో అడుగవచ్చును అని దూర్వాసుడనెను. నామనసున నేమున్నదో దాని నడుగవచ్చునాయని దుర్యోధను డనగా దుర్యోధనా దూర్వాసుడువచ్చి కొంతకాలము వసించి తృప్తినొందినది కావలసినది అడుగుమన యిది యది యని యోచనయేల. నేను కర్త మకర్త మన్యథాకర్తం శక్తుడను. అడుగుటకు యోచనయేల అడుగుమని దూర్వాసు డనెను. నాదాయాదులు పాండవులు జూదమాడి ఓడిపోయి అరణ్యములో నున్నారని వినియుందురు వారిని

హింసించవలయునని దుర్యోధను డనెను. అహాహా నేను తపస్విని. భగవంతుని ధ్యానించుచున్నానో ఆభగవంతునిచేత పాండవులు కాపాడబడుచున్నారు ఎటులహింసింపుదును అనక వానియన్నము తినినందున, అహా కానిమ్ము. ఒకయుక్తిచెప్పుమని దూర్వాసుడనెను. మీరేచెప్పుడని దుర్యోధను డనెను. ఇటుల పరస్పరము అనుకొని, నారొండ వాస్తవమైన అనుగ్రహముండిన, వారియొద్ద ఒకఅక్షయపాత్రమున్నది. ద్రౌపది బ్రాహ్మణులకు పాండవులకు భోజనముపెట్టి తాను భుజించి పాత్రమును తోమి భర్తను ధ్యానముచేయుచు సుఖముగ కూర్చుండియుండును. మరుసటిదినమువరకు భోజనమునకు మార్గముండదు. ఆసంధిలో మీరు పొండు. ఆకలి ఆకలి యనుడు. ఉపచరింపజాలరు. మీరు భస్మమైపొండని శపింపుడు వారు భస్మమగుదురని దుర్యోధనుడు అనెను. కనుక దుష్టులిచ్చిన దానమును శిష్టులు అంగీకరించినయెడల దూర్వాసునిగతి యగును. అటుల కారణమును గల్పించుకొని వారిని నాశము సేయుడని దుర్యోధను డనగా దూర్వాసుడు పదివేల శిష్యులతోడ పాండవులయొద్దకు పోయెను. వారు నాశమైరని దుర్యోధనుడు తలచెను. వారికి ఒకడున్నాడు. వాడు వారిని విడుచునా కాపాడునని దూర్వాసునికి తోచలేదు. దుర్యోధనా మంచియోచనరా యనెను. అంతయును మీసహవాసమని దుర్యోధనుడనెను. దుర్యోధనా నీశత్రులైన పాండవులకు గొప్పఆపద వచ్చెను. నీభాగ్యమురా. ఆదూర్వాసుని కోపాగ్నిలో భస్మమైరి. అని శిష్యులను పిలుచుకొని పోయెను. పాండవులు చూచిరి. వీరికి భోజనము పెట్టవలయునే అక్షయపాత్రము పనిచేయదే రేపు ఉదయము పెట్టుదమనిన సమాధానపడడే, నివాసవృక్ష స్సాధూనాం అనినటుల కృష్ణుడేగతి కృష్ణుడు కాపాడిన సరి. ఉపేక్షించిన నాశమగుట తెలిసినదే యున్నదని పాండవులు అనుకొనిరి. మంచిది స్నానమునకు లెండు భోజనమునకు ప్రొద్దగు ననిరి. ఏల ఆటుల తెగించి రనగా స్వామిమీద భారము వేసిరి. దూర్వాసునికి దుర్యోధనుని అన్నముచేత దుర్బుద్ధిపుట్టెను. సరి వీరేమో తెగించిరి. ఇందరికి భోజనము పెట్టవగునా. శపించెదను. నశించిపోవుదు రనుకొనెను. దుర్యోధనుని దుర్బోధనచేత పరీక్షార్థము వచ్చెను. అనర్థము వచ్చును అనితలపక కృష్ణుడున్నాడు భాగ్యము. భోజనము యేర్పాటగును అని పరమసంతోషముతో చెప్పిరి. శిష్యులతోడ స్నానముచేసి శీఘ్రముగ రండి ఇందరికి అగునా అనుకొనకుడు. అందరితోడ రండి అనిరి. ఏమిరా యిందరికి పెట్టుటకగునా అని దూర్వాసు డనగా దేవమో ప్రయత్నించెదము భగవంతు డున్నాడనిరి. పాండవులు భగవంతుడున్నా డనగా దూర్వాసుడు యోచించలేదు. సరి పాండవులను పట్టితిమని స్నానమునకు పోయిరి. భోజనమునకు రమ్మంటిరి. శీఘ్రములో రావలయునంటిరి. భోజనము పెట్టనిది ఒకతప్పు రమ్మనినది మరియొకతప్పు అని దూర్వాసుడు శపించునే అని పాండవులు చింతించిరి. సంకటమువచ్చిన యోగ్యురాలగు భార్యతో చెప్పుకొనుటవాడుక కదా. కావున పాండవులు ద్రౌపదిని పిలిచి దూర్వాసుడు పదివేల

శిష్యులతోడ వచ్చెను. భోజనమునకు రమ్మంటిమి. రాత్రిపూట ఒకరికైన పెట్టుటకు లేదే యిందరికెటుల అనిరి. ఏమి చేయవలయునని ద్రౌపది అనెను. వీరికి భోజనము జరుపవలయును. నీవలననే పాండవులని మాకు గౌరవము. ఎటులైన చేయుము. నిన్ను పట్టిరయే స్వామికి మాపై ప్రియము అని పాండవు లనిరి. అటులా మీకేభగవంతుడో నాకును ఆభగవంతుడేగతి ప్రార్థించి చూచెదను. అని ద్రౌపది అనెను. అందరు కూర్చుండిరి. ద్రౌపది కృష్ణాయని స్మరించెను. ధర్మరాజు భగవంతుని నమ్మి శీఘ్రముగ రండని అందరిని స్నానమునకు బంపెను. దూర్వాసుడు ధర్మపుత్రునిచేత పంపబడెను. ద్రౌపదిచేత స్వామి స్మరింపబడెను. ఆశ్రిత కల్పవృక్షమైన కృష్ణుడు స్మరింపబడెను. స్నానములు కానియుడని దూర్వాసుడు త్వరపెట్టుచుండెను.

స్వామి భుజించి శయనగృహమున నుండెను. ప్రక్కన లక్ష్మియుండెను. కృష్ణ కృష్ణ మహాబాహో దేవకీనందనా అవ్యయా వాసుదేవా జగన్నాథా ప్రణతార్తి వినాశన పాహిమాం నీలోత్పలశ్యామ పీతాంబరపరీధామ కృష్ణా యెన్నియో ఆపదలు వచ్చెను. ఆయాపదలలో కాపాడితివి ఆయాపదలు పాండవులకును నాకును చేరినవి. నాకుమాత్రము ఒకయాపద వచ్చెను. వస్త్రము లిచ్చి అపుడు కాపాడితివి. ఇపుడు నాకును పాండవులకును వచ్చెను. దూర్వాసుని శాపముచేత దగ్ధమగుదుము. హేలక్ష్మీపతే కావవే అని ద్రౌపది కన్నుమూసి తెరువగా స్వామి రాలేదు. ఆశ్రిత వత్సలుడవు కరుణాసింధువు నీవు ఉపేక్షించిన కృష్ణుడు ఉపేక్షించెను. మీరు రండని పిలువనెవరున్నారు అనెను. స్వామి రాలేదు. రక్షించుట శిక్షించుట అను అధికారముండువారు యితరులను కాపాడుదురు. నిష్పక్షపాతులనిపేరు కలుగుటకై తనవారిని శిక్షింతురు. లేక యీనేరమును మరియొకరిని విచారింపుడందురు. ఇటుల వాడుక. నీవాడుకయును అటులున్నదేమో. ఏనుగు పిలువగా పోలేదా, ఒకవిధమైన సంబంధమును లేని ప్రహ్లాదుడు దైత్యబాలుడు స్మరింప పోలేదా. ధ్రువునికి ముప్పదియారువేల సంవత్సరములు రాజ్యమేలుమని వరమీయలేదా. అన్నను చంపి కోతికి పట్టాభిషేకము చేసితివే. ఎచటికోపోవుచు ఱాయియైపడియుండిన స్త్రీని కావలేదా. సంబంధము లేకున్న కాపాడుట, సంబంధముండిన విడచుటయా. ఇదిన్యాయమా కరుణాసింధువని మహర్షులు చెప్పగా విని నమ్మితిని. ఇంచుకైన దయలేదా. నేను నీ భక్తురాలను. బంధుత్వమున్నది. ద్రుపదుని కూతురను. పాండవుల భార్యను. గౌరములో చూచిన అదికాక అర్జునుని భార్యను. ఇన్నివిధములైన సంబంధములు కలదానిని మమ్ము గావకున్న మాకుకాదు. నీకు అపకీర్తి వచ్చును. నీకు అపవాదము వచ్చునేయని ప్రార్థించుచున్నాను. నీయోగ్యతను కాపాడుకొనవలయునని యుండిన రమ్ము. ఏవిధసంబంధమును లేనివారిని కాపాడితివి. అనేకసంబంధములు గలదానను. వస్త్ర మడుగుచున్నానా. అపుడు ఆత్మార్థము అడిగితిని. ఇపుడు వచ్చిన బ్రాహ్మణులకు భోజనము పెట్టుమనుచున్నాను. పెట్టకున్న

నీకు పాపము. ఇటుల ఆకలి ఆకలి యను మహానుభావులను రొట్టెల యేమియు లేదని పంపుదును. నీతో చేరినదానను. నీతో చేరిన పాండవులతో చేరినదానను. కాపాడుమని కన్ను తెరువగా స్వామి రాలేదు. కృష్ణా మిక్కిలి బంధువని జగడము వేసి మాటమను కొంటిని. అటుల కాలేదు. నీపాదములంబడెదను. నమస్కరించెదను. అన్ని అనేక విధముల స్తోత్రము చేసి నమస్కారములు చేసెను. నీవు దీనబంధువు. నేను దీనను. నేను పాపిష్ఠిని నీవు పాపములను పోగొట్టువాడవు. ఇపుడు పిలుచుచున్నదే పోయిన నెంత శ్రమపడ వలయునో యని తలపకుము. నీ కృపాకటాక్షము పనిచేయును అనెను. రాలేదు. నేను అడుగుదానను. ఆపద, ఈవేళలో బిగువు చేయ తగువా నీవు స్తోత్రప్రియుడవు. స్తుతించి తిని. ఇంకను నెంత స్తుతింతును. ఎంతవేడుకొందు రాఘవా చాలదా, నాతో పోటి యా. ఇదేమి జగడమా మాకు పెద్దకార్యము నీకు స్వల్పకార్యము. ఆశ్రయించినవారి కోర్కెలు దీర్చువాడవు. ఆశ్రయించితిమి. చింతదీర్చుట కెంతమోడిరా. ఇటులకష్టప డుట నాకు తెలియునా అందువేమొ ఏమనసులో అల్లాడుచున్నావో అనుమానము నున్నాదే నీకు తెలుపవలెనా. నాపాపము నాతోనుండక శ్రీపా నీబిగుడు కేమిబ్రతుకు. ఏపాపుల శాపమొ చెల్లుపమా. చలమేలరా త్యాగరాజ వినుత కరుణాసముద్ర కావవే రామభద్ర అనెను. రాలేదు. పాపము చేయునపుడు చేసి సంకటమువచ్చిన కరుణాస ముద్రా అనుచున్నావా. యందువా జీవాత్మను. ఎటులో సంకటపడెదను. ఈసమయ ములో కాపాడకున్న నీపేరుపోవునే నీపేరు నీవు కాపాడుకొనవలయునని ప్రార్థిం చుచున్నాను. నిన్ను కాపాడలేదను పేరు వచ్చిన నాకు చింతలేదు. ఇతరభక్తులను కాపాడలేదా యందువేమొ. నన్ను కాపాడలేదని పేరు వచ్చును. ఈయపకీర్తి నావలన రావలయునా అనెను. భగవంతుడు స్తోత్రము చేయనిమ్మని ఆనందములో నుండెను. భక్తవత్సలుడు ద్రౌపది అల్లాడునది ఆయనకు తెలిసెను. ఇపుడు ఉపేక్షించరాదని సంభ్రమముతో లేచి ప్రక్కలోనుండిన రుక్మిణిని విడిచి తలుపు తెరచుకొని పోయెను. ద్రౌపదియొద్దకు వచ్చెను. రావలయునా. ఆమె మనసున నుండలేదా కనుబడరాదా యనిన అటుల కనబడలేదు. శ్వాసము విడుచుచు వచ్చెను. ఆనసరముగ వచ్చెను. సర్వత్ర వ్యాప్తుడైనందున అచటినుండియే కనుబడుటకు సౌకర్యముండినను మనము తలచిన వచ్చి కాపాడునని భక్తులకు చూపుటకు పరుగెత్తి వచ్చెను. ద్రౌపది చూచెను. సంతోష మాయెను. పాంచాలి కృష్ణా వచ్చితివా. సంతోషము. కృ- సంగతియేమి. పాం- పదివేల శిష్యులగోడ దూర్వాసుడు వచ్చెను. కృ-దూర్వాసుడా నాకు స్నేహి తుడే. పాం- ఆయన వచ్చెను. రాత్రివేళ భోజనము లభించదని వారు నాతో చెప్పిరి. నాకేమి గతి. నీవే కద. కృ- నాకేమియు వినలేదు. మధ్యాహ్నము కార్యార్థమై ఫలహా రము తీసుకొనలేదు. శీఘ్రముగ నేమైన యిమ్ము. పిమ్మట మాటలాడెదము. పాం- కృష్ణా నీకు పెట్టుటకు సౌకర్యముండిన వారికి పెట్టనా. ఇపుడు అన్నము కలుగదు.

కృ- ఎందుచేత. పాం- నేను భుజించువరకే ఉండును. ఇక రేపటికే వచ్చును, పాత్రము శుద్ధిచేసితిని. కృ- ఏదైనా అంటుకొని యుండిన యిమ్ము, పాం- కృష్ణా నేను బ్రాహ్మణులకు బుద్ధి పెట్టుదునా. శుద్ధముగ తోమితిని. కృ- పాంచాలీ ఉండదా. పాం- ఏమీ, నేను తోమిన దానిలో నుండునా. కృ- అదిరేమే కద కూడనిది. ఇప్పుడును నేను అనుమాట పోలేదా. చూడుము. (పాంచాలి పోయి చూచి ఆకు సెయాకు తెచ్చెను.) కృ- పాంచాలీ చూచితివా. పాం- కృష్ణా నీసంకల్పముచేత కలిగెను. కృ- ఇటు తెమ్ము. పాం- కృష్ణా ఆకలియంటివే ఇది చాలునా. కృ- ఒకపత్రమునైనను ఒక పుష్పమునైనను ఒకఫలమునైనను ఉద్ధరిణెడు జలమునైనను భక్తితో నిచ్చిన చాలును సర్వాత్మయగు సర్వయజ్ఞభోక్తయగు కృష్ణభగవానుడు యీయాకుచేత తృప్తుడగుగాక అనుము. భక్తితో నిచ్చుచున్నాననుము. (పాంచాలి భక్తితో నీయగా స్వామి నోటవేసికొనెను.) కృ- పాంచాలీ సంతోషము తృప్తుడనైతిని. పాం- కృష్ణా దీనికా. కృ- జీర్ణమగుటకు ఔషధమున్నదా. పాం- ఏమి కృష్ణా, కృ- మిగుల అధికమాయెను. (త్రేపేను.) పాం- కృష్ణా నీవిషయమున భయములేదు. అపచారపడినను యేమిలేదు. వచ్చినవారు తృప్తిపడవలదా. కృ- మంచిది రమ్ము. (ముందటి అంకణమునకు పోయెను,) ధర్మరాజు-ఏమికృష్ణా యెప్పుడు వచ్చితివి, కృ- పాంచాలి పిలిచెను. అవసరముగ వెనుకటిమార్గమున వచ్చితిని. ధ- సంగతి యెటుల. కృ- సంగతేమి. పిలువుము. వాడు పంపిన ఇతడు యెటులవచ్చెనని భీమునికి కోపము. గదతోడపోయి లెండు ఎంతతామసము, అన్నము చల్లారునే. అకాలమందురే లెండనెను. వారికి గొంతువరకు పొట్టలు నిండి ఉండెను. మీరేకద శీఘ్రముగ వంటకాలలయు నంటిరి,మీరు ముందుగ పొండని శిష్యులనిరి. నేను అంబరీషుడను భక్తుని యెడ అపచారపడితిని. ఒకపర్యాయము దండింపబడినవాడనగుటచేతే నాకుదండన అధికము, మీరుపోయి సమాధానము చెప్పుడని దూర్వాసుడనెను. అందరును పరుగెత్తిరి. తోడనే భీముడు వచ్చి అన్నా సంగతి తెలియలేదు. ఒక్కొకరును యింతవరకు యింతవరకు అనిరి. పరుగెత్తిరి. అనిచెప్పెను. కృష్ణా యేమిచేసితివని ధర్మరాజడుగగా సర్వస్వరూపుడను. నేను తృప్తుడుకాగా సర్వఅను దానిలో చేరినవారు వారికి తృప్తి అయెను. అని స్వామి చెప్పెను. కృష్ణా మరల వత్తురాయని ధర్మరాజనగా నేను భయపెట్టియుండిన మరలవత్తురు. ఇప్పుడు తృప్తులైరి. వారికి ఒకసంవత్సరము వరకు ఆకలియుండదు. పరుగెత్తిరి, ఇక రారని కృష్ణుడనెను. దూర్వాసునికి దుర్యోధనుని భోజనము జీర్ణమాయెను. కొంచెము వివేకము కలిగెను. మనము స్నానముచేయుచుండ కడుపు నిండెనే యేమి భగవత్కృప, ఇటుల చెడుభోజనము పెట్టి మోసబుద్ధి ఉపచారముచేసి అపచారపడునటుల చేసెనే వాడు నాశనమై పోవలయునని దూర్వాసుడు దుర్యోధనుని శపించెను. దుర్యోధనుడు దుశ్శాసన కర్ణ శకునులతో యోచించి యెన్నియోకష్టములు పెట్టెను. స్వామి కాపాడెను.ఒకటియైనను

వారికి తగిలెనా పెద్దప్రవాహమువలె అపదవచ్చును ఒకటియైన ఫలించెనా. భగవద్భక్తులకు కీడుచేయ దలచిన స్వామి ఎచ్చియో యెవరునైనపంపియో కాపాడును. కావున భగవంతుడు నమ్మినవారిని కాపాడును అని అందరు గ్రహించవలయును.

---

(42) ద్రౌపదీ హరణము.

రాజులు రాజ్యములోనుండినను అప్పుడపుడు వేటకని పోవలసియుండును. పాండవులు వనములోనే ఉన్నారుకావున పలుమరు వేటాడుచుండురు. ఒకనాడు పాండవులందరును వేటకు బయలుదేరిరి. ధౌమ్యాచార్యులు ఉన్నారు. పాంచాలి కేమి భయము దీనికై కావలియుండనేలయని అందరు పోయిరి. పాంచాలి ఒంటరిగ నుండెను. సింధురాజ్యము రాజైన జయద్రథుడు దుర్యోధనాదుల చెలియలగు దుస్సల భర్త. వాడు కోటికాస్యుడను రాజును రథములో గూర్చుండబెట్టుకొని ఒక పెండ్లికి పోవుటకై రథము తోలుచు వచ్చెను. పాండవులు లేరుకావున పాంచాలి ప్రొద్దుపోక ఆశ్రమద్వారములో నుండెను. ఆసమయమున జయద్రథుని రథము యీమార్గముగ వచ్చెను. ధృతరాష్ట్రుని అల్లుడగు జయద్రథునికి సైంధవుడనియు పేరు. వాడు వృద్ధక్షత్రుడనురాజు కొడుకు. వాడు పరమరూపలావణ్యశాలినియైన పాంచాలిని చూచెను. వానికి పాంచాలిని గురుతు తెలియలేదు. ఎందుచేతననగా ఆమె మునుపటిస్థితిలో నుండలేదు. వనవాసము. అదియును గాక వాడామెను తరుచుగ చూడలేదు. వనవాసశ్రమచే ఆమె కొంచెము అందము తగ్గియుండెను. అనేక దాసదాసీజనులతోడ స్వర్ణగృహముననుండునది. ఒంటరిగ ఆశ్రమమున నుండగా పాండవుల భార్యయనియు పాండవుల ఆశ్రమమనియు వానికి తెలియలేదు. వనదేవతయో గంధర్వస్త్రీయో అప్సరసస్త్రీయో యక్షస్త్రీయో యని ఆమెతో మాటలాడగోరెను. భగవంతుడు భక్తులకు అపకారము చేయువారిని శిక్షించుచుండును. వీడు దుష్టుడు. కొంచెము శిక్షింపవలయునని ఆయన ఆటుల ప్రేరేపించెను. కోటికాస్యుడనురాజు శిబిచక్రవర్తియొక్క వంశస్థుడు. ఉశీనరదేశమునకు రాజు. వాడు జయద్రథునికంటెను కొంచెము తగ్గినవాడు. కోటికాస్యా నీవు పోయి నీ వెవతెవని యడిగి తెలిసికొనుము. నే నిటుల రథములో వచ్చితిననియు నాయొద్దకు వచ్చుటకు అగునాయనియు అడుగుము అని జయద్రథుడు వానితో చెప్పెను. చూచినతోడనే అటుల చెప్పిపంపవచ్చునాయనిన పాంచాలిముఖము చూడగనే చంద్రోదయమైనటులుండెను. సముద్రునికి సింధురాజనిపేరు. నదులకు రాజని అర్థము. సింధురాజు ముందుకు వచ్చుచు వెనుకకు పోవుచునుండును. చంద్రోదయమైనయెడల సంతోషముచేత పొంగి కొంతమర్యాదను మీరి అప్రక్కకుపోవును. ఆటుల సింధురాజు (జయద్రథుని) పాంచాలిముఖచంద్రునిచూచి మర్యాదలోనుండక మీరిపోయెను. కోటికాస్యా కొంచె

ము రథమునుండి దిగుము. అది యెవరు. ఇచటికి వచ్చుటకు శౌకర్యమున్నదా . యని అడుగుము. ఏమి సౌందర్యమురా, కడకంట చూచుటను చూడరా. దానిపల్వరుస చూడరా అనెను. దివ్యశరీరము పుష్టిశరీరము ముందువెనుకటిభాగములు తగియున్నవి, అనెను. రావణుడు సీతను వర్ణించినటుల వీడు ఆమెను వర్ణించెను. దీనిని పెండ్లాడి సుఖపడుచుండునట్టి మహాపురుషు డెవడు అడ్డిగిరమ్మనెను. చంద్రుని మధ్యమున కళంకమున్నది. కృష్ణపక్షములో క్షీణమున్నది. గ్రహణము పట్టును. పగటివేళలో ప్రకాశములేదు. అటులుండ చంద్రా నీకు కొంచెమైన సిగ్గులేదు. మనకు హెచ్చినవారు తచ్చిన మాతిమాపను. అటులుండ అనేక దోషములుండు నీవు యీముఖము ముందు నేను చంద్రుడని వచ్చుచున్నావే అనెను. చంద్రా కోపింపకుము. బుద్ధిలేక అడిగితిని. ఇట్టి స్త్రీని అనుభవించు పురుషునిముందు నీవొక పురుషుడని వచ్చెదవేయని అడ్డిగితివేని యేమిచేయుదును. బుద్ధిలేక చెప్పితి ననెను. అటుల చంద్రుడు సిగ్గుపడును. పాంచాలి ముఖము అట్టిది. కోటికాస్యుడు పోయెను. ఆమె ఆశ్రమద్వారములో నిలిచియుండెను. వీని చూచియుండలేదు. ఎవరని అడ్డిగెను. అడుగవలసిన విధియగుటచేత అడుగగా నాకు ఉపచారము చెప్పవలసిన అవశ్యకము లేదు. కార్యార్థమై వచ్చితిని. సింధుదేశాధిపతి అనేక స్తోమములతోడ వచ్చెను. నీవెవరని అడ్డిగి రమ్మనెను.ఎవరి కూతురవు. ఎవరి భార్యవు అని అడ్డిగిరమ్మనెను. చెప్పుము. దేవతలతోడ దేవరాజు వచ్చినటుల వచ్చెను గురుతు తెలిసిన అడుగుదుమా. దివ్యవస్తువు కంటపడిన అడుగక పోదురా. అద్భుతము. చూచి పోదురా. కావున విచారింపక పోవుటకు సాధ్యపడలేదు. అందువలన అడుగుచున్నాము అని కోటికాస్యు డనెను. ఈమెకు వారిని తెలియును. వారికి తెలియలేదు అడ్డిగెను. చెడిపోవుకాలము అడుగమని ప్రేరపించెను. అబద్ధము చెప్పగాదు వచ్చిన వాడు రాజు. నాకు భగవద్భక్తియు పతిభక్తియు నుండగా భయమేమి అని తలచి, నేను ద్రుపదమహారాజు కూతురు. నాకు కృష్ణ ద్రౌపది అని పేరులు. ఎవరిభార్యయని లోకరీతి ననుసరించి అడిగితివి. ఇది అపూర్వవిషయము నాకు యేవురు భర్తలు. సామాన్యులుకారు. ఇంద్రప్రస్థములో రాజసూయయాగము చేసినవారు. వారిభార్యను అని పాంచాలి చెప్పెను. వాడు పోయి సంగతిచెప్పెను. జయద్రథుడు పాంచాలిని చూచినవాడు. పాంచాలియని చెప్పగనే నమస్కారమని పోవలదా. భగవత్సంకల్పము చేత అటుల పోలేదు. భగవంతునికి యెవని రక్షింపవలయునని ఉండునో వానికి మంచి బుద్ధి యిచ్చును. ఎవని చెడుపవలయునని తలచునో వానికి చెడుబుద్ధి యిచ్చును. వాడు మంచిబుద్ధితో మంచికార్యములు చేసి వృద్ధిపొందును. వీడు చెడుబుద్ధితో చెడుకార్యములుచేసి చెడునని వేదవాక్యము. కోటికాస్యుడు పాంచాలియని చెప్పగనే అటులా. పాంచాలియా మంచిది. ఎవరును లేరా. ఈరథమును చూచుకొమ్ము. నేను దాని చూచుకొనెదను. అని పోయెను. సింహములు సంచరించు స్థలమున కుక్కప్రవే

శించునటుల సింహములు లేనిసమయమున కుక్క పోవునటుల పోయెను. పాంచాలి వాడు వచ్చిన రీతిని జూచి కొంచెము భయపడి లోపలపోయెను. తన అభిప్రాయానుసారముగ రాదనితోచి ప్రార్థింప నారంభించెను. పాంచాలీ యెవరోయని తలచితిని. పాండవులు లేరు. మన్మథబాధచేత శ్రమపడుచున్నాను. కాపాడుము. ఇటుల మన్మథవికారాక్రాంతుడనై ప్రార్థించుచున్నాను. ఒంటరిగనున్నావు. నీమర్యాదను కాపాడుకొమ్మ. నేను సింధుదేశరాజును. నీమగలకు కట్టుటకు వస్త్రము భుజించుటకు అన్నము లేదు. అడవిలో రాజ్యభ్రష్టులై అల్లాడుచున్నారు. వారిని కట్టుకొని అల్లాడుచున్నావేల రమ్మ. కొంచెము కటాక్షించిన నారాజ్యము సమర్పించెదను అని కామాతురుడై సాంగోపాంగముగ అరంభించెను. చతురంగబలములు వచ్చియున్నవి రమ్మ. రథములో కూర్చుండుము. సకల రాజవిభవములతోడ పిలుచుకొని పోయెదను. నీమగలు దరిద్రులు, వారిముఖమున కళలేదు అనెను. తండ్రిని గురువును భర్తను ఒకడు దూషించగా వినరాదు. శక్తియుండిన వాని శిక్షింపవలయును. లేకున్న చెవులు మూసికొనవలయును. దక్షప్రజేశ్వరుని కూతురు దాక్షాయణి. పరమశివునికిని దక్షునికిని విరోధము వచ్చెను. శివుడు దాక్షాయణిని తల్లిగారింటికి పంపకుండెను. దక్షుడు వాజపేయము చేసెను. బృహస్పతిసవనము జరిగెను. ఆకాశమున పోవువారు మెచ్చుకొనగా నేనును పోయెదనని దాక్షాయణి భర్తనడిగెను. పోవలదు. మర్యాదజరుగదు. నామీది వైరముచేత నిన్ను అమర్యాద చేయుదురని శివుడు చెప్పెను. దాక్షాయణి చెప్పకపోయెను. దక్షుడు మాటలాడలేదు. పోనిమ్మ. నిధానముగ మాటలాడునని యుండెను. శివునికి హవిర్భాగ మిచ్చువేళ రాగా వానిపేరుచెప్పి హవిర్భాగ మీయరాదు. వాడు దురహంకారి. మనయాగమునకు వచ్చెనా. మనయాగములో వాని కీయవలదనెను. వేదములో చెప్పియుండినను యీయ వలదనెను. దాక్షాయణి ఆమాటలు వినెను. తండ్రి. శిక్షించుటకు కాలేదు. అగ్నిలో పడెను. శివునికి తెలిసి తనజటలలో నొకటితీసి కొట్టగా వీరభద్రుడు బయలుదేరి వచ్చి కొట్టి దక్షునితలను తీసికొని పోయెను.ఆమె మరుజన్మములో హిమగిరి సుతగా పుట్టెను. పర్వతము కూతురుగాన పార్వతి. పరమశివుని నిందను వినగనే పార్వతి సైచక అగ్నిలోపడెను. అటుల జయద్రథుడు పాండవులను దూషింపగనే పాంచాలికి కోపము వచ్చెను. వినుటకు సహించక ఓరీ నేను నాపాతివ్రత్యముచేత నిన్ను భస్మముచేయుదును. పాండవులకు రాజ్యము లేకపోగనే ముఖమున కళతప్పెనా. నీకేమి తెలియును. మాబిడ్డయొక్క భర్తవు. నీకు న్యాయాన్యాయములు తెలియలేదు. దుర్యోధనుని చెలియలైననేను పాండవులకు చెలియలుకాదా. పెద్దరాజుగ నున్నావు. మనబిడ్డకు భర్త గొప్పరాజు లభించెనని సంతోషింపగా యిటు లనుచున్నావేమిరా అనెను. ఇప్పటికిని గర్వము అణగలేదా. పాండవులకు రానురాను దరిద్రమేకద అని జయద్రథుడనెను. విషము

లోపలపోయిన చంపునటుల పాండవదూషణ నిన్ను చంపును. ప్రపంచములో పాండవు లనిన గడగడ వణకుదురు. నీవు దగ్గరి బంధువు. సాంగోపాంగముగ నెరిగియున్నావు. మూఢా నీకును వారికిని గలభేదము తెలియలేదా. ఏమిరా మాయింటి అల్లుడవు. నేను ఆయింటి కోడలిని.ధర్మరాజు భార్యను. నాకు నమస్కరింపవలయును. సిగ్గులేదా. భగవత్కృపచేత మంచికార్యములు జరుగును. పూర్వకర్మముచేత చెడుగు జరుగును. అటుల జరిగినను కొంచెము సిగ్గుపడుచు చేయవలయును.మరల పాండవులముఖము చూడవలదా. ఇటుల మాటలాడుచున్నావే ఇచట నిలువకుము. వారువచ్చిన కష్టము.వారు సామాన్య మనుష్యులా భీముడు యెందరిని సంహరించెను అని అంతయును చెప్పెను. వానికి ఆబోధ యెక్కలేదు.(వైద్యులు ఔషధములు యిచ్చుచున్నారు.అందరికిని పట్టినమందు ఒకనికి పట్టదు. ఏలననగా వానికి ఆయువులేదు అని రఘువంశములో కాళిదాసు చెప్పెను.) అటుల జయద్రథునికి క్షేమకాలమైన యీమాటలు రుచించియుండును. నాశనకాలము కావున అదియేమి ద్రౌపదీ అడుగడుగునకును పాండవులు పాండవులని భయపెట్టుచున్నావు. వారిసంగతి నాకు తెలియదా. భయపెట్టిన పోదు ననుకొంటివా. నేను పాండవులను తెలియనివాడను కాను. రమ్ము. రథము యెక్కుము. ఇక పాండవు లనకుము. భయము చూపకుము అని జయద్రథుడనగా పాంచాలి వలదురా లోకమున స్త్రీయనిన కొంచెము బుద్ధిచెడుట కలదు. పాత్రాపాత్రమును చూడవలదా. పాముకు గాలి ఆహారము. గాలి ఆహారమని గరుడుడు శ్వాసనిడువగా ఆగాలిని మంచి యాహారమని ఆముఖము సమీపమునకు పోయిన నోటవేసికొనును. తల్లి అక్క భార్య అందరును స్త్రీలే. అందరిని సమముగ చూడవచ్చునా. గరుడునియొద్దపోవు పాముగతి నీకు పట్టును పొమ్మని పాంచాలి అనెను. పాంచాలీ మిగుల అధికముగ మాటలాడకుము. భర్త యెటులుండినను భార్య తృప్తిపడవలసినదే. లేకున్న గతియెటుల వారియెడ నాకు భయముండిన వత్తునా. దరిద్రులు. తినుటకు అన్నములేదు కట్టవస్త్రములేదు. తెలియును. వచ్చి శీఘ్రముగ రథములో కూర్చుండెదవా. లేదా. లేకున్న కొప్పులో చేయివేసి లాగుకొని పోదును. అని వాడనెను. పాంచాలి ఒంటరిగనుండెను. ధౌమ్యాచార్యులు ఒకచెట్టుక్రింద నుండెను. కృష్ణా పంచపాండవులు లేరు. సీతను రామలక్ష్మణులు లేనిసమయమున రావణుడు పిలిచినటుల పిలుచుచున్నాడు. ఏమికార్యముగ మన్నావో. కృష్ణా కృష్ణా యనుచున్నాను.గట్టిగ పిలిచెదను. నామొరాలకించియుండిన రాకుందువా. కృష్ణాయనగా చీరలిచ్చి కాపాడలేవా. ఇపుడు వినలేదేమొ. లేక యెన్నిపర్యాయములని తలచితివేమొ.అటుల కాదు.ఎన్ని పర్యాయములైనను ఆపదలోవచ్చి కాపాడుదువని పెద్దలుచెప్పగా విని నమ్మి పిలుచుచున్నాను. నీక[illegible]గుణములు విని విని నే నెంతో నెరనమ్మితిని. నేను చీర లడుగ లేదు. అపుడైనను దుశ్శాసను[illegible] చెడుతలపుతో యీడ్చెను. వస్త్రము విప్పెను. పాంచా[illegible] సహరణముకదు. [illegible]దియే మాన

హరణకాలము అనెను. పాంచాలీ నేనెవరు. ధృతరాష్ట్రుని అల్లుడను సింధుదేశరాజును. మర్యాదతో వచ్చెదవా తలలో చేయివేసి యీడుచుకొని పోదునా. ఏమే ప్రార్థించెదవు. ఎవడు రక్షింపబోవుచున్నాడు అనెను. పాంచాలి యీమాటలకు స్వాధీనపడునా. వీడు తన పౌరుషమును సామర్థ్యమును చెప్పి పాండవులను తగ్గించిచెప్పెను. చతుర్విధోపాయములుచేసెను. ఈమెమనసు చెడలేదు. సీతపెండ్లికి రావణుడు బాణాసురుడు వచ్చిరి. నీవెచ్చటికి వచ్చితివని రావణు డనెను. నేను పరమశాంభవుడను. వృద్ధుడను. పెండ్లాడుటకు రాలేదు. నాయొక్క వేయుచేతులకు క్రొవ్వుపట్టి శివుని జగడమునకు రమ్మంటిని. నేను నీకు దైవము. రాను. జనకునింట నాధనుసు ఉన్నది. రేపు దాని నెత్తుము. కదలదు. నీచేతుల క్రొవ్వు పోవునని శివు డనెను. అందుచేత వచ్చితినని బాణాసురుడు చెప్పెను. పిమ్మట బాణాసురుడు భక్తితో నమస్కరించి శివధనుస్సునెత్తెను కదులలేదు. ఎటుల కదులలేదనగా రావణుడు చతుర్విధోపాయములు చేసినను సీతమనసు కొంచెముకూడ కదులలేను. పతివ్రతమనసు యెటుల కదులదో అటుల శివధనుసు కదులలేదని కవి యనెను. అవిధముగ పాంచాలి నిజమైన పతివ్రతగ నుండకున్న మనసు చలించును. నిజమైన పతివ్రతగాన కొంచెమైనను కదులలేదు. తిరస్కరించెను. పాండవులు రాలేదు. పాంచాలీ యిక ఉండను. ఇటు రమ్ము. అని జయద్రథుడు రెండడుగులు పెట్టగా పాంచాలి కొంచెము తొలగెను. పైటకొంగులోచేయివేసి పట్టుకొనెను. పాంచాలి యిపుడు ఊరకుండరాదని వాని త్రోసెను. రాజపుత్రిగాన వాడు క్రిందపడెను. పెద్దచెట్టు వేరుతెగి పడినటుల క్రిందపడెను. అపుడు వానికి కోపముసహా యుండెను. నేను రాజును బలశాలిని శూరుడను. అకంది త్రోసెను అని పాంచాలి నుద్దేశించి నిన్నిపుడు రథములో గూర్చుండబెట్టుకొందునో లేదో చూడుమని గట్టిగ పట్టుకొనెను. పాంచాలి హాయని కృష్ణుని దలచి యేడ్చెను. వాడు యీడుచుకొనియే పోయెను. పాంచాలి రథములో గూర్చుండి ధౌమ్యాచార్యులకు నమస్కరించి పాండవులు వచ్చిన రమ్మనుడని చెప్పిపోయెను. ధౌమ్యాచార్యులు చెట్టుక్రింద కూర్చుండి ధ్యానముచేయుచుండెను. ఇదివరకు యెన్నియో ఆపదలు వచ్చెను. అవి ఆపదలు కావు. ఇదే ఆపద. పరమాత్మా నిన్నుపొగడ నాతరమా. బ్రహ్మకే తరము. కమలాసననుతచరణ తాళజాల జాలమేల సమయమిదే నన్నుబ్రోవ అని పాంచాలి ప్రార్థించెను. వాడు రథమును త్రోలెను. పాంచాలిని తీసికొని పోవుచుండెను. పాండవులకు అపశకునము లాయెను. ద్రౌపదిని ఆశ్రమమున ఒంటరిగ విడిచివచ్చితిమేయని వేరువేరుగ పోయియుండినవారు వచ్చి చూచిరి. ద్రౌపది కనుబడలేదు. భీమా ద్రౌపది అగపడకున్నదిరా అర్జునా లేదురా. సర్వసొత్తులుపోయి సర్వరాజ్యముపోయి కందమూలాదులు తినుచుండినను భార్య ప్రక్కనుండ కష్టము తెలియలేదు. భీమా యెవడెత్తుకొని పోయెను. ప్రాణముతో తీసికొనిపోయిరో మాంసాపేక్షకునై తీసికొని

పోయిరో అని ధర్మరాజనెను. అన్నా వెదకుదమని తమ్ములనగా ఏంటరిగ పోవునట్టి స్త్రీ కాదు. అటులకోరిన మనయేవురిలో నొకరిని తోడ పిలుచుకొని పోవును. వేడుకగ పోదు. పూజకై పుష్పహరణార్థము పోయెనో అని ధర్మరాజనెను.సంకటపడుచు వెదకిరి. ధౌమ్యాచార్యులు వారినిచూచి మంచికాలము. ఇపుడే పోవుచున్నాడు. పొండనెను. ఎవరని వారనగా మనయింటి యల్లుడు. శీఘ్రమని ధౌమ్యాచార్యు డనెను. రథముపోయిన మార్గము ననుసరించి పోయిరి.పదివేలయేనుగుల బలము గలవాడుభీముడు. అన్నా భార్యను కాపాడుకొనుటకు చేతకాలేదని అందురే అని భీము డనెను.అర్జునా నేను మొరటువాడను. నీవు శస్త్రములు వేయువాడవే కాపాడరాదా అనెను. పాతాళమునకు పోయినను విడుతునాయని అర్జునుడు ధనుసును టంగ్ టం గని కొట్టుచుండెను. తట్టినయెడల సర్పము కోపముచేత శ్వాసవిడుమనటుల అర్జునుడు శ్వాసములో ఆస్త్రాడుగట్టి ధనుష్టంకారము చేయుచుండెను.భీమార్జునులు పరుగెత్తి పోవుచుండిరి. ధర్మపుత్రనకుల సహదేవులు వెనుక పోవుచుండిరి. అందరు చేరిరి. భీముడు ముందు పోయి రథములో గూర్చుండి యెడమచేతిని వానితలలోవేసి క్రింద త్రోసి ఒకఅదుము అదిమి జుట్టుపట్టి యెత్తి క్రిందవేసి మరలయెత్తి క్రిందవేసి యేమిరా యేమిచేసితివి యేమిచెప్పితి వనెను. ద్రౌపది వేడుక చూచుచుండెను. వానిగొంతుపట్టుకొనెను. ఎత్తెను. విడిచెను. వానిప్రాణము గొంతులోకి వచ్చెను. ఒకపర్యాయము కొంచెము రాచిన చచ్చును. ధర్మరాజు చంపకుము చంపకు మనెను. ఎందుచేత వాడుచేసిన దెట్టి యపరాధమని భీము డనెను. ఔను. అపరాధము చేసెను. మనబిడ్డ దుస్సలను చూడరా అని ధర్మరాజనెను. దానికై యిట్టికార్యము చేసినవాని విడువ నగునా యని భీము డనగా ఓరీ చెలియలిని చూడకున్నను తల్లిని చూడుము. తపముగావించి కనిన బిడ్డరా. ఆబిడ్డకు వైధవ్యము ప్రాప్తించిన గాంధారి సహించునా. ఇప్పుడుచేసిన ప్రాయశ్చిత్తము చాలునురా యని ధర్మరాజనెను. అన్నా చంపను. ద్రౌపదిని పిలుచుకొని పొండి ఇకను బుద్ధిచెప్పి వచ్చెదను. నకుల సహదేవులను పిలుచుకొని పొండనెను. ధౌమ్యాచార్యులు వీరికి క్షేమముగలిగించు వేదమంత్రములను చెప్పుచు వచ్చెను. వారితోడ ఆశ్రమమునకు పోయిరి. భీముడు మరల పట్టిక్రిందత్రోసి ఊరక కొట్టెను. వాడు బలిష్ఠుడు. భీమునికి చేయి నొప్పికలుగగా సహాయముచేయుటకై కాలితో తన్నెను అనగా కాలుసేతులతో కొట్టెను. వీని విడువవలయును విడిచినయెడల పాండవులు బంధువులని విడిచితినని బింకములాడునని ఊరిలో ముఖము చూపకుండుటకై అర్జునుడు అర్థచంద్రబాణముచేత ఐదుచోటులలో గొరిగెను.. ఓరీ గొంతుకోయకుమని భీము డనెను. ఏరథమున ద్రౌపదిని పిలుచుకొని పోయెనో ఆరథములో వాని గూర్చుండబెట్టిరి. రథమేలయని వాడనగా కాదు కూర్చుండుమని మేళములు వాద్యము లనిరి. వాయించమనిన కొట్టుదురని వాయించిరి. ఈయవస్థతో ధర్మపుత్రునిముందు వేసిరి. ఓరీ

యేలరా యిటులచేసితివి. మాయింటి అల్లుడవని యెంతయుపచారము చేసియుందుము. అని ధర్మరాజనెను. ద్రౌపదీ యిది చాలునా యికను యేమైన చేయుదునా యని భీముడు చూచెను. చాలును. ఇక విడువు డనెను. మిమ్ము పెండ్లాడి యిటులాయెనే యనియనునని ఆనె. నడిగిరి. మిగుల మృదుహృదయ. చాలు ననెను. వాడు తలవంచెను. ఏమిరా అపుడు వెండ్రుకలు అధికముగ నుండెను కేశభారము తలవంచితివి. ఇపుడేమిరా యని ధర్మరాజు భీమునిపిలిచి విడువుమనెను. ఓరీ నిన్ను సంహారము చేయవలసినదియే. మాదుస్సల సంబంధముచేత క్షమించితిమి. ఓరీ ద్రౌపదికి నమస్కరింపవలదా. నేను వలదనకున్న భీముడు చంపియుండునే. నీవుతప్ప మరియొకడైన ప్రాణముతో నుండునా. క్షమించెదను. ఇకమీదు యెచ్చటను యిటులచేయకుము లేదనుమని ధర్మరా జనెను. వానికి సిగ్గు. యోచించుచుండెను. లేదనెదవా పోదునాయని భీము డనెను. వాడు లేదు లేదనెను. వానివిడ్చిచి పంపిరి. వాడు ఊరికి పోగూడదా పోలేదు. హిమవత్పర్వత ప్రాంతమునకు పోయి పరమశివునిగూర్చి తపమాచరించెను. కృతఘ్నుడుగాన అటులచేసెను. తోడనే శివుడు ప్రత్యక్షమాయెను. ఏమికావలయు ననగా పాండవులను జయింపవలయు ననెను. సరి యెట్టివారినైనను జయింపవచ్చును. ఐతే మహానుభావుడైన శూరుడైన వీరుడైన అర్జునుని జయించుటకు కాదు. వానికి కొలదికాలము క్రిందటనే పాశుపతాస్త్రము నిచ్చితిని. వానినెటుల జయింతువు నాభార్యతోడ పోతిని. యుద్ధము చేసితిని. మెచ్చితిని. పాశుపతాస్త్రము నిచ్చితిని. నేనే మెచ్చి నీరథముముందు నల్ల వస్త్రములు ధరించి పోదును. నన్నుచూచియె అనేకులు మృతినొందుదురు. సింహధ్వని చేయుదును మరియును చత్తురని చెప్పితిని. వాని జయించుట కెటులగును. వా డెవడు. నరనారాయణాంశము. ఇంద్రావతారము అని శివుడు చెప్పెను. వాడేకద జయింపబడవలయునని జయద్రథు డనెను. ఓరీ నీవు అధఃగుదువు. నాగౌరవమును కాపాడుకొనవలదా యని పరమశివు డనెను. జయద్రథుడు మరియు మరియు అడుగపోగా శివుడు అంతర్ధాన మొందెను. జయద్రథుడు ఊరుచేరెను. వరము ఒకవిధముగ లభించెను. సంపూర్ణముగ లభించలేదు. నన్నువిడ్చిచి యేవురును పోవచ్చునా యని ద్రౌపది అనగా యికమీదు ఒకరుకావలిగ నుండెదమనిరి. పాండవులు స్వామిని దలచుచు కామ్యకవనములో నుండిరి.

---

(43) సావిత్రి ఉపాఖ్యానము.

మార్కండేయుడు అనేక ఉపాఖ్యానములు చెప్పి పోయి మరల వచ్చెను. వారితోడ మాటలాడుచుండునపుడు పురుషులలో మిగుల కష్టపడ్డినవారు నలుడు హరిశ్చంద్రుడు ఉండిరని వింటిమి. ద్రౌపదివలె అల్లాడిన స్త్రీ కలదాయని ధర్మరా జనెను.

మార్కండేయుడు మొదట జగన్మాతయగు సీతను దృష్టాంతముగ చెప్పెను. సీత రాజకూతురు సామాన్యుని పెండ్లాడలేదు. రాముని పెండ్లాడెను. అనేకకష్టములు అనుభవించెను అని రామకథను నలువది అధ్యాయములుగ చెప్పెను. పిదప సావిత్రికథ చెప్పిరి. ధర్మపుత్రా! ఆసీతమాత్రముకాదు. సావిత్రియను నొకస్త్రీయును అల్లాడెను. వినుమని మార్కండేయుడు చెప్పనారంభించెను.

భగవద్భక్త్యాదులచేత పురుషులకు మోక్షము కలుగునని చెప్పబడుచున్నది. స్త్రీలును పతిభక్తిసల్పి మోక్షము నొందనగును. భగవద్గీత 9 అధ్యా, 32 శ్లో స్త్రీలును పురుషులవలె స్వధర్మము నొనర్చి భగవదర్పణముచేసిరేని వారికిని గతికలదని శ్రీకృష్ణమూర్తి చెప్పెను. పురుషులకు భగవంతుడు దైవము. అట్టి భగవంతుని యనుగ్రహము కోరు స్త్రీలు పతిభక్తిసల్పవలయును. ప్రాతఃకాలమున నిదురలేచి స్నానమాచరించి భగవత్సన్నిధికి పోయి దర్శించి, అనేక వ్రతము లాచరించి, తన్ను చూచువారికి అహా యీమెవలననే వాన కురియుచున్నది అని తోపించి,పతితో మాటలాడి యేడుమాసము లాయెనని చెప్పుకొను స్త్రీయొక్క వ్రతము లన్నియును నిష్ప్రయోజనములేను. సర్వత్ర స్నేహము పతియెడ ద్వేషముగల స్త్రీయొక్క భక్తిని భగవంతుడు సమ్మతింపడు. సాధువో అసాధువో ధనికుడో నిర్ధనుడో యెట్టివాడైనను భర్త అని యేర్పడినవానిని యోగ్యురాలగు స్త్రీ దైవమని భావించును. అయోగ్యురాండ్రగు స్త్రీలు యిందుకు విరుద్ధముగ నుందురు. పతి యెట్టివాడైనను అతని సదా బంధుడు గురుడు పరదేవత యనియెంచి అతడే గతియని యుండవలయును. స్త్రీలు తమతండ్రులు ధనికులని యెంచి గర్వించరాదు. తండ్రియేదో వస్త్రాభరణాదులు యిచ్చునేకాని పెట్టె బీగము నిచ్చునా? భర్తఅన్ననో అతనికిగల సర్వస్వము నిచ్చును. ఇట్టి మనసుతో పతిభక్తిసల్పు స్త్రీ మోక్షమునొందును.పతికంటెను హెచ్చైన శక్తి కలుగును.ఇందుకు నిదర్శనముగ సావిత్రి కథ చెప్పబడుచున్నది. సావిత్రియను నామె పతిభక్తిచేత ననేక ఘనకార్యములు చేసెను. ఆమె తన్ను కాపాడుకొనెను. భర్తను కాపాడెను.తల్లిదండ్రులను కాపాడెను వారికి వచ్చిన మహాదుఃఖమును పోగొట్టెను. తల్లిదండ్రులను గాపాడుట అనుసంగతి అంత గొప్పదికాదు. ఆమె తన అత్తమామలను గాపాడెను. భర్త కులమును నుద్ధరించెను. ఇటులామె ఆర్గురిని కాపాడెను. ఇన్నికార్యములు చేయుటకు ఆమెకు రథ, గజ, తురగ పదాతులుండెనా. ఎంతమాత్రము లేదు. పతిభక్తిచేతనే యిన్నికార్యములు చేసెను. అట్టిపతిభక్తిచేత నార్గురు కాపాడబడిరి. ఆగుణము లేకుండినయెడల నార్గురికిని అధోగతియేను.

మద్రదేశమున అశ్వపతి యను రాజుండెను. అతడు పరమ ధార్మికుడు. మహానుభావుడు. సకల ప్రాణులహితము కోరువాడు. భగవద్గీత 3 అధ్యా, 20 శ్లోకమున జనకాదులు కర్మము నాచరించిరని చెప్పబడెను. ఆది శబ్దముచేత అశ్వపతి ప్రియవ్రతుడు

మొదలగువారని వ్యాఖ్యానమున తెలుపబడెను. ఇందుచేత అశ్వపతి ఘనుడని తెలియగాచున్నది. అతడు శూరుడు. బ్రాహ్మణులను వర్ణించునపుడు జ్ఞానులనవలయును. రాజులను శూరులనవలయును. భగవద్గీత 2 అధ్యా, 31 శ్లోకమున క్షత్రియులకు ధర్మయుద్ధముకంటె మించినది లేదని చెప్పబడెను. అతడు పట్టిజగడములతో కాలముపుచ్చువాడు కాడు. ఆశ్రితులను కాపాడువాడు. వారి కల్యాణ గుణములనెన్న మనతరముకాదు. అట్టి రాజుండెను. ఇన్నియుండియును అతనికి సంతతి లేకుండెను. ఆరాజు చింతించి పండితులతో నాలోచించగా వారు రాజా! ప్రతిబంధకమున్నది. సూర్య నమస్కారములు చేయవలయును. గాయత్రి మంత్రముచేత హోమము చేయవలయును. అట్లు చేయునెడల సంతతి కలుగునని చెప్పిరి. రాజు వారిమాటనమ్మి పదునెనిమిది సంవత్సరములు హోమము జరుపగా ప్రతిబంధక నివృత్తియై అతని భార్య గర్భవతియై సుందరవతియైన పుత్రికను గనెను. ఇంత గొప్పకాలము హోమముచేసియు కడపట ఆడుబిడ్డ పుట్టెనే యని చింతింపరాదు. ఆడుబిడ్డ పుట్టినపుడు సాధారణముగ కొందరు చింతింపుదురు. మరికొందరు దానికేమి యేదోయొక బిడ్డయని నిరుత్సాహముతో తృప్తిచేసికొందురు. అటుల తలపరాదు. గుణశాలినియగు ఆడుబిడ్డ పుత్రునికంటెను దశగుణములు శ్లాఘ్యమని యెంచవలయును. అట్టి యామెచేత యిరుప్రక్కలవారును క్షేమపడుదురు. ఇటులెరిగిన అశ్వపతి పుత్రికాజననమునకు సంతోషించెను. ఆ శిశువుకు జాతకర్మనామకరణాదులు చేసిరి. ఆమెకు సావిత్రియని పేరుపెట్టిరి. గాయత్రికి సావిత్రియని పేరు. గాయత్రీ జపహోమముచేసి పుట్టినదిగాన సావిత్రియని అర్థము సవితృ=అనగా సూర్యుడు, సూర్యుని అనుగ్రహమునబుట్టినదిగాన సావిత్రియని మరియొక అర్థము. గాయత్రి మంత్రము బ్రాహ్మణుడు కానివానిని బ్రాహ్మణునిగ జేయును. అట్టి మహామంత్రవీర్యముచేత పుట్టిన బిడ్డ యెటులుండును. సూర్యోదయమైనటులుండెను, సామాన్య మనుష్యులు చూచుటకు సాధ్యము కాకుండెను. ఇటుల శుక్లపక్షచంద్రుని కళలవలె పెరుగుచుండెను. ఈబిడ్డను పెండ్లాడుటకు యెల్లదేశరాజులును సేను సేననుచు రాకూడదా. ఒకడును రాలేదు. కొందరు వచ్చి ఆమెను జూచి ఆహా యిట్టి విలక్షణ తేజస్సుగల యీమెను యెటుల పెండ్లాడనగును పెండ్లాడుట భార్యను చూచుటకా కన్నులు మూసికొనుటకా అనియెంచుకొని, అయ్యా! మీరు పెద్దలు. ఈమెయును సౌందర్యవతి. అయితే యీమెను చూడజాలకున్నాము అని అశ్వపతితో చెప్పి నమస్కరించి పోవుచుండిరి. మిగుల సౌందర్యాంగములుగల సావిత్రికి వరుని సంపాదించుటకై అశ్వపతి అనేకప్రయత్నములు చేసెను. గొప్పగ వరదక్షిణ యిచ్చెదనని చెప్పెను. ఎన్నిచేసినను ఆమెను పెండ్లాడువాడు దొరకనందున అతడు మిగుల చింతించి,తన పుత్రికయొద్దకువచ్చి ఆమెను తనతొడపై గూర్చుండబెట్టుకొని, అమ్మా! ఎంతో శ్రమపడి తపమాచరించి నిన్నుగంటిని. నీవు తేజస్సుతో పుట్టితివి. కన్యారత్నము పుట్టెనని సంతోషించితిని.

ఇపుడు నీవలననాకు దుఃఖము కలుగుచున్నది. నీవు నాకు దుఃఖకారణ భూతురాలుగను న్నావు. ఇంక తామసింపతగదు. నిన్ను పెండ్లాడు వాంఛతో వచ్చినవారందరును నిను జూచి భయపడ్డినమస్కరించి పోవుచున్నారు. ఇక నీకును నాకును యేమిగతి యనెను. సామర్థ్యరాలును, మహాబుద్ధిశాలియు, గాయత్రీ మంత్రవీర్యముతో నిండినదియునగు ఆసావిత్రి తండ్రీ! నేను ఆడుదాననై పుట్టితిని. పెండ్లాడిరే తీరవలయును. మీరు ప్రయత్నించియు ప్రయోజనము లేకపోయెను. ఏమిచేయ నగునని బదులు చెప్పెను. అమ్మా! గొప్పరాజు కాకున్నను నిను జూడగలవారిని నీవే వెతకికొనుము. నేను వివాహముచేసెదను అని అశ్వపతి సావిత్రితోచెప్పగా, నామె ఈశ్వరా ఆడుదాననైపుట్టిన నేను స్వయముగ భర్తను వెదకికొనవలసివచ్చెను. అయినను తండ్రి యాజ్ఞ. అందందు వెదకి యెంద్రైన దొరకిన తండ్రి కరిగించెదనని రథ గజ తురగ పదాతులతోను మంత్రితోను బయలుదేరెను. ఈశ్వరా! నన్ను సృష్టించి యీరీతి చేసితివి పూర్వజన్మమున నెట్టిపాపమొనర్చితినోగాని ఆఫల మిటుల ప్రాప్తించెను దాని అనుభవించి అయెను. నిన్ను మించినదైవమును నమ్మలేను. అట్టిదైవమును లేదు. నాకు తగుభర్తను యేర్పరచుమని భగవద్ధ్యానముచేయుచు పోయెను.

భర్తను వెదకికొనుటకై సావిత్రి బయలుదేరి పోగనే అశ్వపతి అయ్యో నాపుత్రికకు వరుని సంపాదించలేకపోతిని అబిడ్డ స్వయముగ వెదుకపోయెను. ఆమెకైనను దొరకునా. వెదకివెదకి తుదకు లేదని వచ్చిన నేమిచేయునగును అని పరిపరివిధముల చింతించుచుండెను. గురుభక్తి, దైవభక్తిగల నీకులక్కువేమి. భగవద్గీత 9 అధ్యా 22శ్లో అటుల మీయోగక్షేమములు భగవంతునివికదా నీకాచింత యేలననుచు నారదుడు రాగా రాజతని తగుఆసనమున గూర్చుండబెట్టి స్తుతించి మాట్లాడుచుండెను. సావిత్రి అనేక రాజ్యములు వనములు చూచుకొనుచు పోయి ఒకవనమున సత్యవంతుడను రాజపుత్రుడు తన్ను బాగుగ చూచియు కన్నులు మూసికొనకుండుటను గాంచి అతడె తన భర్తయని తీర్మానించుకొని మంత్రితోడ ఊరికివచ్చిచేరెను. సాళ్వదేశాధిపుడగు ద్యుమత్సేనుడు అంధుడుకాగా అతనిరాజ్యమును శత్రులపహరించిరి. అతనికొక పుత్రుడుండెను. ఆరాజతని దారాసుతునితోడ వనమునకుబోయెను. అవనమున పెరిగి పెద్దయైన వాడే సత్యవంతుడు. సావిత్రి యతనిభర్తగ వరించి తండ్రియొద్దకేగి తండ్రితోడ నుండిన నారదునికిని అటుపిమ్మట తండ్రికిని నమస్కరించెను. సంగతియేమని తండ్రియడుగగా అనేక రాజ్యములకు వనములకు పోతిని. శ్రమపడ్డితిని. కడపట భగవ దనుగ్రహమున నొకని భర్తగ నేర్పరచుకొంటిని అని సావిత్రి చెప్పెను. అమ్మా! అతడు నీతేజస్సును జూచి సహించెనా అతడురాజేనాయని అశ్వపతి యడుగగా తండ్రీ అతడు చూడగలిగెను. రాజుకాడు. అని సావిత్రి యుత్తరమిచ్చెను. సంతోషము. వివాహ మొనర్చెద వని రాజనగా, భగవత్సంకల్పము. మీ రేమి చేయుదురు బిడ్డ పాపముచేసినది. ఏదో

కొన్నిగుణము లున్నవని యీామె వానిభర్తగ చేసికొనెను. వినుటకు దుఃఖముగ నున్నది. అని నారదుడనెను. అల్లుడు దొరికెనని సంతోషించుచుండగా మీారేల యిటులనుచున్నారు. అతడు గుణవంతుడయ్యేనేని సంతోషింపక దుఃఖపడనేలయని అశ్వపతి యడిగెను. అతనియందొక దోషమున్నది. నేటినుండి అతనికొక్క సంవత్సరమాయువుగలదు. అమరునా డతడు మృతినొందును. ఏమిచేయ నగును. సావిత్రి యీాసంగతి నెరుగదు అని నారదుడు తెలిపెను. సావిత్రి అంతయును వినుచుండెను. రాజుకు పిడుగుపడి నటులుండెను. వేదవాక్యమైన తప్పునుగాని సర్వజ్ఞుడగు నారదునిమాట తప్పదని నిశ్చయించుకొని పుత్రికను జూచి, అమ్మా! నీకీసంగతి తెలియకపోయెను. వేరొకని భర్తగ నేర్పరచుకొని రమ్ము. అని చెప్పెను. వివాహమైన పిమ్మట తెలిసియుండెనేని యేమి చేయుదురు. నేనతని మనసుచేత వరించితినని సావిత్రియనెను. అశ్వపతి పుత్రికకు చెప్పిచూచెనుగాని ఆమె సమ్మతింపకుండగా, నారదా! నీవైనను ఆమెకు బోధింపు మనెను. నారదుడును వేరొకని పెండ్లాడు మని చెప్పెనుగాని మనసుచేత వరించినవాని విడిచి మరొకని పెండ్లాడుట శాస్త్రవిరుద్ధముకదా యని సావిత్రి యనెను. నారదుడపుడు అమ్మా పెండ్లాడ వచ్చును. మునుపు బృహస్పతికొడుకు కచుడు మృతసంజీవని విద్య నభ్యసించుటకొరకు శుక్రాచార్యుని నాశ్రయించెను. శుక్రుని కూతురు దేవయాన కచుని వివాహమాడ దలచియుండెను. అసురులు శత్రుపక్షమువాడగు కచుని చంపగోరి అతడు గోవులమేపుటకు పోయియుండగా నతని బట్టి తుండ్లుగకోసి పారవైచిరి. శుక్రాచార్యుడు భుజించునపుడు కూతురినిసహా తోడ భుజింపరమ్మని పిలువగా నామె కచుడు రానిదే రానని చెప్పెను. శుక్రుడపుడు కచుడా! యని పిలువగనే దూరముగనుండిన కచునిదేహముముక్కలు ఒకటిగచేరి యెప్పటియటుల మనుజుడైవచ్చి తోడభుజించెను. అసురులెల్లరును యోజించి మరలకచుని భస్మముచేసి సముద్రమున కలిపిరి. మునుపటివలెనే దేవయాన భుజింపరా ననగా శుక్రాచార్యులు కచుడా యని పిలిచెను. కచునిదేహమందలి పరమాణువులెల్లను ఒకటిగచేరి మనుష్యుడుకాగా యతడు మరలవచ్చెను. అసురులు కచుని భస్మముగావించి ఆభస్మమును నీటగలిపి శుక్రునికి దాహముగనిచ్చిరి. దేవయాన కచుడులేనిదే భుజింపనని పట్టుపట్టెను. శుక్రుడు కచుడా యని పిలువగా నతడు యేమియని గర్భమునుండి పలికెను. శుక్రుడాసంగతి తెలిసికొని అమ్మా! కచుడు నాగర్భమున నున్నాడు. నాకడుపు చీల్చుకొని రావలసియుండును. నీకు నేనుకావలయునా, కచుడుకావలయునా యని యడిగెను. తండ్రీ! నీవును కచుడును కావలయునని దేవయాన కోరెను. శుక్రాచార్యు డపుడు తనగర్భములోని కచుని తూర్పుగ కూర్చుండి అంజలిచేసి భగవద్ధ్యానముచేయుమని చెప్పి మృతసంజీవనివిద్య నుపదేశించి తనకడుపు చీల్చుకొని వచ్చి మరల తన్నుబ్రతికింపుమని చెప్పగా కచుడటులేచేసెను. ఉపదేశమాయెనిక పోయెదనని కచుడు బయలుదేరగా నీకొరకు ఎన్ని

చేసితిని. నిన్ను బ్రతికించితిని. ఇపుడు పోయెదననుచున్నావా. నన్ను పెండ్లాడుము అని దేవయాన అనెను. నీవు నాకు మేలుచేసితివి. విద్యచెప్పించితివి. ఆచార్యుకు తండ్రి యగుచున్నాడు.నీవు సహోదరివి. నీవు ఉండిన గర్భమున నేనును ఉంటిని.నిన్ను పెండ్లాడను. అనగా దేవయాన కోపించి మాతండ్రియొద్ద గ్రహించిన విద్య నీకు ఫలించరాదు అని శపించెను. నావంటివాని నిటుల శపించితివి. నీకు బ్రాహ్మణుడగు భర్త లభింపక పోవలయును. ఈవిద్య నాకు ఫలించకున్నను నాశిష్యుల కుపదేశించెదను అని బదులు శపించి కచుడు పోయెను.దేవయాన మనసావరించిన అకచుని విడిచి యయాతిని పెండ్లాడెను. సావిత్రీ నీవును అటులే మరియొకని పెండ్లాడుము అని నారదుడు చెప్పెను. సావిత్రి యామాటలు విని,నారదా ! నీవుచెప్పుసంగతికిని నాసంగతికిని సంబంధమే లేదు. దేవయాన పెండ్లాడకోరినవాడామెకు లభింపలేదు. వాడే ఆమెను విడిచి శాపము సహా యిచ్చెను. నేను దీర్ఘ సుఖమును కోరుపక్షమునసే సత్యవంతుని వదలవలసి యుండును. దానికిని దీనికిని సంబంధములేదు. నే నితరుని నెంతమాత్రము పెండ్లాడను అని ఖండితము చెప్పెను. అతడు అల్పాయువు గలవాడే యని నారదు డడుగగా, అయిననేమి ఒకయేడు అయినను అతనికి ఆయుస్సు ఉన్నదికదా. అంతమాత్రము చాలును అని సావిత్రి యనెను. ఈశ్వరా ఆమె నమ్మకమె ఆమెను కాపాడవలయు నని నారదుడు ఆశీర్వదించెను. ఒకసంవత్సరమని తెలిసియును యీమెను యిచ్చుచు న్నను. ఈశ్వరా కాపాడుమనిచెప్పి అశ్వపతి కూతురిని అడవికి తోడ్కొనిపోయి నాపుత్రికను నీపుత్రునకిచ్చెదనని ద్యుమత్సేనునితో చెప్పగా నతడు మాకు రాజ్యము న్నదా భవన మున్నదా వలదనెను.అశ్వపతి యనేకవిధముల ప్రార్థించి సావిత్రిని సత్యవంతునికిచ్చి వివాహముచేసి అమ్మా శుశ్రూషచేసికొనుచుండుము అనిచెప్పిఆమెకు యథేచ్ఛముగా వస్త్రాభరణాదుల నిచ్చి పోయెను. భర్తయును అత్తమామలును నారవస్త్రములు ధరించుచుండగా తండ్రిగొప్పవాడని నేను మంచివస్త్రముల ధరింపవచ్చునా. నాకు ఆభరణాదులేలయని యామె అన్నియును త్యజించెను. ఇట్టివాని పెండ్లాడితివని మనసున చింతించెనా భర్తనుసాక్షాత్ పరబ్రహ్మమని యెంచి శుశ్రూషచేయుచుండెను అత్తమామలకును భక్తితో శుశ్రూషచేయుచుండెను.

సావిత్రి భర్తకును అత్తమామలకును భక్తితో శుశ్రూష చేయుచుండగా ఒకయేడు గడిచెను. సత్యవంతుడు మృతినొందవలసిన దినము వచ్చెను. ప్రతిదినమును సమిధలు దర్భలు పుష్పములు వంటకొరకు తెచ్చుటకుగాను సత్యవంతుడు చిన్నకొడవలినెత్తికొనిపోవు వాడుకగనుండెను. సత్యవంతుడు యెప్పటియటుల తలిదండ్రులతో చెప్పి భార్యతో చెప్పగా నామె అతనికొంగు పట్టుకొని బహుదినములుగ మీతోడ రావలయునని ఆశజెందియున్నాను.నగనట్టలు కావలయునని అడుగలేదు మీతోడ రావలయునని కోరుచున్నాను అని చెప్పెను. తలిదండ్రుల అనుమతి గైకొందువేని నాతోడ

పిలుచుకొని పోవుటకు ఆక్షేపణలేదని సత్యవంతుడు చెప్పగా సావిత్రి అత్తమామలకు నమస్కరించి ఒక సంవత్సరముగ భర్తతోడ పోవలయునను కోరిక గలిగియుంటిని. మీతో జెప్పక దాచియుంటిని. ఇపు డాకోరికను వెలిబుచ్చితిని. భర్తతోడ పోవుట కాజ్ఞయొసగుడు అని యడిగెను. ఆదంపతులు పుత్రుని బిలిచి, పుత్రా! సావిత్రినిసహః నీతోడ బిలుచుకొనిపొమ్ము అని ఆజ్ఞాపించిరి. సత్యవంతుడు గొడవలి పూలబుట్టను నెత్తుకొని భార్యతోడ బయలుదేరి పోయెను. అతడు ఆశ్రమముననుండునపుడు సిగ్గుచేత సావిత్రిని గట్టిగపిలిచి యెరుగడు. అతడు సావిత్రికంఠమున చేయివేసికొని వేడుకగ మాట్లాడుచుండెను. సావిత్రికి మనసున భయముండినను పైకిగొంచము, నవ్వుచు పతి తోడ పోవుచుండెను. సత్యవంతుడు పుష్పములు మొదలగునవి కోసిరయిన పిమ్మట కట్టెపుల్లలు దొరకనందున గొడవలితో కట్టెలు కొట్టుచుండెను. సావిత్రి యతనికి విసరు చుండెను. సత్యవంతుడు కట్టెలుకొట్టుట నిలిపి సావిత్రీ తలనొప్పిగనున్నది. మిగుల బలహీనముగ నున్నది అని చెప్పగా నామె కూర్చుండు డని చెప్పెను. సత్యవంతు డటుల కూర్చుండి సావిత్రీ! నూరుశూలములు పొడిచిన నెంతబాధకలుగునో అంతగ తలనొప్పి యెత్తుచున్నది. నీదివ్యమైనతొడమీద పరుండ్డితినేని యింతబాధతొలగి హాయిగ నుండును అనగా సావిత్రి అటులే చేయుడని చెప్పెను. సత్యవంతుడు భార్య తొడమీద తలనుంచుకొని పరుండి మైకమురాగా నిద్రజెందినటు లుండెను. సావిత్రి విస రుచుండెను కాల మాసన్నముకాగా యమదూతలు వచ్చిరి. సావిత్రి తనపాతివ్రత్యప్రభా వముచేత యమదూతలగాకగని మీరెవరని యడుగగా వారు దూతలమని చెప్పిరి. మీ రేల వచ్చితి రని ఆమె యడుగగా వారు సత్యవంతుని ప్రాణము నపహరించుటకై వచ్చి తిమనిరి. అటులైన తీసికొనిపొండ్డి యని సావిత్రి చెప్పగా వా రామెను సమీపించలేక, ఓరీ! యీామె నిప్పుగనున్నది. ఈమెయొద్ద నేదో మంత్రమున్నది. ఈమెను సమీపించ లేకున్నాము. అనుకొని పోయి తమయజమానునితో విన్నవించుకొనిరి. పిమ్మట యము స్వయముగ వచ్చెను. అపు డా యమునికిని సావిత్రికిని యిటుల సంభాషణ జరిగెను.

సావిత్రి— అయ్యా నీ వెవరవు. యముడు— నేను యముడను. ఇతని ప్రాణ మప హరించుటకు వచ్చితిని. సా— నీదూతలు చేయుకార్యమునకు నీవేల వచ్చితివి. య— ముందుగ దూతలను బంపితిని వారు నీప్రభావమునకు వెరచి పారివచ్చిరి. సా— అటులయిన పిచులుకొనిపొండ్డి (అనిదూరముగ తొలగగా యముడు పాశమువేసి అంగుష్ఠమాత్రమయిన ప్రాణము నపహరించి పోవుచుండెను. సావిత్రి తనభర్త శిరస్సును మెల్లగదించి యొకరాతిమీదనుంచి కప్పి ఈశ్వరా నేను వచ్చుపర్యంత మితని శరీరమును కాపాడుము అనిచెప్పి అతనితోడ బయలుదేరెను.

య— అమ్మా! యెక్కడికి వచ్చుచున్నావు. సా— నేను వచ్చుచుండిన నీకేమి. య— నేను యముడనని తెలియుము. సా— యముని ప్రాజాపత్యము నాయెడ చెల్లదు.

య- నీవేల వచ్చెదవు. సా- నీవేల ఆడిగెదవు. య- ఇది యమమార్గము.నీవు యీచోటుల రాజాలవు. సా- రాజాలకున్న నేనే నిలుతును. (యమునికి సావిత్రియొక్క పాతివ్రత్యతేజస్సు కొట్టినందున ఆమెభర్త ప్రాణమును తీసికొని పోజాలక ఆమెను పంపివేయ్మట పోవలెయునని యెంచి) య- అమ్మా! నీవు పొమ్ము. సా- అయ్యా! నేను పోజాలను. య- నీవు భర్తయెడ జూపవలసినప్రేమ జూపితివి. ఇతనితప్ప మరియేదైనను వర మడుగుము. సా- అడ్డిగెదను. య- ఎందరినో తీసికొనిపోతిని. ఎందరినో చూచితిని. నీరీతి యెవ్వరును కూడవచ్చినవారు లేరు. నన్నే ధిక్కరించెదవు. ఎల్లప్రాణులును నా పాశమునకుచిక్కి రావలసినదేను.నీ ధైర్యమేమనదగును.ఇతనితప్ప వరమడుగుము. సా- ముందే చెప్పితినికదా యితనినేల అడుగుదును అయ్యా! మీరు ఘనులు. అనుగ్రహించుటకు శక్తిగలవారు. మనఃపూర్వకముగ వర మేదియైన నిచ్చెద మనుచున్నారు. మా మామగారు కన్నులుపోయి శ్రమపడుచున్నారు. ఈక్షణమున వారికి కన్నులు తెలియవలెను. ఇంత మాత్రము అనుగ్రహముచేయుడు. యముడు- సావిత్రీ, మిగుల సంతోషము నీస్వంతకార్యమును లేక నీవారి కార్యమును కోరక యిట్టివర మడ్డిగితివి. అతని కిపుడే కన్నులు తెలిసెను. (యము డీరీతిచెప్పిపోవుచుండగా సావిత్రియును అతనివెంట పోవుచుండెను.) య- అమ్మా మరల వచ్చుచున్నావేమి. సా- రాకూడదని విధియా. య- వర మిచ్చితినే. సా- గైకొంటినికదా. మా మామగారికి కన్నులు తెలియుచుండునా. య- అతనికి కన్నులు వచ్చినవి.నీవు పోయి చూడుము. సా- నాకు సాధ్యపడకున్న నేనే పోదును. (యమబాధ యీజీవునికి కలుగలేదు. ఆబాధ నాకే కలుగుచున్నది. ఈ పెబారినుండి తప్పించుకొనిపోయిన చాలు నని తలచి యము డీరీతి బల్కెను.) య- అమ్మా! మరియొకవర మిచ్చెదను. ఇతనిమాత్ర మడుగకుము. సా- ఎందుకు అడుగుదును. య- వేరొక్క వర మడుగుము. సా- మా మామగారిరాజ్యము వారికి లభించవలయును.య- అటులే జరుగును.రేపు పట్టాభిషేకము అగును.నీవు పొమ్ము. సా- నేను పోను. య- రెండు వరము లిచ్చితిని కదా. సా- తీసికొంటిని కదా. య- ఆవరములతో తృప్తిజెంది పోదువనికదా యిచ్చితిని. సా- అటులచెప్పియుండిన వరములే అడిగియుండనే. (భటా యీమెను త్రోయుము అని చెప్పుటకు లేదు. తోడవచ్చుచుండిన సావిత్రిని నిలుపుమార్గము తోచలేదు. అందుచేత యమునకు విసికి ఈశ్వరా నాగతి యిటులాయెనే అని తలచి) య- సావిత్రీ మరియొక వర మిత్తునా. సా- ఈయవచ్చును. (ఈవరము గైకొనిపోయెదవా అని యడుగుటకు భయము. వర మిచ్చి అమ్మా నాకు ఉపకారముచేయుము. నీవు పొమ్ము అని అడుగుట మంచిది. అని తలచి యమునకు అంజలి చేసి) య- సావిత్రీ, వరమడుగుము. సా- మాతండ్రి మిగుల శ్రమపడగా నేను పుట్టితిని. నన్ను కని అతడు శ్రమపడుచున్నాడు. కాన అతనికి నూర్గురు పుత్రులు కలుగవలెను. య- అటులే అనుగ్రహించితిని. (అని వరమిచ్చి పోపోగా

సావిత్రియు కూడ నడిచెను) య- సావిత్రీ మరల వచ్చెదవేల. సా- మీ రడుగుటేల. య- నీవు పోదువనికదా వర మిచ్చితిని. సా- మీతలపు నాకెటుల తెలియును. య- ఈమార్గమున రా జాలవు. సా- అటులైన నేనే నిలుతును. (యముడు కొంతదూరము పోయి నిలిచి) య- సావిత్రీ ఇతనితప్ప అసాధ్యమైన దైనను మరియొక వర మడుగుము. సా- అడుగుదునా. య- (అంజలితో) అవరము గైకొని పోయెదవా. సా- అటు పిమ్మట నిచ్చట నుండరాదా. య- ఉండరాదు. సా- అటులే చేసెదను. య- ఇచట నిలువరాదు. సా- నిలువను. య- అడుగుము. సా- నాకు సంతతి కలుగవలయును. సంతతి కలుగుటకు అనేక కారణము లుండినను, అరీతుల కలుగరాదు. ఆసంతతి సత్యవంతునిసంబంధ ముండునదిగ నుండవలయును. నూర్గురు కలుగవలయును. నాపాతివ్రత్యము చెడరాదు. ఈవిధమున వరమిత్తురేని వెంటనే పోయెదను. య- అటులే వర మిచ్చితిని సంతోషమేనా. సా- మిగులసంతోషము. పరమానుగ్రహము. య- పోయెదనని చెప్పి మరల వచ్చుచున్నావేల. ఇక నీవు వచ్చుటకు న్యాయములేదు. సా- నాకిక నొక కార్యమున్నది.య- ఆకార్యమెద్ది.సా-అయ్యా! నిన్ను జూడ పరితాపముగ నున్నది. నాపాతివ్రత్యము చెడక, సత్యవంతుని సంబంధముగల వరమిచ్చితివి. నీమాట కల్లకాబోవుచున్నదికదా. నీవు అసత్యవంతుడ వగుదువుకదా యని చింతించుచున్నాను అసంగతి తెలుపుటకు వచ్చుచున్నాను (అయ్యో ఈమె పాతివ్రత్యతేజస్సుచేత యీమె అడిగిన వరమిచ్చుటకు సమ్మతించితిని. ఇపుడేమి చేయనగును అని యముడు యోచించి, నిలువగా సావిత్రి మరలెను. యము డామెను పోకు మని చెప్పి, ఆయుస్సు విద్య కర్మ విత్తము మొదలగునవి యింతమాత్రమని వానివానిలలాటమున ఆదిలోనే వ్రాయబడియుండును.దాని త్రిప్పుటకు త్రిమూర్తులకు యోగ్యత లేదు. నేనేమో యీమె కీరీతి వర మొసగితి. నామాట అబద్ధమగును. యేమి చేయ నగును అని యోచింప నారంభించగా, త్రిమూర్తులు త్రేతాగ్నులటుల ఆవిర్భవించి, యముని విచారించగా, నతడు జరిగినసంగతి తెలిపి, సావిత్రి పాతివ్రత్యతేజస్సుచేత తెలివిలేక ఆమెను నెటులయినను పంపగోరి అటుల ఆమెకోరిన వరమిచ్చితిని ఇపుడేమి సేయనగును అని వారితో విన్నవించెను. ఇది అపూర్వమయిన సంగతి.సత్యవంతుని విడిచిపెట్టుము అని యాజ్ఞాపించి త్రిమూర్తులు అంతర్ధానమొందిరి. వారు పోగనే,) యముడు- సావిత్రీ, నీవు ఘనురాలవు. నీకొరకు త్రిమూర్తులును వచ్చిరి. యముడ నగు నాకును నిన్ను జయించుటకు కాలేదు. నాకే సంకటమువచ్చెను.చెప్పినమాట తప్పుటకును, ప్రాణమును విడిచిపెట్టుటకును లేక అల్లాడితిని. నీపాతివ్రత్యము నన్ను కాపాడెను. ఎల్లవారిని కాపాడెను. నావరము ప్రకారము నూర్గురిని కనుము. ఇక నీవు పొమ్ము. సావిత్రి- ఈత డెవడు. య- నీభర్త. సా- ఇతని శరీరమే నాభర్త. అటులగుటచేత యీప్రాణము నాభర్త శరీరమున ప్రవేశించువరకు మీరును నాతోడ రండి. నాభర్తలేచి కన్ను తెరచినయెడల అతని పిలుచుకొని పోయెదను.